శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీమద్భగవద్గీత

పద్య గద్య అనువాదము

**అమరవాది సుబ్రహ్మణ్యదీక్షితులు,**

M.Tech.



## విషయ సూచిక

1. ముందుమాట
2. ధ్యానమ్
3. కృతజ్ఞతా సుమాంజలి
4. శ్రీ గీతామాహాత్మ్యమ్
5. ఒకటవ అధ్యాయం - అర్జున విషాద యోగము
6. రెండవ అధ్యాయం - సాంఖ్య యోగము
7. మూడవ అధ్యాయం - కర్మ యోగము
8. నాలుగవ అధ్యాయం - జ్ఞాన యోగము
9. అయిదవ అధ్యాయం - కర్మసన్న్యాసయోగము
10. ఆరవ అధ్యాయం - ఆత్మసంయమయోగము
11. ఏడవ అధ్యాయం - విజ్ఞాన యోగము
12. ఎనిమిదవ అధ్యాయం - అక్షరపరబ్రహ్మ యోగము
13. తొమ్మిదవ అధ్యాయము - రాజవిద్యా రాజగుహ్య యోగము
14. పదవ అధ్యాయము - విభూతి యోగము
15. పదునొకండవ అధ్యాయము-విశ్వరూప సందర్శన యోగము
16. పండ్రెండవ అధ్యాయము - భక్తియోగము
17. పదమూడవ అధ్యాయము - క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము
18. పదునాలుగవ అధ్యాయము - గుణత్రయ విభాగ యోగము
19. పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తి యోగము
20. పదునారవ అధ్యాయము-దైవాసుర సంపద్విభాగ యోగము
21. పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగ యోగము
22. పదునెనిమిదవ అధ్యాయము - మోక్షసన్న్యాస యోగము



## ముందు మాట

శ్రీమద్భగవద్గీత సాక్షాత్తు ఆ శ్రీకృష్ణపరమాత్మచే చెప్పబడిన అతి రహస్యమైన జ్ఞానబోధ. కురుక్షేత్ర యుద్ధారంభమున జరిగిన శ్రీకృష్ణార్జున సంవాదమే గీతాసుధ అయి తన మహిమతో ప్రపంచంలో ఎంతో మందిని పాపవిముక్తులను చేస్తోంది. ఇంకా ఏ మతగ్రంథంలోనైనా పరమాత్మకి మానవసామాన్య గుణముల నాపాదించి కథ వలె చెప్పబడియుంటుంది. కానీ గీతలో మాత్రం పరమాత్మ యొక్క సచ్చిదానంద, విశ్వవ్యాప్తిత్వ, జగత్పితా తత్త్వమే సదా ప్రకటితమవుతుంటుంది. దీనిని చదవటానికి కుల, మత, వయో లింగ బేధాలతో నిమిత్తం లేక అందరూ అర్హులే. కేవలం ఆ భగవానునిపై విశ్వాసం ఉంటే చాలును. ప్రతిదినం ఒక్కశ్లోకం చదివినా చక్కటి ప్రతిఫలాన్నిచ్చే గ్రంథం ఇదొక్కటే.

ఇందలి ప్రతి శ్లోకమూ, ఆ శ్లోకమందలి ప్రతి అక్షరమూ అర్థవంతమై జ్ఞానులకు పండితులకు ఎన్నెన్నో నిగూఢార్థములు బోధించుచుండును. అయిననూ నేటి సమాజమున సంస్కృతమునందలి అట్టి గూఢార్థములను గ్రహించగల భాషా జ్ఞానము సన్నగిల్లుచుండుటచేతనూ, ప్రతిపదార్థ తాత్పర్యసహిత గ్రంథములు లెక్కకు మించి యుండుట చేతనూ, నాకు తెలుగు పద్యములపైకల మక్కువచేతనూ, తెలుగు పద్యముల నర్థము చేసుకొనుట తేలిక అగుట చేతనూ, పద్యములు రాగ యుక్తంగా



పాడగల గాయకులు పాడి శ్రవణానందము కలుగచేయ గలరనే ఆశ కలుగుటచేతనూ, అన్నిటినీ మించి ఆ వేంకటనాధుని ప్రేరణచేతనూ ఈ భగవద్గీతను తెలుగు పద్యములలో వ్రాయాలని ఆశించాను. నేను వృత్తి రీత్యా ఎలాక్ట్రానిక్స్ ఇంజినీరుని. తెలుగు చదివినది 12వ తరగతి వరకే. అదీ 40 సంవత్సరాల క్రిందట. నేను వ్రాయగలనా అని భయపడ్డాను. కానీ వేంకటరమణునిపై భారం వేసిన నాకు కేవలం ఆ వేంకటనాధుడే నాలోచేరి వ్రాసిన రచనగానే నేను భావిస్తున్నాను. తప్పులన్నీ నావి ఒప్పులన్నీ ఆ రమావల్లభునివి. అయినప్పటికీ సహృదయంతో పెద్దలు తప్పులను మన్నించి తరువాయి ముద్రణలో సరిచేసుకునే నిమిత్తం తెలియపరుస్తారని ఆశిస్తున్నాను.

ఇకపోతే భగవద్గీత ఉపోద్ఘాతం అవసరం లేని గ్రంథరాజం. కొన్ని వేలమందిచేత వ్రాయబడిన ఈ గీత గురించి కొత్తగా నేను చెప్పేదేముంది? అయినా దీన్ని వ్రాసేటప్పుడు నాలో కలిగిన అంతర్మథనాన్ని మీతో పదిమాటలలో పంచుకుంటాను. మనకి జన్మనిచ్చి పోషించి పెద్ద చేసిన తండ్రిని మనం గౌరవించి ఆయన చనిపోయాక కూడా ఆయన నిమిత్తం కర్మలు చేస్తున్నాం. అటువంటప్పుడు ప్రాణికోటినంతటినీ పుట్టించి, పోషించి, నశింపచేస్తున్న ఆ జగత్పితని మనం ఎంత గౌరవించాలి? ఎంత పూజించాలి? ఎంత భయపడాలి? ఆయన నిమిత్తం ఎన్ని

కర్మలాచరించాలి? మనం అలా చేస్తున్నామా? లేదు. పూజించక పోతే చెడు చేస్తాడేమో అనే భయంతో మొక్కుతున్నాం అదీ మొక్కుబడిగా. తండ్రి ఎదుట భయపడి ఆయన వెనక అల్లరిగా తిరిగే కొడుకులా ప్రవర్తిస్తున్నాం. అది భయం అవుతుందేమో కానీ అనన్యభక్తి కాదు. అందుకే మనం అనుకుంటున్నట్లు ఆ స్వామిని ఎంత భక్తి తో ప్రార్థించినా మనకి మంచి జరగటం లేదని వాపోతున్నాం. ఆలోచించండి మన భక్తి ఎంతదో తెలిసిన పరమాత్మ అంతే ఫలమిస్తాడు. పరీక్షవ్రాసిన వాడికి ఎన్ని మార్కులు రావాలో నిర్ణయించేది వ్రాసినవాడు కాదు దిద్దినవాడు.

మన భక్తి ఎంత అనన్యమో నిర్ణయించేది ఆ విశ్వవ్యాప్తుడే. మన సుఖదుఃఖాలకు ఎన్నడూ స్వామిని దూషించకూడదు.

మనల్ని పుట్టించాలన్నా, రక్షించాలన్నా, శిక్షించాలన్నా, పోషించాలన్నా చివరకి భక్షించాలన్నా, సర్వాంతర్యామి ఎవరో వ్యక్తిలో దూరి ఆ పని చేయిస్తాడు. కాబట్టి మనకి ఉపకారులే కాదు, అపకారులు కూడా ఆ స్వామి రూపాలే అని తెలుసుకుని అందరినీ ఆదరించాలి. ఈ సత్యం తెలుసుకుంటే పోట్లాటలు, కక్షలూ, కన్నీళ్ళు ఉండవు. సర్వమానవ కళ్యాణం జరుగుతుంది.

ఆ ప్రభువు సాక్షీభూతుడు (న్యాయాధిపతి). నేరస్తులమీద ఆయనకు ద్వేషం గాని ప్రేమ గాని ఉండవు. నేరం బట్టి శిక్ష. చేసిన సత్కర్మలకు ఉత్తమజన్మ ఇస్తాడు ఆ ప్రభువు. నేరస్తుడైనా



సన్మార్గంలోకి మారితే శిక్ష తగ్గించటమేకాక మంచివాడిని చేస్తాడు. భక్తుడైనా నేరస్తుడయితే శిక్షిస్తాడు. వాల్మీకి, భీష్ముడు దీనికి చక్కటి ఉదాహరణలు. కనుక ఆ సాక్షీభూతుని అజ్ఞానంతో నిందించకూడదు. ఎన్నో పుణ్యకర్మల ఫలం వల్ల ప్రాణులు మానవ జన్మపొందుతాయి. ఆలోచించి, విశ్లేషించి, సన్మార్గం ఎన్నుకోగల ప్రాణి మానవుడొక్కడే. ఆ పరంధాముడు ఇచ్చిన ఈ జన్మను ఆయనకు ప్రీతి కలిగించే పనులు చేసి ఇంతకన్నా ఉత్తమమైన జన్మ పొందుదాము. అలా ఎన్నో జన్మల అనంతరం ఆయనను తప్పక పొందుతాము. ఆయనకోసం మనము చేయాల్సింది ఏమీలేదు. మనము ఎన్నుకొన్న ఉద్యోగాన్ని నిజాయితీగా ధర్మపూర్వకంగా అదే దైవమని భావించి చేయాలి. మనము చేసిన కర్మలఫలితాన్ని శ్రీకృష్ణార్పణం చేయాలి. ఏదన్నా దానం చేసేటప్పుడు విసుక్కోకుండా సంతోషంగా శ్రీకృష్ణార్పణమస్తు అని చేయాలి. పుణ్యాలతో పాటు పాపాలు మనం తెలిసో, తెలియకో రోజు చేస్తూనే ఉన్నాం అని మరువకూడదు.

మన కర్మఫలాలు మంచైనా చెడైనా అనుభవించడానికి జన్మలెత్తక తప్పదు. మళ్ళీ ఆ జన్మలో కర్మలు చేయక తప్పదు. ఈ జన్మల కర్మబంధాలు పోవడానికి మన కర్మల ఫలాన్ని ఆ పరమాత్మకే అర్పించాలి.

ఎవరికిష్టమైన దేవతలను వారు ఎవరిని కొలిచినా



పరమాత్మను కొలిచినట్లే. మోక్షం కోరేటట్లయితే మాత్రం ఆ పరమాత్మని ఆశ్రయించక తప్పదు. పరమాత్మకి ప్రీతికలిగించే మానవులు ఎవరంటే, ఎవరైతే దైవీసంపద కలిగి ఉంటారో, త్రిగుణ రహితులో, స్థితప్రజ్ఞులో, చేసేపని దైవసమానంగా భావించి కర్మఫలాన్ని దైవానికి అర్పించి దేహధారణకొరకు మాత్రమే కర్మలు చేస్తుంటారో వారు. వారి లక్షణాలు తెలుసుకోవడానికి గీతను చదవాలి. పరమాత్మను ఎక్కడో వెతకటం మానేసి ఈ గీత మనము శ్రద్ధగా చదువుతుంటే ఆయన మన ప్రక్కనే కూర్చుని వింటున్నాడని, మనము మన భౌతిక నేత్రాలతో ఆయనను చూడలేక పోతున్నామని గ్రహించాలి.

మనిషికి ఈ జన్మరాహిత్యం ఉత్తమోత్తమం. అది ఎలా లభ్యమవుతుందో గీత చదివి తెలుసుకోవాలి. ఉత్తమ జన్మ పొందటం కూడా కోరదగ్గదే దానికోసం పంచకార్యక్రమ ప్రణాళిక ద్వారా సాధించాలి. మంచి ఆలోచన, మంచి మాట, మంచి వినుట, మంచినే చూచుట, మంచి చేయుట. మంచి అంటే మనకు కాదు సంఘానికి మనతోటివారికి.

ఇక ప్రస్తుతం నేను వ్రాసిన ఈ గీతానువాదం గురించి :

శ్లోకభావం యథాతథంగా రావటం కోసం పద్యాలు చాలా వరకు ఉపజాతులు సీస పద్యం, తేటగీతులు, ఆటవెలదులు (సీ॥, తే॥, ఆ॥వె॥) ఎన్నుకొన్నాను. కొన్ని చోట్ల వృత్తములు, ఉత్పలమాల,



కందము, చంపకమాల, మత్తేభము, శార్దూలము (ఉ॥, కం॥, చం॥, మ॥, శా॥) ఎన్నుకొన్నాను. శ్లోకభావం పద్యరూపేణా తృప్తి కలిగించని చోట నిస్సంకోచంగా వచనం వాడాను. భావం ఇంకా విపులీకరించాల్సిన చోట "వ్యాఖ్య" అని వచనంలో చెప్పాను. పద్యములకు వాడిన భాష వాడుకభాష కావడంవల్లనూ, పదముల కూర్పు అన్వయించుకోవాల్సిన అవసరం లేకుండా చదువుతూనే అర్థం కావడంకోసం సంధులను విడదీసి వ్రాయడం జరిగింది. అలాగే అ, ఇ, ఎ, ఒ, లతో పదములను తేలికగా అయ్యేటందుకు యకారంలేకుండా వాడాను. ఇది నా ప్రథమ ప్రయత్నం కావడంవల్ల రసస్ఫూర్తి లోపానికి, వ్యాకరణదోషాలకు నిందించక క్షమించి పెద్దలు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను.

## అథ ధ్యానమ్

1. ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
   వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్।
   అద్వైతామృతవర్షిణీం భగవతీ మష్టాదశాధ్యాయినీ–
   మమ్బ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్॥
2. నమోఽస్తుతే వ్యాస విశాల బుద్ధే ఫుల్లారవిన్దాయతపత్రనేత్ర।
   యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥
3. ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
   జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥
4. సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాల నందనః।
   పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥
5. వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
   దేవకీ పరమానందం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥
6. మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్।
   యత్కృ పా తమహం వన్దే పరమానన్దమాధవమ్ ॥
7. యం బ్రహ్మ వరుణేన్ద్రరుద్రమరుతః స్తున్వన్తి దివ్యైః స్తవైః
   వేదైః సాంగపదక్రమోపనిషదై ర్గాయన్తి యం సామగాః ।
   ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యన్తి యం యోగినో
   యస్యాన్తం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః॥



## కృతజ్ఞతా సుమాంజలి

శా॥ శ్రీలక్ష్మీసతి అల్కతో విడివడెన్ సీమాటియౌ భార్యతో
ఏలా బాధలటంచు నీవు భువిలో ఈతీరునన్ నిల్చి, ఓ
లీలా మానుష విగ్రహా! నరులలో లీలన్ స్వయం బుందుచున్
నాలావున్ కదుపెంచు వేంకటపతీ! నాపాలి సంరక్షకా!

మ॥ కలరే అన్యులు నిన్ను మించి ఇలలో కష్టంబులన్ తీర్పగన్,
కలరే వేల్పులు ఇంతలో వరములన్ కారుణ్యమే చూపి ఈ–
గలరే మూడు జగాల, వేంకటపతీ! కాకున్న నా బోటికిన్
కలలో సాధ్యమె! గీతలన్ తెలుగులో కట్టంగ నాశక్యమే!!

ఉ॥ కుంతిని కాక బ్రోచితివి, కోరిన కోర్కెలు తీర్చినావు, పూ–
వింటి మనోజుగన్న పిత! వేడుక వైద్యుల నీవు దూరి నా–
కంటిన రోగముల్ నయముగా నొనరించితివయ్య, గీత నా
వెంటనెయుండి దిద్దితివి వీడక సుందర రామ చుండివై.

చం॥ చదివిన దేమి? చేసినవి 'చాకిరు' లేమి? ముకుంద! నేడునా
ఉదరమునింపగన్ మిగుల ఓర్పున చేసెడి వృత్తి ఏమి? నే
పదములు పద్యముల్ కవిత పట్టుదలన్ యిటు వ్రాయుటేమి? నా
మదిని నివాసమై అమరవాదిని దీక్షితు బ్రోచుటన్ ప్రభూ!

కం॥ పలికితి భగవద్గీతను
పలికించెడివాడు కృష్ణ పరమాత్ముండై
ఫలమాస వీడి వ్రాసితి
అలవేంకటనాధుకిద్ది అంకిత మిడుదున్.



## శ్రీగీతా మహాత్మ్యం

**ధరోవాచ:–**

భగవన్ పరమేశాన భక్తిరవ్యభిచారిణీ।
ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో॥

**శ్రీ విష్ణు రువాచ :–**

ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా।
సముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥
మహాపాపాది పాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।
క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళ మంభసా ॥
గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్రవై ॥
సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।
గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః।
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే॥
యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్।
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవ హి॥
గీతా శ్రయోఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్।



గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్‌లోకాన్ పాలయామ్యహం॥
గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః।
అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా ॥
చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్।
వేదత్రయీ పరానందా తత్త్వార్థ జ్ఞానమంజసా ॥
యోఽష్టాదశ జపే న్నిత్యం నరో నిశ్చలమానసః।
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ ॥
పాఠేఽసమర్థస్సంపూర్ణే తదర్ధం పాఠమాచరేత్।
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః ॥
త్రిభాగం పఠమానస్తు గంగా స్నానఫలం లభేత్।
షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ ॥
ఏకాధ్యాయంతు యో నిత్యం పఠతే భక్తి సంయుతః।
రుద్రలోక మవాప్నోతి గణోభూత్వా వసేచ్చిరమ్ ॥
అధ్యాయ శ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః।
సయాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే॥
గీతాయాః శ్లోక దశకం సప్త పంచ చతుష్టయమ్ ।
ద్వౌత్రీనేకం తదర్ధంవా శ్లోకానాం యః పఠేన్నరః॥
చన్ద్రలోక మవాప్నోతి వర్షాణామయుతం ధ్రువం ।

గీతాపాఠ సమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్॥
గీత్యాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తి ముత్తమాం ।
గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ ॥
గీతార్థ శ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా॥
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే॥
గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః॥
జీవన్ముక్త స్స విజ్ఞేయో దేహాన్తే పరమం పదమ్ ॥
గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః॥
నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరం పదమ్॥
గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్॥
వృథాపాఠో భవేత్తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః॥
ఏతన్మాహాత్మ్య సంయుక్తం గీతాభ్యాసం కరోతి యః॥
స తత్ఫల మవాప్నోతి దుర్లభాం గతి మాప్నుయాత్॥

**సూత ఉవాచ :**

మాహాత్మ్యమేతద్గీతాయా మయా ప్రోక్తం సనాతనం ।
గీతాన్తే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ ॥



# గీతా మహాత్మ్యము

భూదేవి విష్ణుమూర్తిని "ప్రభూ! ప్రారబ్ధం అనుభవించే వాడికి అనన్య భక్తి ఎలా కలుగుతుంది" అని అడుగుతుంది.

దానికి విష్ణుమూర్తి ఇలా అన్నాడు. "ఓ భూదేవీ అనన్యభక్తి కలగాలంటే గీతను అభ్యసించవలెను. అట్లు గీతను అభ్యసించినవాడు ముక్తి పొంది సుఖపడి కర్మ బద్ధుడు కాడు తామరాకు నీటిని అంటనట్లు వానికి పాపములంటవు. గీత ఉన్నచోట, గీతా పఠనము జరిగేచోట, ప్రయాగ వంటి తీర్థములన్నీ ఉంటాయి. సర్వదేవతలు, ఋషులు, యోగులు, గోపాలురు, గోపికలు, భాగవతులు వచ్చి తోడ్పడుతారు. గీతను చర్చించటం, చదవటం, బోధించటం, వినటం జరిగే చోట నేను సదా నివసిస్తుంటాను. నా ఆశ్రయము, ఉత్తమ నివాసము ఆ గీతాశాస్త్రము. గీతా జ్ఞానముతోనే నేను లోకాలను పాలిస్తున్నాను. ఈ గీత నాశరహితము, శాశ్వతము, వర్ణనాతీతం, బ్రహ్మస్వరూపం, అర్ధమాత్రా స్వరూపం. ఇందులో సందేహం లేదు. శ్రీకృష్ణుడు పార్థునికి స్వయంగా చెప్పిన ఈ గీత త్రివేదముల సారం, తత్త్వజ్ఞాన మివ్వగలిగినది.



ఈ గీతను నిర్మలమైన మనస్సుతో ప్రతి నిత్యం పదునెనిమిది అధ్యాయాలు పారాయణం చేసేవాడు జ్ఞానసిద్ధి, ఆ పిదప పరమపదము పొందుతాడు. దీనిని పూర్తిగా చదువలేనివారు సగం చదివితే గోదాన ఫల ప్రాప్తులవుతారు. మూడవభాగం చదివిన గంగాస్నాన ఫలం, ఆరోభాగం చదివిన సోయమాగ ఫలం, ఒక్క అధ్యాయం చదివిన రుద్రలోక ప్రాప్తి లభిస్తాయి.

ప్రతిరోజు అధ్యాయములో నాల్గవవంతు చదివిన వారు భూమియందు మన్వంతరం జీవించి యుందురు. పదిగానీ, ఏడుగానీ, ఐదుగానీ, రెండుగానీ తుదకు ఒక్క శ్లోకమైనా నిత్యము చదివిన పదివేల వత్సరంబులు చంద్రలోకమున నుందురు. మరణించునప్పుడు పారాయణము చేయుచున్న మనుజుడు దేవత్వము నొందును. ఎంత పాపులైనా అర్థయుక్తంగా గీత వినుటకు శ్రద్ధ వహిస్తారో వారు వైకుంఠం పొందుతారు.

మనిషి ఏ జీవన కర్మ చేస్తున్నా ప్రతి నిత్యం గీతా పారాయణం చేసేవారు జీవన్ముక్తులవుతారు. పలువురు



రాజర్షులు అదేవిధంగా పరమపదము నొందిరి. భగవద్గీతా పారాయణం తర్వాత గీతా మాహాత్మ్యం పఠించని యెడల వ్యర్థమై ఫలం దక్కదు. గీతా మాహాత్మ్యం చదివినవారు గంగాస్నానాది ఫలములు పొందుతారు.

సూత మహర్షి చివరి సారిగా ఇలా అన్నాడు "నాచే వచించబడిన ఈ భగవద్గీత మాహాత్మ్యమును గీతా పారాయణము తర్వాత చదివిన వారికి ఆ గీతా పారాయణ ఫలము తప్పక దక్కును."

శ్రీ మద్భగవద్గీతా మహాత్మ్యము సంపూర్ణము.

# శ్రీమద్భగవద్గీత

# ఒకటవ అధ్యాయము

# అర్జున విషాద యోగము

## ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు.

**1 నుండి 11 వ శ్లోకము వరకు-** కురుక్షేత్రమున పాండవుల కౌరవుల సేనల యందలి ముఖ్యులైన వీరుల వర్ణన.

**12 నుండి 19వ శ్లోకము వరకు** ఆయా సేనల యొక్క శంఖ నినాదములు.

**20 నుండి 28వ శ్లోకము వరకు** అర్జునుని సేనా నిరీక్షణమును గూర్చిన ప్రసంగము.

**28 నుండి 47వ శ్లోకము వరకు** మోహగ్రస్తుడైన అర్జునుని విషాదపూరితవచనములు.

ఈ అధ్యాయము చదివినవారికి కలిగే ఫలప్రాప్తి
పాప విముక్తి, పూర్వజన్మ స్మృతి.



1. **ధృతరాష్ట్ర ఉవాచ**
ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥

**ఆ॥వె॥ ధర్మక్షేత్రమయిన ధరఁ గురుక్షేత్రాన
నాదు సుతులు పాండునందనులును
ధర్మ యుద్ధమునకు తరలిరి సంజయా!
చేసిరేమి తెలుపు చేరి అచట.**

2. **సంజయ ఉవాచ**
దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా।
ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥
3. పశ్యైతాం పాండుపుత్రాణామాచార్య మహతీం చమూమ్।
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥
4. అత్ర శూరా మహేష్వాసా భీమార్జున సమా యుధి।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥
5. ధృష్టకేతుశ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ ।
పురజిత్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥
6. యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥



7. అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్బ్రవీమి తే ॥
8. భవాన్భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ ॥
9. అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥

**అప్పుడు సంజయుడిలా అన్నాడు**

**సీ॥ యుద్ధ మెప్పుడనుచు సిద్ధమై యున్నట్టి
శత్రుసేనల చూచి ఆత్రపడుచు
తెలిపెద్రోణునునికి దృఢముగా రారాజు,
అరిమూక వ్యూహంపు తీరు కనుము,
భీమ పార్థ సములు వీరవర్యులు, కాశి
పతియును, ఆ దృష్టకేతువరులు
సాత్యకి విరటుని జతచేరె, శైబ్యుడు
చేకితానాదులు చేరి రచట,**

**తే॥ అట్టి వీరుల దీటుగా అమరినారు
మనకు శూరులు ఎరుగంగ మనవి చేతు,
కర్ణ భీష్ములు మీరును కలరు కృపుడు
యుద్ధమందున మడియంగ సిద్ధపడిరి.**



10. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥

**వ॥ ఓ గురువర్యా! భీమునిచే రక్షింపబడుచున్నదేమో పరిమితమైన సేన. మన సేన అపరిమితము, అజేయము, భీష్ముని చేత రక్షింపబడుచున్నది. అందుచేత శత్రువులను జయించుట సులభము.**

11. అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।
భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥
12. తస్య సంజనయన్హర్షం కురువృద్ధః పితామహః।
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్॥

**ఉ॥ భీష్ముని రక్షలో కలదు భీకరమైన అనంతసేన, ఆ
భీష్ముని కావగా వలయు భీమ సురక్షిత సేన నుండి, ఆ
భీష్ముడు వాని మాటవిని పేర్మి ముదంబును కూర్చురీతి తా
భీష్మపు గర్జనన్ సలిపి భీకరమౌవిధి శంఖమూదగన్.**

13. తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్ ॥

**వ॥ ఆటుపిమ్మట ఆ ధ్వనితోపాటు ఇతరుల శంఖములు, నగారాలు, తప్పెటలు, మృదంగములు, గోముఖ వాద్యములు మొదలుగునవి ఒక్కసారిగా మ్రోగినవి. ఆ శబ్దములచే దిక్కులు పిక్కటిల్లెను.**

14. తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనేస్థితౌ ।
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః॥
15. పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః।
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥
16. అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥
17. కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజిత ః ।
18. ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్దధ్ముః పృథక్ పృథక్॥

**సీ॥ శ్వేతాశ్వముల పూన్చి చైతన్య రథముపై**
**కృష్ణుండు సారథై క్రీడి చేరి,**
**పాంచజన్యంబూదె, పాకారి సుతుడునూ**
**దేవదత్తముబూని దీటునూదె,**
**తా ననంతవిజయమును యుధిష్ఠిరుడూదె,**
**పౌండ్రంబునూదెనా పవన సుతుడు,**
**తన సుఘోషమునూదె తగినట్లు నకులుండు,**
**మణిపుష్పకమునూదె వాని భ్రాత,**



**తే॥ కాశిరాజుయు సాత్యకి కలిసి జతగ,**
**ఆ విరాటుడున్ ద్రుపదుండు ఆ శిఖండి**
**ద్రుపదపుత్రుండు అభిమన్యుతోడ వారి**
**వారి శంఖములూదిర భయము కలుగ**

19. స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥

**వ॥ పాండవపక్ష యోధుల శంఖారావములతో భూమి ఆకాశములు దద్దరిల్లినవి. అవి ధార్తరాష్ట్రుల గుండెలు బద్దలు చేసెను.**

20. అథ వ్యవస్థితాన్దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥
21. హృషీకేశం తదా వాక్యమిదమాహ మహీపతే ।
**అర్జున ఉవాచ**
సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥

**తే॥ యుద్ధ సన్నద్ధులయినట్టి యోధవరుల**
**నందరిని చూచి పార్థుడు అచ్యుతునికి**
**అనెను "రథమును ఉభయుల సేనమధ్య**
**నిలిపియుంచుము అచ్యుత! నీవు యిపుడు"**



22. యావదేతాన్నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్రణసముద్యమే ॥

**ఉ॥ యుద్ధము చేయ నిల్వడిన యోధుల నిట్లు రణంపు మధ్యలో**
**సిద్ధముయైన వారలను చేరుచు చూచెద నేను, యేరితో**
**యుద్ధము చేయగావలెనొ ఒప్పుచు నచ్యుత! అంతదాకనీ**
**యుద్ధపు రంగమధ్యమున యొక్కెడ స్యందన మొప్పనిల్పుమా.**

23. యోత్స్యమానానవేక్షేహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః ॥

**ఆ॥వె॥ దుష్టబుద్ధి అయిన దుర్యోధనున్‌జేరి**
**పోరవచ్చినట్టి వారినెల్ల**
**ఒక్క మారు నేను చక్కగ పరికించ**
**దలచినాను కృష్ణ! తనివి దీర.**

**24.** సంజయ ఉవాచ
ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయోరుభయోర్యధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥
25. భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతాన్సమవేతాన్కురూనితి ॥



**వ॥ ఓ రాజా! అర్జునుని కోరిక మేరకు శ్రీకృష్ణుడు ఆ దివ్యరథమును భీష్మ ద్రోణ ప్రముఖులకును మరియు అన్యరాజుల సమక్షమున ఉభయసేనల మధ్య నిలిపి అర్జునునితో "ఓ పార్థా! ఇక్కడ సమావేశమయిన కౌరవులందరినీ ఒకపరి చూడుము" అని నుడివెను.**

26. తత్రాపశ్యత్ స్థితాన్పార్థః పితౄనథ పితామహాన్ ।
ఆచార్యాన్మాతులాన్భ్రాతౄన్పుత్రాన్పౌత్రాన్సఖీంస్తథా॥
27. శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయో రుభయోరపి॥
తాన్సమీక్ష్య స కౌంతేయః సర్వాన్బంధూనవస్థితాన్॥
28. కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।

**చం॥ ఇరువురి సేనలో కలుగు ఇష్టుల తాతల మేనమామలన్,**
**వరుసలనున్న మామలను, వారల బందుగు లన్నదమ్ములన్,**
**గురువుల పౌత్రులన్ సుతుల కూరిమి మిత్రుల చూచి యత్తరిన్**
**పరవశుడయ్యె దుఃఖమున పార్థుడు కన్నుల నీరు క్రమ్మగన్.**

**వ॥ అప్పుడు శోకతప్తుడైన అర్జునుడు దయార్ద్ర హృదయుడై విషాదముతో శ్రీకృష్ణుని చూచి ఇలా అన్నాడు.**

**అర్జున ఉవాచ**
దృష్ట్వేమంస్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్॥

29. సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే॥
30. గాండీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥
31. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయో ఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే॥
32. న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా ॥

**సీ॥ అడగు నా బంధులన్ చూడంగ నా నోరు**
**ఎండుచున్నది కృష్ణ! మెండుగాను,**
**అవయవాల్ తడబడెన్, అదిరె నాతనువెల్ల,**
**కరమునుండియు జారె గాండివంబు,**
**అగ్నియై ఈ దేహమది మండుచున్నది,**
**నిలబడనైనను బలములేదు,**
**తల్లడిల్లె మనము అల్లకల్లోలమై,**
**దుశ్శకునములన్ని తోచె నాకు,**
**స్వజనంబులన్ చంప సరియని తోపదు,**
**నావారి చంపుట న్యాయమౌనె**



**తే॥ జయము కోరను నాకు రాజ్యమ్ము వలదు,**
**సుఖములను కోర గోవింద! చూడుమయ్య,**
**రాజ్య భోగముల్ కాంక్షించ, లాభమేమి?**
**ఇట్లు జీవించి ఫలమేమి ఇపుడు నేను.**

33. యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ।
త ఇమే ఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనానిచ॥
34. ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా॥

**వ॥ ఓ కృష్ణా! ఎవరి నిమిత్తము ఈ రాజ్యభోగములను కోరుచుంటిమో అట్టి నా గురువులు, తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, మేనమామలు, మామలు, బావమరదులు ఇతర సంబంధులు నేడు ధనప్రాణముల మీద ఆసవదలి యుద్ధరంగమున నిలబడియున్నారు.**

35. ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥

**ఉ॥ చంపిన చంపుగాక నను సంగరమందున కృష్ణ! వారు నే**
**చంపగలేను బందుగుల చక్కగ పొందియు మూడు లోకముల్**
**చంపగ జాల గల్గుదునె చంచల రాజ్య సుఖమ్ము కోసమై,**
**చంపిన పొందువైభవము సంతసమాయది దైత్యమర్దనా!**



36. నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన ।
పాపమేవాశ్రయేదస్మాన్హత్వైతానాతతాయినః ॥
37. తస్మాన్నార్హావయం హన్తుం ధార్తరాష్ట్రాన్స్వబాంధవాన్।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥

**కం॥ చంపిన నీ పాపాత్ముల**
**ఇంపగునా, పాపమగును, ఏదేమైనన్**
**చంపుట తగునే స్వజనుల,**
**చంపిన సుఖమౌనె మనకు జగతిని కృష్ణా !**

38. యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥
39. కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥

**వ॥ ఓ కృష్ణా! రాజ్యలోభముచే భ్రష్టచిత్తులయిన ఈ కౌరవులు కులక్షయమువలన కలుగు దోషములను మిత్రద్రోహమువలన సంభవించు పాపములను తెలిసికొనకపోయినను, మనకు ఈ దోషము చక్కగా తెలిసి కూడా ఈ పాపమునకు దూరముగా నుండుటకు ఏల యోచించరాదు?**



40. కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మోఽభిభవత్యుత ॥
41. అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥
42. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః ॥
43. దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥

**సీ॥ వంశనాశనమున పాడవున్ ప్రాచీన**
**కులధర్మములు ఇలన్ కూలిపోవు,**
**కులధర్మ నాశంబు కులమెల్ల చెరచంగ**
**తా నధర్మమెపుడు తాండవించు,**
**ఇల నధర్మము మీరి కులకాంతలును చెడి**
**జాతి సంకరమట్లె జరిగి తీరు,**
**కులసంకరము వల్ల కలుగు నరకప్రాప్తి,**
**పితృదేవతలకు పిండప్రాప్తి**

తే॥ అందకుండగ బోవును, అదియుగాక
చెదును కులధర్మమెల్లను, చెదును అటులె
జాతిధర్మము, దానితో జనులు తుదకు
నరక ప్రాప్తిని పొందరే నందతనయ!

44. ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।
నరకేనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥

వ॥ ఓ కృష్ణా! కులధర్మం నశించిన మానవులకు
నిరవధికంగా నరకప్రాప్తి అని కదా! ప్రతీతి.

45. అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్।
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః ॥

46. యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమతరం భవేత్ ॥

తే॥ రాజ్యలోభాన నావారి రచ్చ జంప
ఘోరపాపమ్ము ఎంతటి దారుణమ్ము
అయయొ! అస్త్రముల్ వీడినయట్టి నన్ను
ఆలమున చంప మిక్కిలి మేలు నాకు.

**47.** సంజయ ఉవాచ
ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥



వ॥ ఓ ధృతరాష్ట్ర మహారాజా! అర్జునుడు అలా చెప్పి దుఃఖాక్రాంతుడై విల్లమ్ములు విడిచిపెట్టి రణరంగంలో రథంమీద చతికిలబడెను.

## ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు
## శ్రీమద్భగవద్గీత లోని
## అర్జున విషాద యోగము అను
## ఒకటవ అధ్యాయము.



శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత
## రెండవ అధ్యాయము
## సాంఖ్యయోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు:

**1 నుండి 10వ శ్లోకము వఱకు** అర్జునుడు యుద్ధవిముఖుడైనందున శ్రీకృష్ణుని సంవాదము

**11 నుండి 30వ శ్లోకము వఱకు** సాంఖ్యయోగము గురించిన వివరణ

**31 నుండి 38వ శ్లోకము వఱకు** క్షత్రియధర్మము నవలంబించి యుద్ధము చేయువలసిన ఆవశ్యకతను వివరించి నిరూపించుట.

**39 నుండి 53వ శ్లోకము వఱకు** నిష్కామ కర్మయోగము గురించిన వివరణము

**54 నుండి 72వ శ్లోకము వఱకు** స్థితప్రజ్ఞుడెవ్వడు, వాని లక్షణములు, మహత్త్వము లెట్టివి అనువాని వివరణము.

ఇందు 2,3 పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :
3, 11, 14 16, 20, 22, 27, 30, 38, 40, 44, 46, 47, 48, 50, 53, 58, 63, 66, 70

**ఈ అధ్యాయం చదివినవారికి కలిగే ఫలప్రాప్తి:**
**ఆత్మ జ్ఞానలాభము, రోగనాశనము**

## శ్రీమద్భగవద్గీత
## రెండవ అధ్యాయము - సాంఖ్య యోగము

1. సంజయ ఉవాచ
తం తథా కృపయావిష్ట మశ్రు పూర్ణాకులేక్షణమ్ ।
విషీదంతమిదం వాక్యమువాచ మధుసూదన ః ॥

**వ॥ సంజయు డిలా అన్నాడు**
**"ఓ రాజా! దీనుడైన అర్జునుడు దుఃఖ మోహితుడై కన్నీరు కారుస్తుంటే ఆ శ్రీకృష్ణ పరమాత్మ ఇలా అన్నాడు...**

2. శ్రీభగవానువాచ
కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున ॥

3. క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్య క్త్వోత్తిష్ఠ పరంతప ॥

**కం॥ ఎందులకీ చెడుమోహము**
**ఎందులకీ బేలతనము ఇత్తరి కలిగెన్**
**ముందుగ విడువుము నీచము**
**పొందుగ శత్రువులదునుము పొందుము కీర్తిన్.**

**వ॥ ఓ అర్జునా! నీచమైన ఈ హృదయ దౌర్బల్యమును వీడి కర్త వ్యోన్ముఖుడవు కమ్ము.**



4. అర్జున ఉవాచ
కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥

5. గురూనహత్వా హి మహానుభావాన్
శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహలోకే ।
హత్వార్థకామాంస్తు గురూనిహైవ
భుఞ్జీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥

**వ॥ అప్పుడు అర్జును డిలా అన్నాడు...**

**ఉ॥ ఏవిధి జంపనీగురుల, నేవిధి తాతల దేవదేవ! నే**
**నీవిధి సంహరించి, ఇటు ఇత్తరి పొందిన రాజ్యమేటికిన్,**
**ఏవిధినైననున్ తిరిపెమెత్తుట సేమమె, దీనికన్ననో**
**కోవిద! యుద్ధమున్ సలుప గోరుట న్యాయమొ కాదొ తెల్పుమా!**

6. న చైతద్విద్మః కతరన్నో గరీయో
యద్వా జయేమ యది వా నో జయేయుః ।
యానేవ హత్వా న జిజీవిషామ
స్తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥

**ఆ॥వె॥ అపజయంబొ జయమొ అది తెలియగబోము**
**ఎవరి జంప జీవితేచ్ఛ మడియు**
**అనికి సిద్ధమయిరి ఆ ధార్తరాష్ట్రులు**
**ఏమి జేతు, కోరి ఎవరి ద్రుంతు.**



7. కార్పణ్యదోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥

**ఆ॥వె॥ కృపణచేత నేడు కృశియించె యుల్లంబు**
**సందియమును నేను పొందుచుంటి**
**ఏది హితవొ తెలుపు మేను నీ శిష్యుండ**
**శరణునొందినాడ సత్యమిదియె.**

8. న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్
యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।
అవాప్య భూమావసపత్నమృద్ధం
రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥

**ఆ.వె॥ రాజ్యభోగమిచ్చు రాజ్యంబు బొందుచు**
**స్వర్గసుఖములెల్ల చవిగొనంగ**
**ఇంద్రియముల తుదకు నెండించు దుఃఖమ్ము**
**తొలగిపోవు దారి తెలియరాదు.**

9. సంజయ ఉవాచ
ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
నయోత్స్య ఇతి గోవిందముక్త్వా తూష్ణీం బభూవ హ ॥



10. తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।
సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ॥

**వ॥ సంజయుడిలా అన్నాడు: ఇట్లు చింతిచుచూ పార్థుడు యుద్ధం చేయనని ఊరకున్నాడు. రెండు సేనల మధ్య దుఃఖ వివశుడైన అర్జునుని చూచి శ్రీకృష్ణ పరమాత్మ పరిహాసంగా నవ్వి ఇట్లా అన్నాడు..**

11. శ్రీభగవానువాచ
అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః ॥

**వ॥ ఓ అర్జునా గొప్ప బుద్ధిమంతుడిలా మాట్లాడుతున్నావు కాని..**

**కం॥ పగవారలకై ఈవిధి**
**వగవంగానేలనయ్య! వ్యర్థులకొరకై**
**వగవరు వివేకు లెపుడీ**
**పగిదిని మృతికిన్ కిరీటి! బ్రతుకునకైనన్**

12. న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామస్సర్వే వయమతః పరమ్ ॥

**వ॥ ఓ అర్జునా నీవూ నేనూ ఈ రాజన్యులందరూ భూతకాలం లోనూ ఉంటిమి. ఇప్పడూ ఉన్నాము ఇకముందు భవిష్యత్తు నందునూ ఉందుము. అందుచేత...**

13. దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి ॥
ఉ॥ **మానుము దుఃఖమీపగిది మాన్యత కాదిది నీకు అర్జునా!**
**వేనికె కల్గనీ దశలు వేలుగ బాల్యము**
**యౌవనమ్ముదిన్, తానును జీవుడట్లె యిల దాల్చును**
**నూతన దేహమందుచే కానరు దుఃఖమేపగిది**
**గౌరవనీయులు జ్ఞానులీభువిన్.**
14. మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యాస్తాంస్తితిక్షస్వ భారత ॥
తే॥ **విషయ సుఖమందు దేహము వివశమగుచు**
**తగులచేయును శీతోష్ణ ద్వంద్వములను**
**మనిషి సుఖదుఃఖములనిట్లె మనును మడియు**
**ఓర్చుకొనుమయ్య వాటినిన్ ఉన్నతముగ.**
15. యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥
వ॥ **ఓ అర్జునా ! ఈ ప్రపంచంలో శీతోష్ణములు, సుఖ**
**దుఃఖములు, జయాపజయములూ, మానావమానములూ**
**మొదలైనవన్నీ ద్వంద్వములనబడే వైరిభావములు. ఇవి ఎవరిని**
**బాధించవో వారే నిజముగా ముక్తికి అర్హులు. అనగా మంచికి**
**పొంగుట చెడుకు క్రుంగుట తగదు.**
16. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽన్తస్త్వనయోస్తత్త్వదర్శిభిః ॥



17. అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥
ఉ॥ **లేనిది ఉండదేటికిని, లేకనెయుండదు ఉన్నదెన్నడున్,**
**దీని నెరుంగ జాలుదురు ధీరతగల్గిన తత్త్వజ్ఞానులే,**
**పూనిక నిండియున్నదిల పూర్తిగ బ్రహ్మము విశ్వమంతయున్,**
**దానిని నాశమంతమవుదానిగ చేయగలేరు ఎవ్వరున్.**
18. అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥
19. య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥
ఉ॥ **ఆత్మయె శాశ్వతంబగును, అయ్యెదు నాశము ఈశరీరమే,**
**ఆత్మయె అప్రమేయమగు, ఆలము చేయుట ఒప్పు నీకిలన్**
**ఆత్మకు చావుయున్నదని ఆత్మయు చంపెడునట్టిదానిగన్**
**ఆత్మను ఈవిధిన్ తలచునందరు మూర్ఖులె పాండునందనా!**
20. న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥
ఉ॥ **చావుల పుట్టుకల్ బడక శాశ్వతమైనది ఆత్మ, నేడదే**
**చేవగ నుండ బోవుటయు, చేరుచు నొక్కెడ లేకపోవుటన్**
**ఈ విధి కాదు ఎన్నడును ఏలన, ఆత్మ యనాదిదౌటచే**
**కావున నాశనంబగును కాయమె, ఆత్మయు చావులేనిదౌ.**



21. వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హన్తి కమ్ ॥
కం॥ **నాశన రహితము ఆత్మయె**
**నాశము పుట్టుకయులేని నాణ్యత నొప్పున్**
**నాశము చేయగబోడిటు**
**నాశము చేయించలేడు నరుడది తెలియన్.**
22. వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥
కం॥ **మనుజుడు వదలును చీకిన**
**తన వస్త్రము అంతెగాక, దాల్చును మేలౌ,**
**అనవుగ ఆత్మయు తా నూ-**
**తనమగు దేహమును పొందు తనువును వీడన్.**
వ॥ **కావున మరణమంటే ఒక ఆత్మ ఒక శరీరం వదలుట , వేరొక**
**శరీరం దాల్చి మరొక జన్మ ఎత్తుట అనగా పుట్టుట. ఇవి రెండూ**
**కేవలం శరీరానికి జరిగే మార్పులే. అందుచేత చావును**
**గురించి నీకు చింత ఎందుకయ్యా.**
23. నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥
24. అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్యస్సర్వగతః స్థాణురచలోఽయం సనాతనః ॥



25. అవ్యక్తోఽయమచింత్యోఽయమవికార్యోఽయముచ్యతే ।
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ॥
ఉ॥ **ఆత్మనుద్రుంచ వాయుధము, లాహుతి చేయగలేదు అగ్ని, యా**
**ఆత్మయె తా సనాతనము, ఆయది నిత్యము, సర్వవ్యాప్తమౌ,**
**ఆత్మయె ఏ వికారముల నందదు, వ్యక్తము కానిదౌ తగన్**
**ఆత్మయె నీటిలో తడువ, దయ్యది ఎండదు, శాశ్వతంబగున్.**
వ॥ **అట్టి ఈ ఆత్మతత్త్వము తెలిసికొని నీవు దుఃఖింపతగదు.**
26. అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి ॥
27. జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥
ఉ॥ **చావులు పుట్టుకల్ కలవు చక్కగ ఆత్మకు దేహమట్లుగా**
**భావనచేసి నీవిటుల బాధనుపొందగ పాడికాదు, ఈ**
**చావది తప్పదీ ఇలను జన్మనుపొందిన ప్రాణికోటికిన్**
**జీవులు చచ్చిపుట్టునిక చింతనుబొందుట దేనికర్జునా !**
వ్యాఖ్య: **అదియునుం గాక, చావుపుట్టుకల మధ్య ఆ జీవునికి**
**ఏమిజరుగుతుందో ఎవరూ చూడలేదు. అందుచేత దాని**
**గురించి ఎవరికీ తెలియదు. అందరూ తమతమ మిడిమిడి**
**జ్ఞానంతో తెలియు ననుకుంటారు.**
28. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥

కం॥ జీవుడు పుట్టక పూర్వము
జీవుని మరణాంతమందు చెందెడి రూపున్
ఆ విధము తెలియనేరము
కావున మధ్యంబునందు కలత ఇదేలా.

29. ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవచ్చైనమన్యశ్శృణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥

30. దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥

31. స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితుమర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥

ఉ॥ ఆత్మను చూచునొక్కడు, తనాత్మను గూర్చిన మాటలాడు,
తా నాత్మను వింతగా వినును, ఆత్మనెరుంగరు విన్నకొందరా
ఆత్మయె నిండె దేహముల, అత్తరి చావుకు దుఃఖమేల ఇం
ద్రాత్మజ! చాపమున్ కొనుము ధాటి యొనర్పుము యుద్ధమీయెడన్.

32. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥

33. అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి॥



ఉ॥ తీరుగ స్వర్గముల్ కలిగి తీరును యోధకు అప్రయత్నమై
కోరిన పొందు క్షత్రియుడె, కోరియు పొందరు అన్యులెన్నడున్
పోరునుమాని నీవిలను పొందుదువా యపకీర్తి, తథ్యమౌ
ఊరక శత్రునింద, విను ఊపిరి వీడుట ఉత్తమంబగున్.

34. అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే ॥

వ॥ అర్జునా ! క్షత్రియ జన్మనొందిన నీకు వీర మరణం చెంది స్వర్గమునొందే అవకాశం దొరికింది. ఇది అన్యులకు అసాధ్యం. నీకు అప్రయత్నంగా దొరికిన ఈ అవకాశం వదలి నీవు యుద్ధం మానితే ఎన్నో అవమానాల పాలవుతావు. ఈ అపకీర్తి ఎన్నో విధముల ఎంతోకాలము నీవెంటే ఉంటుంది. ఇంతవరకూ నీవు సాధించిన ఈ విజయాలన్నీ వ్యర్థం. అందుచేత నామాట విను.

35. భయాద్రణాదుపరతం మంస్యన్తే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥

36. అవాచ్యవాదాంశ్చ బహూన్వదిష్యన్తి తవాహితాః ।
నిందన్తస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥

కం॥ విను, వీరుడంచు తలచిన
జనులే నిను పిరికిపంద జతగా చేయన్,
విని శత్రులు నిందింతురు
కనగలవా అంతకన్న కఠినపు బాధన్.



వ॥ సుక్షత్రియునకు అటువంటి అవమానం కన్న మరణమే మేలు. క్షత్రియుడవైన నీవు ఒక వేళ మరణించినా నష్టం ఏమీ లేదు. ఎందుకంటే

37. హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్
తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ ! యుద్ధాయ కృతనిశ్చయః ॥

కం॥ మరణించిన స్వర్గంబౌ
మరి నీశత్రువుల దునుమ మహిరాజ్యంబౌ,
మరువకు పాపము కాదిది
అరయగ యుద్ధమున నీకు అది సాధ్యంబౌ.

వ॥ ఒకవేళ నీవు యుద్ధం హింస అనుకుంటే అది సరికాదు. యుద్ధమున హింస పాపము కాదు. శత్రు సంహారము హత్యకాదు కావున కృతనిశ్చయుడవై యుద్ధము చేయుము.

38. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥

ఆ॥వె॥ దుఃఖమైన కల్గు సుఖమైన కల్గునూ
నయము కల్గు లేక నష్టమౌను
జయము నపజయంబు సమముగా తలదాల్చి
పోరుసల్పు పార్థ ! పొందుగాను.

39. ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥

వ॥ ఇంతవరకూ సాంఖ్యులు నమ్మే ఆత్మతత్త్వం గురించి చెప్పాను. ఇక సంసార బంధ విముక్తి కరమైన నిష్కామకర్మ గురించి కొంత చెపుతాను వినుము. దానివల్ల కర్మబంధ విముక్తి లభిస్తుంది.



40. నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥

41. వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనన్తాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥

ఆ.వె॥ ఈవు మొదలు చేసి ఈకర్మయోగమున్
చేయకున్న పూర్తి చేటులేదు,
తప్పుకాదు పార్థ! తక్కువగా చేయ,
విడుచు జననమరణ భీతినుండి.

వ॥ ఇట్లు జనన మరణాల వల్ల కలిగే సుఖదుఃఖాల నుండి విముక్తి కలుగ చేయగలిగినదే ఈ నిష్కామ కర్మయోగము.

ఆ॥వె॥ చక్కగా సదలును సంసారబంధమ్ము
కర్మయోగ మొకటి కదుసుఖమ్ము
నిశ్చయాత్మకంబు నీబుద్ధి స్థిరమౌను
స్థిరములేని బుద్ధి పరుగులిడును.

42. యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్య విపశ్చితః ।
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ॥

43. కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥

44. భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥

వ॥ అర్జునా ! కొందరు కర్మలు చేస్తారు కానీ ఏదో ఒక కోరికతో ఫలము నాశించి చేస్తారు. కొందరు యజ్ఞయాగములవంటి కర్మలు స్వర్గసుఖాల నాసించి చేస్తారు. అది నిరుపయోగం సుమా.

ఉ॥ వేదము సర్వమున్ తెలియు వేత్తలు స్వర్గసుఖాల కోసమై
వాదము చేసి వేదముల వాక్యము బల్కుచు కర్మభూమిలో
పొందుగ జన్మనొందెదరు, పొందియు స్వర్గములో సుఖమ్ములన్,
పొందరు మోక్షమున్, మనసు పొందదు స్థైర్యము కర్మప్రాప్తితో.

**వ॥ అట్లు బుద్ధి నిలకడగా లేక ఎన్ని వేదములుచదివినా ఎన్ని యాగములు చేసినా స్వర్గమును పొందగలరు కానీ మోక్షమును పొందలేరు. అందుచేత వట్టి కర్మ కాండ ఉపయోగం లేనిది.**

45. త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥

ఆ॥వె॥ త్రిగుణ కర్మకాండ తెల్పె వేదములెల్ల
విధిగ త్రిగుణములను విడువుమీవు,
ద్వంద్వములను వీడి, త్యజియించి సేమము
ఆత్మజ్ఞానివగుచు అనఘ మనుము.

**వ్యాఖ్య॥ అర్జునా! త్రిగుణములు అనబడే సత్వరజ స్తమోగుణములు ఇంద్రియాలను మనస్సును ప్రభావితంచేయడం వలన సర్వజగత్తూ కర్మలను ప్రోత్సహిస్తుంది. అయితే బ్రహ్మానందం కోరే యోగులు మాత్రం ఈ వేద విహిత కర్మలను లెక్కచేయరు ఎలాగంటే...**

46. యావానర్థ ఉదపానే సర్వతస్సంప్లుతోదకే ।
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥



ఆ॥వె॥ నదుల స్నానమాడు నరుడెట్లు బావులన్
విముఖుడగును, అట్లె విహితుడైన
అందిజ్ఞాని పరమయానంద మాపైన
వేద కర్మలందు విముఖుడగును.

**వ॥ మరియు అర్జునా! కర్మలనాచరించునపుడు ఈ విషయము జ్ఞప్తి యందుంచుకొనుము. ఇది చాలా ముఖ్యము.**

47. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।
మా కర్మఫల హేతుర్భూర్మాతే సంగోఽస్త్వకర్మణి ॥

ఆ॥వె॥ కర్మచేయువరకె కలదధికారంబు
కర్మఫలము యెపుడు కాంచవలదు
పనుల చేయరాదు ఫలముల నాసించి
కర్మ మానరాదు కఠినమనుచు.

**వ॥ కర్మలు వీడుట సరిగాదు. కర్మఫలముతోటి నిమిత్తములేకయే కర్మలు చేయవలెను. అంతేగాక..**

48. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥

కం॥ సమ భావన సాగింపుము,
సమముగ ఫలమొందకున్న చక్కగ పొందన్
సమముగ కర్మలు చేయుము,
సమదృష్టియె యోగమంచు చక్కగ తెలియన్.



49. దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥

ఆ॥వె॥ ప్రతిఫలమును కోరి ప్రజ చేయు కర్మ ని-
ష్కామ కర్మకంటె కాదు ఘనము,
కనుక ఫలితమొంద కర్మ చేసెడివారు
అల్పులందువలన ఆర్యులవరు.

**వ॥ నిష్కామ కర్మ చేయగలగాలంటే కామము కలిగించే సుఖ దు:ఖాది ద్వంద్వముల యందు వ్యసన పడరాదు. అట్లు ద్వంద్వములయందు సమమైన భావన ఉంటే ఏమవుతుందంటే...**

50. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥

ఆ॥వె॥ సమపు బుద్ధి కలుగు జ్ఞానియె వీడును
పాపపుణ్యములను వసుధయందె,
సమపు బుద్ధి నీవు సాధనచేసిన
కర్మలందు నేర్పు కలుగచేయు.

51. కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్ ॥

తే॥ కర్మఫలముల వీడి నిష్కామబుద్ధిఁ
ఫల్గుణా ! వివేకులు జన్మబంధములను
తగులు కొనరయ్య, శోకము దరికి రాని
ముక్తిపథమందుచుందురు ముదముతోడ.



52. యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥

53. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥

తే॥ మోహమను ఊబిలోనుండి ముక్తుడయిన
పిదపనే, నీవు విన్నట్టి వినగబోవు
విషయ సుఖములు అందించు వివిధ భోగ-
ములను చేరక, వైరాగ్యమలవియగును.

**వ॥ కలత చెందియున్న నీ బుద్ధి ఎపుడు చలించనిదై పరమాత్మ ధ్యానమందు స్థిరముగా నిలచి యుండునో అప్పుడు నీవు ఆత్మసాక్షాత్కారం పొందగలవు.**

54. అర్జున ఉవాచ :
స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥

**వ॥ అప్పడు అర్జునుడిలా అన్నాడు**
**ఓ కేశవా ! సమాధియందున్న స్థిరబుద్ధి కలవానినేమంటారు? అతను ఎట్లు భాషించును? ఎట్లు కూర్చొనును? ఎట్లు సంచరించును? వాని లక్షణములేమి? ఇది నాకు విశదీకరించుము.**

55. శ్రీ భగవానువాచ :
ప్రజహాతి యదా కామాన్సర్వాన్పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥

56. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥

**వ॥ అప్పడు భగవానుడిలా అన్నాడు**

**తే॥ మనసులోని కోర్కెలువీడి మనును ఎపుడు**
**ఆత్మ యానందమందున, అట్టివాడు**
**జగతి స్థితప్రజ్ఞుడనబడున్, సమముగాను**
**కాంచునాతడు ద్వంద్వముల్ ఎంచిచూడ.**

**వ్యాఖ్య: స్థితప్రజ్ఞుడు ద్వంద్వభావములైన సుఖదుఃఖ, మానావమాన, శుభాశుభమ్ములను, జయాపజయములను సమముగా చూచును.**

57. యస్సర్వత్రానభిస్నేహస్తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

**కం॥ వెరవడు దుఃఖములందిన**
**అరయడు భేదంబు శుభము అశుభములందున్**
**ధర ! సర్వత్ర విమోహిగ**
**స్థిరముగ తానుండువాడె స్థితప్రజ్ఞుడిలన్.**

**వ॥ అట్టి స్థితప్రజ్ఞుని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంకా వివరంగా అట్టివాని గురించి చెపుతాను వినుము.**

58. యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియా ర్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

**ఆ॥వె॥ తనదు అవయవాలు తాబేలు తనలోకి**
**ముడుచుకున్న రీతి క్రీడి! అవని,**
**స్థిరముగ మరలించు స్థితప్రజ్ఞుడనువాడు**
**ఇంద్రియముల మాన్పు ఇచ్ఛనుండి.**



59. విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥

**ఆ॥వె॥ అణగు నింద్రియములు ఆహారమున్ వీడ,**
**విషయ వాస నెపుడు విడువబోదు,**
**పార్థ! వాసనలును పరమాత్మ గనుగొనన్**
**తొలగునయ్య అన్ని తుదకు వీడి.**

60. యతతో హ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥

61. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

**ఆ॥వె॥ ఆత్మ నిగ్రహంబు ఆశించు నరులకు**
**ఇంద్రియముల సుఖము ఇడుము తెచ్చు,**
**వాటి నణగతొక్కు వాడగున్ నొకయోగి**
**వాని ప్రజ్ఞ యగును వాసి, స్థిరము.**

62. ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥

63. క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥

64. రాగద్వేషవియుక్తైస్తు విషయానిన్ద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥



**సీ॥ శబ్దాది విషయాలు సర్వవేళలయందు**
**ఆసక్తినే పెంచు అధికమగును,**
**ఆసక్తి పెంచును అమితమౌ కోర్కెలన్,**
**కోర్కె వల్ల కలుగు కోపమెంతొ**
**కోపంబు తగ్గించు కుపితు వివేకంబు,**
**దానివల్ల కలుగు తగని మఱపు,**
**మఱపువల్ల కలుగు మరి బుద్ధినాశంబు,**
**దానివల్ల తనకు తానె మడియు**

**తె॥ కాన రాగంబు, ద్వేషంబు కాదననుచు, తాను**
**మనసు నదుపాజ్ఞ లందుంచి, మలుపవలెను**
**ఇంద్రియాలనే విషయాల ఇచ్ఛ నుండి,**
**మనసు శాంతిని పొందునొ మనిషికపుడు.**

65. ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥

**ఆ॥వె॥ మనసు నియమమైన మడియు దుఃఖములన్ని**
**అట్టివాని బుద్ధిఅగును స్థిరము**
**మనసు స్థిరముగాక మనదాత్మ ధ్యానంబు,**
**మనసు శాంతి లేక మనదు సుఖము.**

66. నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయత శ్శాంతిరశాన్తస్య కుతః సుఖమ్ ॥



**వ॥ ఓ అర్జునా! మనోనిగ్రహం లేని వాడికి ఆత్మవివేకం, ఆత్మ చింతన అలవడవు , మనశ్శాంతి లేక సుఖము లభించదు.**

67. ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ॥

**ఆ॥వె॥ సుడిని చిక్కు నావ చుక్కాని కొరవైన**
**దిక్కు తోచకుండ త్రిప్పు గాలి,**
**ఇచ్ఛవచ్చినట్లు ఇంద్రియాలకు లొంగు**
**మనసు పాడుచేయు మనిషి నట్లె.**

68. తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

**ఆ॥వె॥ ఎవని ఇంద్రియములు ఏవిషయములందు**
**తగులు గొనక ధరణి తనరియుండు,**
**అతని జ్ఞాన మదియే అలరారు స్థిరముగా**
**ఇంద్రియాల నణచు ఇచ్ఛనుండి.**

69. యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥

**వ॥ అర్జునా! పరమార్థ తత్త్వము సాధారణ ప్రజలకు కటిక చీకటిగను, జ్ఞానికి పట్టపగలుగనూ తోస్తుంది. అట్లాగే అజ్ఞానాన్ని వెలుతురుగా ప్రజలు భావిస్తుంటే ఆత్మజ్ఞాని మాత్రం దానిని అంధకారంగా భావిస్తాడు.**

70. ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతిమాప్నోతి న కామకామీ ॥

**ఆ॥వె॥ నిండబోదు యెపుడు నీరది నదులచే,**
**అట్లె బ్రహ్మనిష్ఠుడందు పరమునటులే**
**కలత బెంచవతని కామనలన్నియున్,**
**అరయలేదు మోహి పరమశాంతి.**

**వ॥ అనగా నదులన్నీ చేరి సముద్రపు ఉనికిని ఎట్లు మార్చలేవో అట్లే మనస్సును దుఃఖపరచే కోర్కెలు తన మదిని కలత పెట్టిననూ బ్రహ్మనిష్ఠుడు అయిన స్థితప్రజ్ఞుడు ఆ కోర్కెల చేత కలతపెట్టబడడు. అతను మోక్షమంది తీరును. కాని విషయాసక్తుడు మాత్రం మోక్షమందడు.**

71. విహాయ కామాన్యస్సర్వాన్ పుమాంశ్చరతినిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥

72. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాఽస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ॥



**ఆ॥వె॥ బ్రహ్మజ్ఞాని ఎవడు ప్రాపంచ విషయాల**
**మరులు కొనడొ అతడె అరయు ముక్తి**
**మరణమందుకూడ మానక నిటువంటి**
**జ్ఞానమంది బ్రహ్మం దాను పొందు.**

## ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు
## శ్రీమద్భగవద్గీతలోని
## సాంఖ్య యోగమను
## రెండవ అధ్యాయము



ఓం

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## మూడవ అధ్యాయము
## కర్మయోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు:

**1 నుండి 8వ శ్లోకము వఱకు** జ్ఞానయోగ నిష్కామకర్మల ననుసరించి ఆసక్తి రహితముగా నిర్దేశింపబడిన కర్మాచరణము యొక్క గొప్పతనము. దాని నిరూపణ.

**9 నుండి 16వ శ్లోకము వఱకు** యజ్ఞాది కర్మాచరణముల ఆవశ్యకత దాని నిరూపణము.

**17 నుండి 24వ శ్లోకము వఱకు** జ్ఞానియు, భగవానుడు కూడా లోక సంగ్రహార్థమై కర్మలను ఆచరించుచుండుట.

**25 నుండి 35వ శ్లోకము వఱకు** అజ్ఞానుల జ్ఞానుల లక్షణములు వాటి వివరణ. రాగద్వేషరహితులై కర్మలాచరించుటకు ప్రేరణ.

**36 నుండి 43వ శ్లోకము వఱకు** కామమనెడి శత్రువును జయించుటకు ఉపాయములు.

ఇందు రెండు మూడు పర్యాయములు బాగుగా చదివి అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :

3, 7, 8, 14, 21, 28, 30, 35, 38, 43.

ఈ అధ్యాయం చదివిన వారికి కలిగే ఫలప్రాప్తి.

ప్రేతత్వవిమోచన, వైకుంఠప్రాప్తి,
శ్రాద్ధకాలమందు పఠించదగినది.

# శ్రీమద్భగవద్గీత
# మూడవ అధ్యాయము
# కర్మ యోగము

1. అర్జున ఉవాచ
జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ॥

వ॥ **అర్జునుడిలా అన్నాడు**

ఆ॥వె॥ **కృష్ణ! జ్ఞానమగును కర్మకన్న ఘనము**
**అనుట నీదు యోచనయిన యెడల**
**ఘోరమైన హింస గొనకొను రణమున**
**దాని ప్రోత్సహించ తగునె ఇటుల .**

2. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్॥

ఆ॥వె॥ **నిశ్చితమ్ము కాదు నీవు చెప్పెడి మాట**
**నాదు బుద్ధి భ్రమతొ నలుగుచుండె,**
**చెప్పుమేది అయిన శ్రేయపు మార్గము**
**ఒకటి నిశ్చయముగ, యుక్తముగను.**



3. శ్రీభగవానువాచ
లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥
**భగవానుడిలా అన్నాడు.**

ఆ॥వె॥ **గతమునందు అంటి కలవు దారులు రెండు,**
**జ్ఞానయోగ మవని సాంఖ్యులకును**
**తగును అట్లె పార్థ! ధరఁ గర్మయోగంబు**
**శ్రేష్ఠమగును యోగశ్రేష్ఠులకును.**

4. న కర్మణా మనారంభాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే।
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥

ఆ॥వె॥ **కర్మల కడు శ్రద్ధ గరపకన్ నిష్క్రియ**
**స్థితిని ఆత్మయెపుడు చేరలేదు**
**అవనికర్మవీడి నంతమాత్రము జేత**
**పురుషుడెపుడు ముక్తి పొందలేదు.**

5. న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥

ఆ॥వె॥ **క్షణము అయిన మనిషి కర్మల చేయక**
**అవని యుండ సాధ్యమవదు పార్థ!**
**ప్రకృతిచేత పుట్టు బలమైన గుణములు**
**కర్మబంధమందు కట్టివైచు.**



6. కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారస్స ఉచ్యతే ॥

తే॥వె॥ **అదుపు నుంచవచ్చు అన్ని కర్మేంద్రియ-**
**ములను కాని మనసు మునుగు విషయ-**
**వాంఛలందు, అట్టి వాని మిథ్యాచారి**
**అందురయ్య! మూఢుడగుట చేత.**

7. యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున।
కర్మేంద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే ॥

తే॥ **అనఘ! మనసుచే ఇంద్రియా లణచియుంచి**
**వసుధ నెవ్వడు కర్మల ఫలము గనక,**
**కర్మ ఇంద్రియమ్ముల చేత గరపు, వాడె**
**పురుషశ్రేష్ఠుడు ఆతడు పుడమి యందు.**

8. నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః।
శరీర యాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః॥

ఆ॥వె॥ **కర్మ చేయ మేలు కర్మ మానుట కన్న,**
**శాస్త్ర విహిత కర్మ జరుపు మీవు,**
**కర్మ చేయకున్న కాదు సాధ్యము దేహ-**
**యాత్ర కూడ జరుగ దవనియందు.**

9. యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥



ఆ॥వె॥ **అనఘ! యజ్ఞమవని అన్యకర్మలజేయ**
**కర్మబంధమందు కట్టుబడును,**
**కనుక ఆసవీడి కర్తవ్యకర్మనే**
**గరపుమీవు పార్థ! ఘనముగాను.**

10. సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః।
అనేన ప్రసవిష్యధ్వమేష వోఽస్త్విష్ట కామధుక్ ॥

11. దేవాన్ భావయతానేన తే దేవా భవయంతు వః।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥

వ॥ **సృష్ట్యాది యందు ప్రజలనూ యాగాలనూ సృష్టించి**
**ప్రజాపతి ఇలా అన్నాడు.**

ఉ॥ **యజ్ఞము కోర్కెలన్ గరపునట్టిది వృద్ధిని పొందుదావిధిన్,**
**యజ్ఞముతోటి దేవతలనందరినిన్ కడు తృప్తి చేయగన్,**
**ప్రజ్ఞతొ పొందజాలుదురు వర్షము, తీరును ఈప్సితమ్ములున్**
**యజ్ఞముచేత ఒండొరుల అర్థములొందుదు శ్రేయమొప్పగన్.**

12. ఇష్టాన్ భోగాన్హివో దేవా దాస్యంతే యజ్ఞభావితాః।
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః॥

తే॥ **యాగముల తృప్తి చెందుచు భోగములను**
**ఇత్తురు సురులు ఇంపుగా ఇన్ని పొంది**
**తిరిగి నైవేద్యమీయక తినెడివాడు**
**నిజముగా దొంగ ఆతడు, విజయ! వినుము**

13. యజ్ఞశిష్టాశినస్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః।
భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్॥

వ॥ **యజ్ఞశిష్టాన్నమును తిను సత్పురుషులు అన్ని పాపముల**
**నుండి ముక్తులగుదురు. తమ శరీర పోషణకే**
**ఆహారమును వండుకొని తినువారు పాపులయి**
**పాపమునే భుజించుచున్నవారే యగుదురు.**

14. అన్నాద్భవన్తి భూతాని పర్జ న్యాదన్న సంభవః।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః॥

15. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్।
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥

16. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః।
అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి॥

సీ॥ **అన్నంబువలననే అమరె ప్రాణులు ఇలన్,**
**అట్లే వర్షంబుచే అన్నమమరె,**
**యజ్ఞంబువల్లనే అమరెనా వర్షంబు,**
**కలిగెనా జన్నంబు కర్మవలన,**
**కర్మ పుట్టెను ఇలన్ కడకు వేదమునుండి,**
**వేదాలు పరమాత్మవెలయ జేసె**
**పరమాత్మ అందుచే బరగు యజ్ఞములోన,**
**ఈరీతి చక్రమై తిరిగె సృష్టి**



తే॥ **ధరణి ఈ చక్రమరయకన్ తనరువాడు**
**వ్యర్థు డింద్రియలోలుడై పాపియగును,**
**ఆత్మజ్ఞానికి ఆసక్తి ఆత్మయందె**
**సంతసంబును సంతృప్తి నంత గాంచు.**

17. యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మతృప్తశ్చ మానవః।
ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే ॥

18. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః।

వ॥ **మరియూ అట్టి ఆత్మజ్ఞానికి ఏ కర్తవ్యమూ**
**మిగిలియుండదు.**

కం॥ **ఆతడు కర్మల నొదలియు**
**ఆతడు లాభమును చూడడాకర్మలలో,**
**చేతల స్వార్థము గాంచక**
**ఆతడు ప్రాణులను కోర దర్థము లెపుడున్.**

19. తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః॥

20. కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥

ఆ॥వె॥ **నియతి జరుపు మీవు నిష్కామకర్మంబు**
**ముక్తికలుగు నీకు ముందు ముందు,**
**జనకుడు మొదలైన జ్ఞానులావిధి చేసి**
**రట్లె చేయుమీవు అదియె మేలు.**



21. యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥

కం॥ **ఉత్తముడు చేయు కర్మలు**
**ఉత్తమముగ చేతురయ్య యుర్విని పరులున్,**
**ఉత్తముడుంచు ప్రమాణము**
**ఉత్తమమై ఉన్నతముగ యుర్విని నిలుచున్.**

22. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥

ఆ॥వె॥ **మూడు లోకములను కడు ప్రీతి నే కోరు**
**కొనున దేమిలేదు, కొదవలేదు,**
**కర్మ నెరపుచుంటి కర్తవ్యమే లేక,**
**చక్కగాను నేను జగతి కొరకు**

23. యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ సర్వశః॥

24. ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః ॥

ఆ॥వె॥ **జరుపకున్న కర్మ సావధానుండనై**
**జనులు కూడ అట్లె జరుపబోరు,**
**ప్రజల నాశమునకు భ్రష్టత్వమునకును**
**కర్త నగుదు నేనె కర్మ వీడ.**



25. సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వన్తి భారత।
కుర్యాద్విద్వాంస్తథాసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥

వ॥ **అయితే కర్మలాచరించడంలో అజ్ఞానులకూ,**
**జ్ఞానులకూగల భేదము ఏమిటో చెబుతాను**
**వినుము.**

ఆ॥వె॥ **కర్మఫలము కోరి కర్మలన్ అజ్ఞాని**
**జగతి నాచరించు సవ్యసాచి !**
**జగతి హితముకొరకు జ్ఞాని కర్మలుచేయు**
**కర్మఫలముపైన కాంక్ష లేక.**

26. న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తస్సమాచరన్ ॥

ఆ॥వె॥ **ఫలముకోరి కర్మ పామరుల్ చేయగా**
**చిత్తచంచలంబు చేరకుండ**
**జ్ఞాని కర్మలన్ని ఒనరంగ తా జేసి**
**వారి ప్రోత్సహించవలెను పార్థ !**

27. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ॥

28. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।
గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥

29. ప్రకృతేర్గుణసంమూఢాః సజ్జన్తే గుణకర్మసు ।
తానకృత్స్నవిదో మన్దాన్కృత్స్న విన్న విచాలయేత్ ॥

వ॥ **ప్రకృతి యొక్క గుణములచేతనే కర్మలు చేయుబడుచున్నవి. అజ్ఞానముచే జనించు అహంకారముతో వాటి కర్త తనే అని మూఢులు భావింతురు. గుణముల యొక్కయు కర్మల యొక్కయు విభజన తెలిసిన తత్త్వవేత్త ఆ గుణములన్నియూ శబ్దాది విషయములయందు వర్తించునే కాని, తన ఆత్మకు ఆ సంగము లేదని తెలిసి కర్తృత్వమందు ఆసక్తి వీడును. ప్రకృతిచేత మోహితులై అజ్ఞానులు మాత్రము తమకు తోచిన కర్మలు చేయుచూ వాటియందు ఆసక్తులయి ఉందురు. అట్టి అల్పజ్ఞులను జ్ఞానము తెలిసిన తత్త్వవేత్తలు వారి మార్గములనుండి వారిని మరలింప తీవ్ర యత్నము చేయరాదు.**

30. మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥

కం॥ **అంతర్యామిగ నీ మన-**
**సంతయు నను నిల్పి కర్మలర్పించుమయా!**
**సుంత మమత్వము ఆసయు**
**సంతాపములేక నెరపు సమరము పార్థా !**



31. యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః।
శ్రద్ధావన్తోఽనసూయంతో ముచ్యన్తే తేఽపి కర్మభిః

32. యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్।
సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥

33. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।
ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి॥

సీ॥ **ఏ దోషమెంచక ఎల్లెడన్ నా బోధ**
**శ్రద్ధననుసరించు బుద్ధిమతులు**
**కర్మబంధము నుండి కడతేరెదరు పార్థ!**
**ముక్తి పొందును వారు ముదముమీర,**
**నా యుపదేశమ్ము నయము గాదంచును**
**దాని నిందనుచేసి తప్పులెంచి**
**ఆచరించనివారు అవివేకు లజ్ఞాను**
**లయినవారిల భ్రష్టులగుదురయ్య,**

తే॥ **ప్రాణులన్నియు తమతమ ప్రకృతిచేత**
**కలుగు భావాలలోబడి కర్మచేయు,**
**జ్ఞాని తనుకూడ ఆరీతి జరుపు కర్మ,**
**ఏమి చేయును నిగ్రహ మిట్టియెడను?**



వ్యాఖ్యః **అనగా నిగ్రహం వలన ఉపయోగములేదని కాదు. బాహ్యయత్నముల వలన ప్రకృతిని నిరోధించుట అసాధ్యము. కానీ ఆంతరంగికముగా స్వభావము మార్చుకొనుట వలన ప్రకృతి కూడా క్రమ క్రమముగా మారును అని భావము.**

34. ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ।
తయోర్న వశమాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపంథినౌ ॥

వ॥ **అన్ని ఇంద్రియ విషయముల యందునూ రాగద్వేషములుంటాయి. అందుచేతనే మానవుడు రాగద్వేషములకు లోబడరాదు. ఎందుచేతనంటే ఆ రెండూ మనిషికి మంచి జరుగకుండా చేసే శత్రువులూ మరియూ విఘ్నకారకములు, ఈవిధంగా నేను ప్రవచించు నిష్కామకర్మ యోగమును అనుసరించిన యోగులు కర్మ విముక్తులగుదురు.**

35. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥

కం॥ **అరమరిక లేక చేసిన**
**పరధర్మము కాదు మేలు భయభరితంబౌ,**
**కొరవైనా నిజధర్మమె**
**సరియైనది దానివల్ల చావును మేలౌ.**



36. అర్జున ఉవాచ
అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః।
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః॥
**అర్జునుడిలా అన్నాడు.**

వ॥ **ఓ కేశవా! దేని ప్రోద్బలముచేత ఇష్టం లేకపోయినా మనిషి పాపకర్మలు చేస్తున్నాడో ఆ వివరం నాకు తెలియజేయుము.**

శ్రీభగవానువాచ

37. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః।
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥

38. ధూమేనావ్రియతే వహ్నిర్యథాఽఽదర్శో మలేన చ।
యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ ॥

39. ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా।
కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ॥

40. ఇంద్రియాణి మనోబుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే।
ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్॥
**భగవానుడిలా అన్నాడు**

సీ॥ రజముచే బుట్టును ప్రజలకు కామమ్ము,
కోరిక తీరక క్రోధ మవును
కామమే పాపాల కారణంబగునయ్య
కలుగనివ్వదు తృప్తి, గట్టివైరి;
అగ్నిని ధూమంబు, అద్దమున్ మురికియు,
గర్భశిశును మావి గమ్మినట్లు
జ్ఞానమున్ గప్పును ఘనమైన కామంబు
అగ్ని వంటిది జ్ఞానికరిసమంబు
తే॥ ఇంద్రియాలును బుద్ధియున్ ఇటులె మనసు
కామ ఆశ్రయాలని చెప్పగాను వినుము,
అట్లు కామము జ్ఞానమ్ము నావరించి
పార్థ! మానవాళిని మోహపరచునయ్య.

41. తస్మాత్త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥

తే॥ నీవు ఇంద్రియాలన్నింటి నియతిచేసి,
జ్ఞాన విజ్ఞానముల నెల్ల జంపు పాపి-
యైన కామమ్ము నణచుము పూనిదాని
సంహరింపుము ఇప్పుడే సవ్యసాచి!

42. ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః।
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః॥



ఉ॥ ఒప్పగ ఇంద్రియాలవియె ఉత్తమమైనవి మేనుకంటె, తా
గొప్పది మానసంబగును కోవిద! ఇంద్రియశ్రేణికంటె, తా
గొప్పది బుద్ధియంచెరుగు కూరిమితోడి మనస్సుకంటె, తా
నెప్పుడు ఆత్మ మించు నిల నీవిధి బుద్ధిని చూడుమర్జునా!

43. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్థభ్యాత్మానమాత్మనా।
జహిశత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥

వ॥ ఓ పార్థా! ఇట్లు బుద్ధికంటెను ఆత్మ శ్రేష్ఠమని
తెలిసికొని బుద్ధిచేత మనసును అరికట్టి అజేయమైన
కామమను శత్రువును నశింపచేయుము.

## ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు
## శ్రీమద్భగవద్గీతలోని
## కర్మయోగమను
## మూడవ అధ్యాయము



శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## నాలుగవ అధ్యాయము

## జ్ఞాన యోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు

**1 నుండి 18వ శ్లోకము వఱకు** సగుణ పరమేశ్వరుని ప్రభావము, నిష్కామకర్మయోగము గురించిన ప్రస్తావన.

**19 నుండి 23వ శ్లోకము వఱకు** యోగులైన మహాత్ముల ఆచరణము, వారి మహిమలు.

**24 నుండి 32వ శ్లోకము వఱకు** వేర్వేఱు యజ్ఞముల యొక్క ఫలముల గురించి వివరణము.

**33 నుండి 42వ శ్లోకము వఱకు** జ్ఞానయోగము యొక్క ప్రభావము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :

7, 8, 11, 13, 17, 19, 22, 24, 28, 33, 34, 36, 37, 38, 39, 40, 42

ఈ అధ్యాయం శ్రవణ మాత్రముననే వృక్షములు, పశుపక్ష్యాదులు కూడా తరించును.

# శ్రీమద్భగవద్గీత

## నాలుగవ అధ్యాయము

## జ్ఞానయోగము

1. శ్రీభగవానువాచ

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥

**భగవానుడిలా అన్నాడు.**

**ఉ॥ చేకొని శిష్యుగా వినగ చెప్పితి నాశములేని యోగమున్
ఓ కురురత్నమా! వినుము ఒప్పుగ సూర్యుని, కాతడావిధిన్
ఆకడ శిష్యుగా మనువు కప్పుడు దానిని నేర్పె, నాతడి
క్ష్వాకునికిన్ హితంబుగను బాగుగ జ్ఞానమునిచ్చె నంతటన్.**

2. ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥

3. స ఏవాయం మయాతేఽద్యయోగః ప్రోక్తః పురాతనః।
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥



**ఆ.వె॥ ఎరిగిరయ్య! రాజఋషులు పరంపరన్
కర్మయోగ విద్య మర్మములను
కాలగర్భమందు కలిసిపోయెను, బోధ-
చేతు భక్తుడవుటజేసి నీకు.**

**వ॥ మరియూ ఈ కర్మయోగము ఉత్తమమైనదీ రహస్యముగా ఉంచదగినది.**

4. అర్జున ఉవాచ

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః।
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥

**అర్జునుడు ఇలా అన్నాడు**

**ఆ॥వె॥ సృష్టి మొదటివాడు చెబుదురు సూర్యుని
జతగ పుట్టినావు సఖుడవీవు
నీవు సూర్యునకును నేర్పితి వీయోగ-
మెట్లు విశ్వసింతు నెరుగ చెపుమ.**

5. శ్రీభగవానువాచ

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥



6. అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥

**భగవానుడిలా చెప్పాడు.**

**ఆ॥వె॥ ఎన్ని జన్మలయ్యె ఇద్దరికిని పార్థ!
నీవు ఎఱుగవయ్య! నే నెఱుగుదు,
జన్మరహితుడేను శాశ్వతుండగు విభున్
సర్వజీవులకును జగతియందు.**

**వ॥ అయినప్పటికీ నా ప్రకృతిని నా అధీనములో నుంచుకొని, నా మాయాశక్తిచేత అవతారము లెత్తుచుందును.**

7. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

8. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥



**ఉ॥ ధర్మముహాని చెందుచు నధర్మము వృద్ధిని పొందుచుండగన్
ధర్మపు సుస్థిరంబునకు ధాత్రిని దుష్టుల శిక్ష చేయగన్
కూర్మి సురక్ష శిష్టులకు కూర్పగ నేనవతారమెత్తుదున్
ఓర్మి యుగాలనన్నిటిలో ఉన్నతమౌవిధి పాండవోత్తమా!**

9. జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥

**ఆ॥వె॥ అనఘ! నేను దాల్చు అవతారములు దివ్య-
ములు అలౌకికమని తెలియువాడు,
తత్త్వ మర్మ మెరిగి తనువును చాలించి
పుడమి జన్మలేక పొందు నన్ను.**

10. వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః॥

ఆ॥వె॥ రాగ భీతి క్రోధ రహితులు, నాయందు
అలరు భక్తి నన్ను ఆశ్రయించి,
జ్ఞానతపముచేత జగతి పవిత్రులై,
అనఘ! నాదురూపమందినారు.

11. యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః॥

ఆ॥వె॥ ఎవరు నన్ను అవని ఏరీతి కొల్తురో,
వారినటులె నేను కరుణజూతు,
అన్ని విధములుగను అలరు నా మార్గమ్ము
అనుసరించుచుందురయ్య! జనులు.

12. కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥



ఆ॥వె॥ కర్మఫలపు సిద్ధి ఘనముగ పొందంగ
అన్యదేవతల ననన్యభక్తి
కొలుచుచుందురయ్య! కోర్కెతో వేగమే
కర్మఫలములన్ని గాంచుటకును.

13. చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥

ఆ॥వె॥ వారి గుణముచేత, వారి కర్మలచేత
నాల్గు వర్ణములను నయముమీర
కలుగచేసి కూడ కాకుందు కర్తను,
నిర్వికారిననుట నిజము పార్థ!

14. న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥



ఆ॥వె॥ కర్మఫలపు ఆస కనకుందు నందుచే
కర్మలంటవయ్య! కడునిజమ్ము,
అట్టినాదు తత్త్వమరయు నాభక్తుండు
కర్మబంధమునకు కట్టుబడడు.

15. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః।
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్॥

వ॥ పూర్వ కాలమున ముముక్షువులునూ ఇదే విధముగ నిష్కామకర్మలాచరించిరి కనుక ప్రాచీనమగు ఇట్టి నిష్కామకర్మ మార్గమునే నీవునూ అనుసరింపుము.

16. కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యత్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్॥

ఆ॥వె॥ ఏది కర్మయగునొ, ఏది యకర్మయో
వేత్తలైన భ్రాంతివీడరయ్య!
కర్మతత్త్వ మెల్ల ఘనముగా వివరింతు
కర్మబంధముక్తి గరపు నదియె.



17. కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః॥

వ॥ కర్మతత్త్వము తెలిసి కొనదగినది. అకర్మ స్వరూపము గూడ తెలిసికొన తగినది. వికర్మ అనగా నేమో కూడా తెలిసికొన తగినది. ఏలనన కర్మ యొక్క గతి అనగా వాస్తవతత్త్వము అతినిగూఢమైనది.

వ్యాఖ్య: కర్మ అనగా విహిత కర్మ. అనగా చేయ దగిన కార్యము. వికర్మ అనగా నిషిద్ధమైన కార్యము. అకర్మ అనగా ఏపనీ చేయకుండా నిర్వ్యాపారముగా నుండుట. అకర్మ, వికర్మ రెండునూ పాపకర్మలే సంసారబంధహేతువులే అని చెప్పబడుచున్నది.

18. కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥

ఆ॥వె॥ కర్మలో అకర్మ గని, అకర్మలొ కర్మ
అరయు మనిషి యెవడొ అతడె యోగి,
బుద్ధిమంతు డతడు భువిని చేయుచునుండు
అన్ని కార్యములను ఉన్నతముగ.

19. యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః।
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః॥

ఆ॥వె॥ ఎవని కర్మలన్ని ఇల శాస్త్ర విహితమై
కామరహిత మగును, కర్మ లెవడు
భస్మమునొనరించు బాగుగ జ్ఞానాగ్ని,
జ్ఞాని అందురయ్య! వాని బుధులు.

20. త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః।
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః॥



తే॥ కర్మఫలకాంక్ష వీడెడి ఘనుడు నిత్య-
తృప్తుడై జగమందున దేని కూడ
ఆశ్రయించడు, కర్మలనన్ని చేసి-
కూడ సుంతయు చేయని గొప్పవాడు.

21. నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః।
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥

తే॥ వినుము విజితేంద్రియుండాస వీడువాడు,
అన్ని వస్తువుల్ త్యజియించు నట్టి యోగి
జరుపు కర్మలు తనదేహ ధారణకును,
పాపములనొంద డాతడు పార్థ! యెపుడు.

22. యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః।
సమస్సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥

23. గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥



సీ॥ అప్రయత్నముగనె అమరువస్తువులచే
తృప్తిచెంది అసూయ దెలియడతడు,
ద్వంద్వముల కతీతభావంబునను యుండు,
సిద్ధి నసిద్ధులన్ స్థిరమునుండు,
కర్మలు చేసియు ఘనుడైన పురుషుడు
కర్మబంధమునను కట్టుబడడు,
సర్వసంగత్యాగి చక్కగ ముక్తుడై
జ్ఞానాంతరంగుడై మనుచునుండు,

తే॥ అట్టి పురుషుడు కర్మలు యజ్ఞములను
తలపుతో దైవప్రీతికై తాను జేయు,
కర్మలును విలీనమ్ములై కరగిపోయి
మనసు పరమాత్మపైన నిమగ్నమవును.

24. బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్॥
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥



వ॥ ఓ అర్జునా! ఏ యజ్ఞంలో అర్పణం అనగా స్రువం మొదలైన యజ్ఞసామగ్రి, నెయ్యి మొదలయిన హోమ ద్రవ్యాలు బ్రహ్మమే అగునో, బ్రహ్మరూపియగు ఆ యజ్ఞకర్త ద్వారా బ్రహ్మరూపమయిన అగ్నిలో ఆహుతులు వ్రేల్చే క్రియకూడా బ్రహ్మమే అగును. అట్టి యజ్ఞకర్త పొందదగిన ఫలము కూడా బ్రహ్మమే అగుచున్నది.

25. దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥

తే॥ దైవపూజయన్ యజ్ఞము అవని యోగ-
వరులు కొందరు చేతురు పార్థ! అటులె
అన్యయోగులు బ్రహ్మాగ్నియందు వారి
చిత్తమునె హోమమున్ తాము చేతురయ్యా!

26. శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।
శబ్దాదీన్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥

27. సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥

వ॥ **ఓ అర్జునా! కొందరు యోగులు ఇంద్రియాలను నిగ్రహం అనే అగ్నిలోనూ మరియు శబ్దాది విషయాలను ఇంద్రియాలనే అగ్నిలోనూ హోమము చేయుదురు. అట్లే మరి కొందరు యోగులు ఇంద్రియ వ్యాపారములను ప్రాణముయొక్క వ్యాపారములను జ్ఞానముచే ప్రకాశింపచేయబడిన మనోనిగ్రహం అనెడి అగ్నిలో ఆహుతి చేయుదురు.**

28. ద్రవ్య యజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాఽపరే ।
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః॥

ఉ॥ **కొందరు ద్రవ్య యజ్ఞములు గొప్పగ చేతురు పార్థ! ఈయిలన్,**
**కొందరు యోగ యజ్ఞములు కూరిమి చేతురు ఓర్మితోడుతన్**
**కొందరు చేతురాతపము ఘోరశ్రమంబుల, యజ్ఞమద్దియున్**
**కొందరు వేద శాస్త్రములు గొప్పగ నేర్చుట జ్ఞానయజ్ఞమౌ.**



29. అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే ।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః॥

30. అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః॥

వ॥ **ఓ అర్జునా! ఈవిధంగా రకరకాల పురుషులు వేరు వేరు యజ్ఞములను దైవ ప్రీతికై చేయుచున్నారు. ద్రవ్య, యోగ, తప, స్వాధ్యాయ యజ్ఞములే కాక ప్రాణాయామమును కూడా యజ్ఞముగా కొందరు చేయుచున్నారు. అట్టి ప్రాణాయామపరాయణులు ప్రాణ, అపాన వాయువుల గతిని నిరోధించి, అపాన వాయువును ప్రాణవాయువునందునూ, ప్రాణవాయువును అపాన వాయువునందును హోమము గావించుచున్నారు. అట్లే మరి కొందరు నియమిత ఆహారము చేత ప్రాణాయామము చేయుచూ ప్రాణాది వాయువుల గతిని నియంత్రించి వాటియందే హోమము చేయుచున్నారు. యజ్ఞకర్మల యందు ప్రీతి కలిగిన ఈ యోగులు తమ యజ్ఞములద్వారా పాపప్రక్షాళన గావించుకొనుచున్నారు.**



31. యజ్ఞశిష్టామృతభుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్ ।
నాయంలోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥

తే॥ **అనఘ! యజ్ఞశిష్టామృతం బనుభవించు**
**యోగి బ్రహ్మమునొందగ యుక్తుడగును,**
**యజ్ఞమేదియుచేయని అల్పు డిహము**
**పరమునందున సుఖమేది ఎరుగబోడు.**

32. ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే।
కర్మజాన్విద్ధి తాన్ సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥

తే॥ **వివిధ యజ్ఞాల వేదముల్ విశదపరచె,**
**కర్మలవలన అవియన్ని కడకు పుట్టె,**
**ఇట్టి మర్మము అర్జునా! ఎరుగ నీవు**
**మోక్షమందెదవోరయ్యా! ముందుముందు.**

33. శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప।
సర్వ కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥



తే॥ **ద్రవ్యయజ్ఞము గొప్పది, దాని కన్న**
**జ్ఞానయజ్ఞంబు కడు మిన్న వినుము పార్థ !**
**అన్ని కర్మలు పరిపూర్తి యగును జ్ఞాన-**
**మందు, కావున కర్మలున్ అఖిలమయ్య.**

34. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥

తే॥ **చేసి సాష్టాంగదండము, చేరి గురుల**
**సమయమునుచూసి ప్రశ్నించి సవినయముగ,**
**సరళమగు బుద్ధి సేవలన్ నిరతిచేయ,**
**పరమజ్ఞానమ్మునిత్తురు వారు నీకు.**

35. యత్జ్ఞాత్వా న పునర్మోహమేవం యాస్యసి పాండవ।
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్య స్యాత్మన్యథో మయి ॥

36. అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥

37. యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున ।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥

38. న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ॥

**సీ॥ ఆ జ్ఞానమొదవగా అటుపైన ఇటువంటి**
**వ్యామోహమందవు పార్థ! నీవు,**
**ఆ జ్ఞానమున చూతు వన్ని జీవంబులన్**
**నీలోను నాలోను నిశ్చయముగ,**
**కడుపాపివైననూ ఘనజ్ఞానమను నావ**
**తోటి పాపాబ్ధిని దాటగలవు,**
**అగ్ని భస్మముచేయు అవని కాష్టంబులన్**
**జ్ఞానాగ్నిలో కర్మ సమసిపోవు**

**తే॥ జ్ఞానమువలె పవిత్రము యైనదేది**
**అవనిలో లేదు, సందేహమందవలదు,**
**యోగ సంసిద్ధుడున్ స్వయమ్ముగను కాల-**
**క్రమమునన్ జ్ఞానమును పొందగలుగు పార్థ!**



39. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేంద్రియః।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥

**తే॥ నిష్ఠ, శ్రద్ధయు, ఇంద్రియ నిగ్రహమున**
**బ్రహ్మను గురించి జ్ఞానంబు బడయగలడు**
**యోగి, తక్షణమ్మే జ్ఞానయుక్తుడగుచు**
**పరమశాంతిని పొందును పార్థ! వినుము.**

40. అజ్ఞశ్చాశ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః॥

**తే॥ పార్థ! అవివేకి, అశ్రద్ధ బరగువాడు,**
**సంశయాత్ముడు భ్రష్టుడౌ జగతియందు,**
**ఇట్టి నిత్యశంకితునకు ఇహమునందు**
**పరమునందును సుఖముండదరయుమయ్య**

41. యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।
ఆత్మవన్తం న కర్మాణి నిబధ్నన్తి ధనంజయ ॥



**వ॥ ఓ అర్జునా! విధ్యుక్తకర్మల నాచరించుచూ వాటిని భగవదర్పణ చేయువాడునూ, వివేకము ద్వారా సంశయములన్నింటినీ తొలగించుకొనినవాడునూ, అంతఃకరణమును వశమందుచుకున్నవాడునూ అగు వానిని కర్మలు ఏమాత్రమూ బంధించలేవు.**

42. తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాఽఽత్మనః।
ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత ॥

**తే॥ పార్థ! అజ్ఞాన జనితమై మదిని చేరి**
**కలచు సందియమ్ముల జ్ఞానఖడ్గమెత్తి**
**నరికి యోగస్థితుడవయి, నయముమీర**
**యుద్ధమునుచేయ యిప్పుడే సిద్ధమగుము.**

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగద్గీతలోని**
**జ్ఞానయోగమను**
**నాలుగవ అధ్యాయము.**





శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## ఐదవ అధ్యాయము

## కర్మసన్న్యాసయోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 6వ శ్లోకము వరకు** – సాంఖ్యయోగ, నిష్కామకర్మ యోగముల నిర్వచనము

**7నుండి 12వ శ్లోకము వరకు** – సాంఖ్యయోగము మరియు నిష్కామ కర్మయోగి యొక్క లక్షణములు, వారి మహత్త్వము

**13 నుండి 26వ శ్లోకము వరకు** – జ్ఞానయోగమును గురించిన వర్ణనము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు

2, 6, 10, 16, 18, 21, 23, 24, 26, 27, 28, 29

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:
స్వధర్మాచరణము నొనరించనందువల్ల కలిగేదోషముల నుండి విముక్తి కలుగును.



## శ్రీమద్భగవద్గీత
## ఐదవ అధ్యాయము
## కర్మసన్న్యాసయోగము

1. అర్జున ఉవాచ
సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి।
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్॥
**అర్జునుడిలా అన్నాడు.**

**కం॥ ఒకపరి కర్మత్యాగము**
**ఒకపరి నిష్కామకర్మయోగంబును వీ-**
**దకనే చేయుమననెదవు**
**ఒకదానిని నిర్ణయింపు మొప్పగునేదో.**

2. శ్రీ భగవానువాచ
సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ।
తయోస్తు కర్మసన్న్యాసాత్కర్మయోగోవిశిష్యతే ॥
**అప్పుడు భగవానుడిలా అన్నాడు.**



**ఆ॥వె॥ కర్మత్యాగ మిలను కడు శ్రేయకరమగు,**
**కర్మయోగమున్ను ఘనమె సుమ్మి,**
**అభ్యసింప సుగమ మాకర్మయోగంబె**
**శ్రేష్ఠమయినదందుచేత పార్థ!**

3. జ్ఞేయః సనిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి నకాంక్షతి।
నిర్ద్వన్ద్వో హి మహాబాహో సుఖం బంధాత్ప్రముచ్యతే॥

**తే॥ ఎవడు ద్వేషమ్ము కోర్కెలన్ ఇలను వీడు,**
**వాడు నిత్యసన్న్యాసియై బడయు సుఖము,**
**ద్వంద్వముల వీడు యోగియే పార్థ! వినుము**
**బంధములనుండి ముక్తుడౌ బద్ధుడవక.**

4. సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదన్తి న పండితాః।
ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విన్దతే ఫలమ్ ॥

5. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి॥

వ॥ **జ్ఞానయోగము కర్మయోగము వేరువేరని అవివేకులు చెప్పుచుందురు. కాని వివేకవంతులు అట్లు చెప్పరు. ఆ రెండిటిలో ఒకదానినైననూ బాగుగా అనుష్ఠించినచో రెండిటి యొక్క ఫలమును అనగా మోక్షమును మనుష్యుడు పొందుచున్నాడు. జ్ఞానయోగులచే పొందబడుచున్న మోక్షము కర్మయోగుల చేతనూ పొందబడుచున్నది. జ్ఞానయోగము, కర్మయోగము ఒకటియే అను వివేకముగలవాడే నిజమైన వివేకవంతుడు.**

6. సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః।
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ॥

తే॥ **కర్మచేయక త్యాగము కష్టమయ్యె!**
**సాధ్యపడనిది శమమిలన్ సవ్యసాచి !**
**కర్మచేసెడి మునికూడ కలిగి భక్తి**
**పరమపదమును శీఘ్రమే బడయుచుండు.**



7. యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః।
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥

ఉ॥ **ఎవ్వడు కర్మచేయు విజితేంద్రియుడై తన ఆత్మ గెల్చుచున్,**
**ఎవ్వడు అంతరంగమున ఇంపుగ శుద్ధిని కల్గియుండు, తా**
**నెవ్వడు సర్వభూతముల నేర్పడు ఆత్మల వాని ఆత్మగా**
**క్రొవ్వక జూచు, నాతనిని గూడవు యెన్నడు కర్మబంధముల్.**

8. నైవ కించత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్॥

9. ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ ఉన్మిషన్నిమిషన్నపి ।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్ ॥

వ॥ **ఓ అర్జునా! పరమార్థతత్త్వం తెలిసిన సాధకుడు దైహిక కర్మలు చేయుచూ అనగా, చూచుచూ, వినుచూ, స్పృశించుచూ, ఆఘ్రాణించుచూ, భుజించుచూ, నడచుచూ, నిద్రించుచూ, గ్రహించుచూ, కనులు మూయుచూ, తెరచుచూ**



**ఉన్ననూ అవి అన్నియూ ఇంద్రియములు తమతమ విషయములయందు ప్రవర్తిల్లుచున్నవని తలంచుచూ, తాను మాత్రము ఈ పనులను చేయుటలేదనియే భావించును.**

10. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః।
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥

తే॥ **తామరాకును అంటని తడి విధమున**
**యోగినంటదు పాపము, యుక్తుడగుచు**
**అతడు భగవదర్పణముగా అన్ని కర్మ-**
**లాచరించును ఆసక్తి నరయకుండ.**

11. కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।
యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాఽఽత్మశుద్ధయే ॥

తే॥ **మమత ఆసక్తి వీడుచున్ మహిని యోగి**
**మనసు కర్మేంద్రియంబులు మరియు బుద్ధి**
**చేత కర్మలనన్నిటిన్ చిత్తశుద్ధి**
**కొరకు మాత్రమే చేయును కుంతి పుత్ర!**



12. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥

తే॥ **కర్మఫలములు వీడి, నిష్కామకర్మ-**
**యోగి శాశ్వతమౌ శాంతినొందుచుండ,**
**కామితమ్ములు తీరగ కర్మచేయ**
**కర్మబంధాన పురుషుడు కట్టుబడును.**

13. సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥

వ॥ **ఓ అర్జునా! ఇంద్రియముల నిగ్రహించిన పురుషుడు కర్మలను ఆచరింపకయే, ఆచరింపచేయకయే అన్ని కర్మలనూ మానసికంగా సన్న్యసించి, సచ్చిదానంద ఘనపరమాత్మ స్వరూపమున స్థితుడై, నవద్వారములు గల పురమగు మానవదేహమున స్వస్థుడై యుండును.**

14. న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥

**కం॥ పరమేశుడు జీవులకును**
**ధరణిని కర్తృత్వమైన, తగు కర్మైనన్,**
**నెరపెడి కర్మల ఫలముల**
**గరమౌ ఆసక్తినైన కలిగింపడయా.**

**వ॥ అవి జీవుల జన్మాంతర సంస్కార ఫలితమైన స్వభావముచే ఏర్పడుచున్నవి.**

15. నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః ॥

**తే॥ పార్థ! జీవుల పుణ్యముల్ పాపములను**
**యెనసి పరమాత్మ గ్రహియింపడనుట నిజము,**
**జ్ఞానమును కప్పివేయ అజ్ఞాన మటుల**
**జీవులెల్లరు మోహితులవుదురయ్యా!**



16. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః।
తేషామాదిత్యవత్‌జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్॥

**వ॥ ఓ అర్జునా! ఆత్మజ్ఞానముచే ఎవరి యొక్క అజ్ఞానము నశింపచేయబడినదో, అట్టివారి జ్ఞానము సూర్యుని వలె ఆ పరబ్రహ్మ స్వరూపమును ప్రకాశింప చేయుచున్నది.**

17. తద్బుద్ధయస్తదాత్మానస్తన్నిష్ఠాస్తత్పరాయణాః।
గచ్ఛన్త్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః॥

**ఆ॥వె॥ నిలిపి మనసు బుద్ధి నిష్ఠతో పరమాత్మె**
**పరమగతిగ వారు పరిగణించి,**
**పాపరహితులగుచు పార్థ! జ్ఞానమ్ముచే**
**మరల జన్మలేక మనెదరయ్య!**

18. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥



**కం॥ వినయము విద్యయు కలిగిన**
**ఘనుడౌ బ్రాహ్మణునిగాని, కడు చండాలున్,**
**శునకమును, కరిని, గోవును**
**ఘనముగ సమదృష్టిగాంచు ఘనుడే బుధుడౌ.**

19. ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితా।

**వ॥ ఓ అర్జునా! ఎవరి మనస్సు సామ్యస్థితియందు, నిశ్చలమైయుండునో, అట్టివారు ఈలోకమునందే జనన మరణములను జయించినవారు అగుచున్నారు. వారిని జీవన్ముక్తులు అందురు. పరబ్రహ్మస్థితి దోషరహితమైనది కావున దోషరహితమగు మనస్సుకల ఆ జీవన్ముక్తులు పరబ్రహ్మస్థితియందున్నవారే యగుచున్నారు.**



20. న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః॥

**తే॥ బ్రహ్మమందున లీనమౌ బ్రహ్మవేత్త**
**నిలుపు స్థిరబుద్ధి, నిర్మోహి, నిశ్చలుండు,**
**పుడమి ప్రియములు కలిగిన పొంగబోడు**
**కష్టముల కాతడెన్నడు కలతపడడు.**

21. బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే।

**వ॥ ఓ అర్జునా! బాహ్యములగు విషయసుఖము లందాసక్తి వదలి ఎవడు ఆంతరంగికమగు ఆత్మసుఖము నాస్వాదించునో అట్టివాడు సదా ఆత్మానుసంధానము చేయుచూ అఖండమగు బ్రహ్మ సుఖానుభూతి నవిచ్ఛిన్నముగా అనుభవించును.**

వ్యాఖ్య: అనగా బాహ్యసుఖములను వదలి స్థిరబుద్ధియందు ఆత్మానందము నొకసారి చవిచూచినచో మరల దానిని వదలక నిరంతరము దానియందే నిష్ఠ కలిగియుండును.

22. యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే।
ఆద్యన్తవన్తః కౌంతేయ న తేషు రమతే బుధః॥

ఆ॥వె॥ ఇంద్రియసుఖములును ఇల దుఃఖహేతువుల్,
ఆది అంతములును అమరియుండు,
అందువల్ల జ్ఞాని అట్టి సుఖంబులన్
తగులుకొనడు పార్థ! ధరణియందు.

23. శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥

కం॥ జీవము యుండిన యప్పుడె
ఆవహమౌ కామక్రోధమందున కలిగే
ఆవేశము నణగించిన,
ఆవల యోగియును సుఖియునగు నరుడంతన్.



24. యోఽన్తస్సుఖోఽన్తరారామస్తథాంతర్జ్యోతిరేవ యః।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥

తే॥ అనఘ! ఎవ్వడు సుఖియించు ఆత్మయందె,
అవని జ్ఞానియై క్రీడించు నాత్మనెవడు
అట్టి బ్రహ్మస్వరూపుడు అయిన యోగి
బ్రహ్మసాయుజ్యమందుట బహు సులభము.

25. లభన్తే బ్రహ్మనిర్వాణమృషయః క్షీణకల్మషాః।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః॥

తే॥ పాపరహితులు, సర్వజీవముల హితులు
సంశయాలన్ని తీరగ జ్ఞానియగును
మనసు పరమాత్మ యందు నిమగ్నపరచి
పార్థ! బ్రహ్మనిర్వాణంబు బడయగలరు.

26. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్॥



తే॥ పార్థ! కామక్రోధమ్ములన్ వదలివైచి,
చిత్తమును గెల్చి ఆ బ్రహ్మవేత్తలెల్ల
బ్రహ్మదర్శనమందగ పాత్రులగుచు
బ్రహ్మకైవల్యమెల్లెడన్ బడయగలరు.

27. స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చైవాంతరే భ్రువోః॥
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ॥

28. యతేంద్రియమనోబుద్ధిర్మునిర్మోక్షపరాయణః।
విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః ॥

వ॥ ఓ అర్జునా! బాహ్యవిషయముల గురించి మఱచి, భ్రూమధ్యమందు దృష్టిని నిలిపి, ప్రాణాపాన వాయువులను రెండు నాసారంధ్రములగుండా సమముగా ప్రసరించునట్లొనర్చి, యింద్రియములను మనస్సును, బుద్ధిని స్వాధీన మొనర్చుకొని, మోక్షాపేక్ష తప్ప అన్యాసక్తి ఏమియు లేక, రాగ, భయ క్రోధములను వీడి చరించు యోగి సదాముక్తుడే అగుచున్నాడు.



29. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతిమృచ్ఛతి॥

తే॥ వినుము యజ్ఞతపములకు నేనె భోక్త,
సర్వలోకాల కధిపతిన్ సవ్యసాచి !
అన్ని ప్రాణులకు హితుడనంచు నన్ను
ఎరుగు భక్తుడు పొందును పరమశాంతి.

**ఇది శ్రీ కృష్ణార్జున సంవాద రూపమగు**
**శ్రీమద్భవద్గీతలోని**
**కర్మసన్న్యాసయోగమను**
**ఐదవ అధ్యాయము**

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## ఆరవ అధ్యాయము

## ఆత్మ సంయమ యోగము

## (ధ్యాన యోగము)



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు

**1 నుండి 4వ శ్లోకము వరకు** నిష్కామకర్మయోగము గురించి యోగారూఢుని లక్షణములు గురించి వివరణ

**5 నుండి 10వ శ్లోకము వరకు** ఆత్మోద్ధరణ, జితేంద్రియుడగు జ్ఞాని యొక్క స్వభావము.

**11 నుండి 32వ శ్లోకము వరకు** ధ్యానయోగము గురించి వివరణ

**33 నుండి 36వ శ్లోకము వరకు** మనోనిగ్రహము గురించి వివరణ

**37 నుండి 47వ శ్లోకము వరకు** యోగభ్రష్టుని సద్గతి ధ్యానయోగము యొక్క మహిమ.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :

5, 6, 8, 9, 11, 12, 13, 14, 16, 17, 19, 25, 26, 27, 30, 34, 35, 40, 43, 47,

ఈ అధ్యాయం చదివినవారికి కలిగే ఫలప్రాప్తి: మోక్షప్రాప్తి



## శ్రీమద్భగవద్గీత
## ఆరవ అధ్యాయము
## ఆత్మ సంయమ యోగము
## (ధ్యాన యోగము)

1. శ్రీభగవానువాచ

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।

స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః ॥

**భగవానుడిలా అన్నాడు.**

**ఆ॥వె॥ కర్మఫలము గనక కర్తవ్య పరుడగు**

**సన్న్యసించు జ్ఞాని తగిన యోగి,**

**అగ్నికార్య త్యాగి అవబోడు సన్న్యాసి,**

**కర్మవీడు వాడు కాదు యోగి.**

2. యం సన్న్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాండవ ।

నహ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥



**ఆ॥వె॥ ఏది యోగ మగునొ అదియె సన్న్యాసంబు,**

**వేరు గావు ఒకటె ఎరుగుమయ్య,**

**జరుపకున్న కర్మసంకల్పత్యాగమ్ము**

**యోగి యగుట సాధ్య మగునె పార్థ?**

3. ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।

యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥

**ఆ॥వె॥ అవని పొంద యోగ ఆరూఢ స్థితిని ని-**

**ష్కామకర్మ మొకటె సాధనంబు,**

**అట్టి యోగులకును అగును శమ మొకటే**

**ముఖ్య కారణంబు ముక్తినొంద.**

4. యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।

సర్వసంకల్ప సన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥

వ॥ **ఇంద్రియ సుఖముల మీద, కర్మల యందును ఆసక్తుడు గాక సర్వ సంకల్పములను త్యజించిన పురుషుడినే యోగారూఢుడందురు.**

5. ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః ॥

కం॥ తనకు తనేయగు బంధువు
తన శత్రువు తానె నరుడు ధరణిని, తానే
తన నుద్ధరించుకొనవలె
తనధోగతి పాలుగాక తరియించవలెన్.

6. బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥

కం॥ విను నిగ్రహించ మనసును
తన మనసే బంధువగును, తనకారీతిన్
మనసును జయించకుండిన
తన మనసే ప్రబల వైరి తనకే పార్థా !

వ॥ ఆ విధముగా మనసును నిగ్రహించిన యోగారూఢు డెట్లుండు ననగా....



7. జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥

తే॥ ద్వంద్వ భావమ్ములను ప్రశాంతముగ నుండి
ఆత్మ గెలిచిన వాడగునట్టి యోగి
అలరుచుండును పరమాత్మ అనుభవమున
అన్యమేదియు కానడు అతడు ఎపుడు.

8. జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః ॥

తే॥ జ్ఞాన విజ్ఞానముల తృప్తి దనర, ఆత్మ
నిర్వికారుడై ఇంద్రియ నిగ్రహమున,
మట్టి, రాయి, పైడి మదినెంచు నొకటిగా
అట్టి యోగియె యుక్తుడు అవనిలోన.

9. సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్యబంధుషు ।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥



ఉ॥ శ్రేయము కోరువాడయిన స్నేహితునైనను, మధ్యవర్తినిన్
డాయని ద్వేషినైన, తన దారిన బోవు తటస్థునైననున్
పాయని బంధువైన, నతిపాపిని, వైరిని, సాధువైననున్
ఈ యెడ నందరిన్ సమత ఏర్పడ చూచెడివాడె శ్రేష్ఠుడౌ.

10. యోగీ యుఞ్జీత సతతమాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ॥

11. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మన ః ।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్ ॥

12. తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే ॥

వ॥ ఓ అర్జునా! యోగి ఎలా సాధన చేయవలెనో వివరిస్తాను వినుము. శరీరేంద్రియాలను మనస్సును స్వాధీన పరచుకొని, ఆశారహితుడై ఏ భోగ సామాగ్రిని గ్రహింపక, ఒంటరిగా, నిర్జనమైన ప్రదేశమున కూర్చుని ఆత్మను పరమాత్మయందే లగ్నము చేయవలెను.



పరిశుభ్రమైన ప్రదేశమున దర్భాసనము, దానిపై జింకచర్మము, దానిపై వస్త్రమును ఒక దానిపై ఒకటి పఱచి, అంత ఎక్కువ కానీ మరీ తక్కువకాని సమమైన ఎత్తులో స్థిరముగా కూర్చుండి, చిత్తము ఇంద్రియ వ్యాపారములను వశమందు ఉంచుకొని ఏకాగ్ర మనస్కుడై, అంతఃకరణ శుద్ధికై ధ్యానయోగమును సాధన చేయవలెను.

13. సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥

తే॥ కంఠము, శిరము, దేహము కదలకుండ
స్థిరము సమముగ యుంచి, నాసికము చివర
దృష్టి కేంద్రీకరించుచు తివిరి యోగి
అన్యదిశలను చూడక అమరవలెను.

14. ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారివ్రతే స్థితః ।
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥

ఆ॥వె॥ భయము వీడి యోగి బ్రహ్మ చర్యముపూని,
ఆత్మ నిగ్రహమున, ఆత్మశాంతి
కలిగి, చిత్తమందు ఘనముగా నన్నుంచి
అరయ వలెను నన్ను పరమగతిగ.

15. యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః ।
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి ॥

తే॥ మనసు స్వాధీన మందుంచు కొనెడి యోగి
ఆత్మ సంధానమును జేసినందుచేత
నాదు స్థితియును నిర్వాణ పదమునైన
పరమశాంతిని పొందును పార్థ ! వినుము.

16. నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః ।
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥

కం॥ ఎక్కువ భుజించు వారలు
ఎక్కుడు పస్తుండి నిద్ర నెరుగని వారున్
ఎక్కువ నిద్రాసక్తులు
చక్కని ఆ యోగసిద్ధి సాధించరయా.



17. యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥

వ॥ అర్జునా ! అట్లు ఆహార విహార నిద్రాదుల యందు, సర్వ కర్మల యందు మితమును పాటించవలయును. అట్టి యోగి మాత్రమే తన దుఃఖములను తొలగించుకొని యోగసిద్ధి పొంద కలుగుతున్నాడు.

18. యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే ।
నిఃస్పృహస్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥

కం॥ మనసును వశమందుంచగ
మనసది తన ఆత్మలో నిమగ్నంబవగన్
మనసున వాంఛలు వీడెడు
ఘనుడిల నా యోగసిద్ధి గాంచును పార్థా!

19. యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య యుఞ్జతో యోగమాత్మనః ॥



ఆ॥వె॥ గాలిలేని చోట ఘనముగా దీపము
నిశ్చలముగ నుండు నిశ్చయముగ,
అట్లె యోగి వశము అయిన చిత్తము దైవ-
ధ్యానమందు స్థిరము అగుచు నుండు.

20. యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥

21. సుఖమాత్యన్తికం యత్తద్బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ॥

22. యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥

23. తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యోక్తవ్యో యోగోఽనిర్విణ్ణచేతసా ॥

వ॥ ధ్యానయోగ సాధనచే నిగ్రహింపబడిన చిత్తము ఉపరతిని అనగా విశ్రాంతిని పొంది పరమాత్మను ధ్యానించుట ద్వారా పవిత్రమైన సూక్ష్మ బుద్ధితో ఆ పరమాత్మను



సాక్షాత్కరింప చేసుకున్న యోగి ఆ సచ్చిదానంద ఘన పరమాత్మయందే సంతుష్టుడగుచున్నాడు.

ఇంద్రియ గోచరము కానిదియు, సూక్ష్మబుద్ధిచేత మాత్రమే గ్రహింపదగినదై అంతము లేని ఏ బ్రహ్మానందము కలదో, దానిని ఏ స్థితియందు అనుభవించునో మరియు దేనియందు స్థితుడైన ఈ యోగి పరమాత్మ స్వరూపము నుండి ఎన్నడునూ చలింప చేయబడడో, దానిని పొందిన పిదప దాని కంటే అధికమైనదిగా దేనినీ పరిగణించక ఆపరమాత్మ ప్రాప్తి అను లాభముననే స్థితుడై యుండి తీవ్రదుఃఖమునకునూ చలింపడో, అట్టి స్థితినే ధ్యానయోగమందురు. అట్టి ఆత్మసాక్షాత్కారరూపయోగము దుఃఖముచేత కలత చెందని ధీరమైన మనస్సుచే పట్టుదలతో సాధింప తగియున్నది.

24. సంకల్పప్రభవాన్కామాంస్త్య క్త్వా సర్వానశేషతః ।
మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥

25. శనైశ్శనైరుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥

26. యతో యతో నిశ్చరతి మనశ్చఞ్చలమస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥

**సీ॥ సంకల్పముల కల్గు సకల వాంఛలు వీడి**
**ఇంద్రియమ్ములయందు ఇముడు మనసు**
**నన్ని విధములుగ అణచి యుంచవలెను,**
**ఉపరతి సాధనన్ పొందవలెను,**
**ధృతితోడ బుద్ధితో దృఢముగా మనసును**
**ఆత్మయందు నిలిపి, అన్యమందు**
**ఏ మాత్ర మన్యధా ఏ చింత లేకుండ**
**యోగసాధనచేయ యుక్తమగును,**



**తే॥ ఎట్టి సంసార విషయాలనెల్ల చేరి**
**అస్థిరంబగునో మనసట్టి విషయ-**
**వాంఛలందుండి మరలించి పార్థ! దాని**
**నిశ్చలమ్ముగ ఆత్మనే నిలుపవలయు.**

27. ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥

**ఆ॥వె॥ రజము శాంతినొంద రక్తిని వీడుచున్**
**శాంతచిత్తుడగుచు చింతవదలి**
**బ్రహ్మరూపు డగుచు పావనుండా యోగి**
**పరమ భావమందు పార్థ! అతడు.**

28. యుఞ్జన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యంతం సుఖమశ్నుతే ॥

**ఆ॥వె॥ అట్లు మనసునెపుడు ఆత్మపై లగ్నంబు**
**చేసి, పాపరహిత చిత్తుడగుచు**
**బడయు సులభముగను బ్రహ్మానుభవమైన**
**పరమసుఖము నతడు పార్థ ! వినుము.**



29. సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥

**ఆ॥వె॥ యోగయుక్తుడగుచు తగనన్ని భూతాల**
**సమముగానె చూచు జ్ఞానయోగి**
**అన్ని భూతములను అతనిలో చూచును**
**అన్ని భూతములలొ తన్ను చూచు.**

30. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥

**వ॥ ఓ అర్జునా! అన్ని ప్రాణులలో నన్నునూ, నాలో అన్ని ప్రాణులను చూడగలిగే ఆ యోగికి నేను ఎన్నడూ అదృశ్యుడను కాను. అలాగే ఆ యోగికూడా నాకు అదృశ్యుడుకాడు.**

31. సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥



**తే॥ అన్ని భూతములందెల్ల యున్న నన్ను**
**బడసి, ఏకత్వమున నన్ను భక్తి గొల్చు**
**నట్టి యోగి, ఏ వ్యాపారమందునున్న**
**అన్ని వేళల యుండు నాయందె పార్థ !**

32. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం సయోగీ పరమో మతః ॥

**తే॥ సర్వజీవుల సుఖదుఃఖచయములన్ని**
**ఎంచు తనవిగా ఆ యోగి యెల్లయెడల**
**యోగులందున శ్రేష్ఠుడు యోగ్యుడతడె**
**నాదు అభిమతం బర్జునా! అదియె సుమ్మి!**

33. అర్జున ఉవాచ
యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన ।
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥
అర్జునుడిలా అన్నాడు

ఆ॥వె॥ నీవు చెప్పెడి సమభావమ్ము నే జూడ
జాలనయ్య, మనసు చంచలంబు
కాన, యోగమందు కలుగు శాశ్వతస్థితిన్
సాధ్యపడదు చూడ సరిగ కృష్ణ !

34. చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥

ఆ॥వె॥ చంచలంబు మనసు, సంక్షోభకరమయ్య!
బలము కలిగియుండు చాల దృఢము
ఎటుల గాలి నాప నేరీతి కష్టమో
మనసు నిగ్రహంబు మనిషికటులె.

35. శ్రీభగవానువాచ
అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥
భగవాను డిలా అన్నాడు.

ఆ॥వె॥ సవ్యసాచి! మనసు చంచలం బైనదే
నిగ్రహించదగము నిజము సుమ్మి,
అరయ సాధనమున వైరాగ్యమొందుచున్
మనసు నిగ్రహించు మనుజుడిలను.



36. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః ॥

ఆ॥వె॥ ఆత్మ నిగ్రహంబు అమరని వాడిలన్
యోగ సిద్ధిపొంద నోపదయ్య,
నిగ్రహంబుయున్న నియతియౌ సాధనా-
యుక్తిచేత నతడు యోగమందు.

37. అర్జున ఉవాచ
అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥
అర్జునుడిలా అన్నాడు

ఆ॥వె॥ యోగమునను శ్రద్ధ నొందియున్నను, ఆత్మ-
నిగ్రహంబులేక, నియతిలేక
యోగభ్రష్టుడయిన యోగి సిద్ధి గనక
ఎట్టి గతిని పొందు నెరుగ చెపుమ.

38. కచ్చిన్నోభయవిభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥



తే॥ మోక్షమార్గాన భ్రష్టుడై ముక్తిగనక
అస్థిరుండును అయ్యెడు నట్టి యోగి
చేరి మేఘాలు నింగిని చెదరినట్లు
చెడునె ఇహపరాలకు వాడు చెప్పవయ్య!

39. ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః ।
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥

ఆ॥వె॥ నాదు సందియంబు వదలింప పూర్తిగన్
అర్హుడొకడ వీవె యది నిజంబు,
సంశయంబు తీర్ప సాధ్యంబు నీకు మా-
త్రమ్మె, నిన్ను మించదగునె యొరులు.

40. శ్రీభగవానువాచ
పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।
న హి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥
అప్పుడు భగవానుడిలా అన్నాడు

ఆ॥వె॥ యోగపతితుడైన యోగికిహమునందు
పరమునందు హాని జరుగబోదు,
మంచి పనులు చేయు మనుజుండు దుర్గతిన్
పొందదయ్య తండ్రి! భువిని దివిని.



41. ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభిజాయతే ॥

ఆ॥వె॥ పుణ్యచరితులందు పుణ్యలోకములలో
పెక్కువత్సరములు ప్రీతి గడపి
అవని సిరులుగల సదాచారు లిండ్లలో
యోగి భ్రష్టుడైన నొందు జన్మ.

42. అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥

వ॥ అట్లు యోగభ్రష్టుడు కాని ఉత్తమయోగి
జ్ఞానుల కుటుంబమున జన్మించును.
ఓ అర్జునా! అట్టి జన్మ దుర్లభమని తెలియుము.

43. తత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥

44. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥

45. ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ ॥

**సీ॥ అట్లు యోగుల వంశమందునన్ జన్మించి**
**పూర్వదేహపు బుద్ధి పొంది అతడు**
**మోక్షసిద్ధి కొరకు మొదటి జన్మను మించి**
**గట్టి యత్నము జేయగలుగు నతడు,**
**ఆ జన్మ జేసిన అభ్యాసములచేత**
**అప్రయత్నముగనె అమరుభక్తి,**
**వేద జిజ్ఞాసువుల్ వేదకర్మలబొందు**
**ఫలము నధిగమించు పంతమూని,**

**తే॥ అటుల సాధనన్ పాపమ్ములన్ని బాసి**
**పూర్వజన్మల సంస్కార పుణ్యగరిమ**
**ఇపుడు ఈ జన్మయందున ఎనయు సిద్ధి**
**పరమగతి పొందు తప్పక పార్థ! వినుము.**

46. తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ॥

**తే॥ తాపసులకన్ననా, జ్ఞానధనులకన్న,**
**కర్మ నిరతంబు చేసెడి ఘనులకన్న,**
**ధ్యానయోగి శ్రేష్ఠుడు పార్థ! ధరణియందు**
**ధ్యానయోగివిగా యొప్పి ధన్యుడగుము.**



47. యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥

**ఆ॥వె॥ అరయ నట్టి యోగులందున, నాయందె**
**మనసు నిలిపి శ్రద్ధమనగ నెపుడు**
**భక్తి గొలుచువాడు పరమశ్రేష్ఠుడు పార్థ!**
**నాదు మతము కూడ అదియె జుమ్మి!**

## ఇది శ్రీ కృష్ణార్జున సంవాదరూపమగు
## శ్రీమద్భగవద్గీత లోని
## ఆత్మసంయమ యోగము
## (ధ్యానయోగము) అను
## ఆరవ అధ్యాయము



శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## ఏడవ అధ్యాయము

## విజ్ఞాన యోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 7వ శ్లోకము వఱకు** – విజ్ఞాన సహిత జ్ఞానమును గూర్చి వివరణము.

**8నుండి 12వ శ్లోకము వఱకు** – సమస్త పదార్థములయందును కారణరూపుడైన భగవంతుని వ్యాపకత్వ వివరణము

**13 నుండి 19వ శ్లోకము వఱకు** – ఆసురీ స్వభావము గలవారిని నిందించుట మరియు భగవద్భక్తులను ప్రశంసించుట.

**20 నుండి 23వ శ్లోకము వఱకు** – అన్యదేవతల నారాధించు వారి గురించి భగవానుని అభిప్రాయము.

**24 నుండి 30వ శ్లోకము వఱకు** – భగవంతుని ప్రభావ స్వరూపములను ఎఱుంగని వారిని నిందించుట మరియు ఎఱింగినవారి మహిమను తెలియజెప్పుట.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:

3, 4, 7, 14, 16, 17, 18, 19, 21, 30

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:

జీవులకు జన్మ జరా మృత్యు దుఃఖము నుండి విముక్తి కలుగుట.

# శ్రీమద్భగవద్గీత
# ఏడవ అధ్యాయము
# విజ్ఞాన యోగము

1. శ్రీభగవానువాచ
మయ్యాసక్తమనాః పార్థ యోగం యుఞ్జన్మదాశ్రయః।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు॥
భగవానుడిలా అన్నాడు.

**కం॥ నను నీ మదిలో నిలుపుచు**
**నను శరణని ఆశ్రయించి, నను యోగముతో-**
**డను నిస్సందేహముగా**
**నను పూర్తిగ తెలియు విధము నయముగ చెపుదున్.**

2. జ్ఞానం తేఽహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః।
యత్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్జ్ఞాతవ్యమవశిష్యతే॥

**తే॥ దేని నెరిగిన పిమ్మట తెలియదగ్గ-**
**దేది మిగులదొ దానిని యిపుడు చెబుదు**
**వినుము విజ్ఞాన సహితమౌ జ్ఞానమీవు**
**నేను పూర్తిగ బోధింతు నీకు పార్థ !**



3. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥

**ఆ॥వె॥ వేలమందిలోన విను యోగసిద్ధికై**
**కష్టపడు నొకండె ఘనుడు వాడు,**
**అట్టి సాధకులలో అర్జునా! నాతత్త్వ**
**మొక్క దెవడొ తెలిసి ఒప్పియుండు.**

4. భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥

**ఆ॥వె॥ నీరు, భూమి, అగ్ని, నింగి, వాయువు, అహం-**
**కారమున్, మనసును మరియు బుద్ధి**
**యనుచు నాదు ప్రకృతి అపరమై యెనిమిది**
**విధములగుచు నొప్పు వినుము పార్థ!**

5. అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్॥

**ఆ॥వె॥ ఇటుల నీకు చెప్పు ఇట్టి నాదుప్రకృతి**
**అపరమందురయ్య అల్పమదియె,**
**జీవరూప మొప్పి అవని ధరించెడు**
**ప్రకృతి వేఱు కలదు పరమమదియె.**



**వ్యాఖ్య: ఆ పరమాత్మయొక్క ప్రకృతి ఎనిమిది విధములుగా విభజింపబడినది:**
**పంచభూతములు (భూమి, గాలి, నీరు, అగ్ని ఆకాశము) మనస్సు, బుద్ధి, అహంకారము వీటి నన్నిటినీ అంత శ్రేష్ఠముకాని అపరాప్రకృతి అనియు, సంపూర్ణ జగతికి ఆధారము సృష్టికారణము అయిన ఉత్తమోత్తమ ప్రకృతిని పరాప్రకృతి అనియు తెలియదగును.**

6. ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా ॥

**ఆ॥వె॥ ప్రాణికోటియంత ప్రకృతులీ రెంటిచే**
**జన్మనొందునయ్య జగతియందు,**
**ప్రాణులన్ని ఇట్లు ప్రభవించి నశియింప**
**కారణమును నేనె ఎరుగుమయ్య.**



7. మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥

**తే॥ ఉన్నతంబైనదే లేదు నన్నుమించి**
**దారమందున మణులన్ని దాల్చబడిన-**
**యట్టి విధమున ఈ జగమంత నాలొ**
**కూర్చబడియుండె తెలియుము కుంతిపుత్ర!**

8. రసోఽహమప్సు కౌంతేయ ప్రభాఽస్మి శశిసూర్యయోః।
ప్రణవస్సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥
9. పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥
10. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్।
బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజస్తేజస్వినామహమ్ ॥

**సీ॥ నీటిలో రుచివలె నేనుంటినా, సూర్య-**
**చంద్రుల కాంతిని, సర్వవేద**
**ములలోని ఓంకారమును నేనె కౌంతేయ !**
**గగనమందు శబ్దగతియు నేనె,**
**మనుజుల పౌరుషంబును, పృథ్విని సుగంధ-**
**మును, అగ్నితేజంబు నేనె సుమ్మి,**
**అన్ని ప్రాణుల నున్న ఆయువు నేనె, ఆ**
**తాపసులందున్న తపము నేనె,**

తే॥ బుద్ధిమంతుల యందున్న బుద్ధి నేనె,
ధీరులందున నెలకొన్న తేజమేను,
సర్వప్రాణుల బీజమ్ము సవ్యసాచి !
నేనెయని తెలియుము నీవు నిక్కముగను.

11. బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।
ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥

వ॥ ఓ అర్జునా! బలవంతులలోని కామ రాగ రహితమైన బలమును కూడా నేనే. భూతములన్నింటి యందును ధర్మమునకు విరుద్ధముకాని కోరికయు నేనే సుమా!

12. యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే ।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥

ఆ॥వె॥ పార్థ! త్రిగుణజనిత భావములన్నియు
నాదు మహిమ గలుగు మదిని తోచి,
నేను వాటిలోన లేనని తెలియుము
అవియు లేవు నాదు ఆత్మయందు

13. త్రిభిర్గుణమయైర్భావైరేభిస్సర్వమిదం జగత్।
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్॥



వ॥ ఓ పార్థా! ఈ త్రిగుణములయొక్క వికారములగు స్వభావములచేత ప్రాణులన్నీ మోహముచే భ్రాంతి నొంది, నేనుకూడా ఈ త్రిగుణాలకు అతీతుడను కానని భావించి అంతములేని అక్షరుడనైన నన్ను గుర్తించలేకున్నారు.

14. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరన్తి తే॥

ఆ॥వె॥ త్రిగుణరూపమైన దివ్యమౌ నామాయ
నధిగమించ కష్టమయినకాని
నన్నె శరణుజొచ్చు నా భక్తులందరు
దాని దాటగలరు ధరణియందు.

15. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః।
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః॥

ఆ॥వె॥ పాపు లధము లిలను వదలని దుష్కర్మ
మాయచేత మూఢమతులు అగుచు,
ఎపుడన అసురగుణపు విపరీతబుద్ధిచే
నన్ను పొందలేరు సన్నుతించి.



16. చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥

ఆ॥వె॥ పుణ్యులైన నరులు పూజించెదరు నన్ను
పుడమి నాల్గు తెరగులున్నవారు
ఆర్తు, లర్థకాము, లమిత జిజ్ఞాసులున్,
జ్ఞానులనుచు జగతి సవ్యసాచి !

17. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః॥

తే॥ వారియందున నిత్యంబు భక్తి గొలుచు,
ఆత్మ సంధానుడౌ జ్ఞాని అధికుడయ్య!
ఏలనన అట్టి జ్ఞానికిన్ ఏను, నాకు
అతడు అత్యంత ప్రియులమైనందు చేత.

18. ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।
ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥



వ॥ ఓ అర్జునా! ఈ నాలుగు విధములైన భక్తులూ ఉదారులే అనగా భగవంతునియెడ విశ్వాసముంచి ఎల్లప్పుడూ అతనిని సేవించువారే. అయితే వీరిలో జ్ఞాని సర్వోత్తముడు అని నా అభిప్రాయము, ఏలననగా అట్టి భక్తుడు తన మనస్సును నాయందే స్థిరముగా నిలిపి నన్నే సర్వోత్తమమైన ప్రాప్యస్థానముగా నిశ్చయించి ఆశ్రయించుకొని యున్నాడు.

19. బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః॥

తే॥ జన్మలెన్నియో గడచిన జ్ఞానితుదిని
వాసుదేవుడె సర్వమీ వసుధ ననుచు,
నన్ను శరణని పొందును సన్నుతించి,
దుర్లభము అట్టి భక్తుడు దొరకుటయును.

20. కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః।
తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాస్స్వయా॥

వ॥ **కొందరు తమయొక్క ప్రకృతిచే ప్రేరేపింపబడి విషయాదులందలి కోరికచేత వివేకము కోల్పోయి దేవతారాధన సంబంధమగు నియమములను అవలంభించి ఇతర దేవతలను భజించుచున్నారు.**

21. యో యో యాం యాం తనుం భక్తః
శ్రద్ధయాఽర్చితుమిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం
తామేవ విదధామ్యహమ్॥

22. స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధనమీహతే।
లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్॥

23. అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్ప మేధసామ్ ।
దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి॥

సీ॥ **ఏ భక్తుడేదేవు నేరీతి గొల్చునో**
**అతనికి ఆ దైవమందు నేనె!**
**నిశ్చలంబగు శ్రద్ధ నిలుపుచున్నాడను,**
**ఆ దేవతల గొల్చునందు చేత**
**వారితో నాకృపన్ భక్తులు వాంఛించు**
**భోగములన్నిటిన్ పొందగలరు,**
**అల్పబుద్ధులయిన అట్టి నరులు పొందు**
**ఫలము లశాశ్వతములగునయ్య,**



తే॥ **అన్య దేవతలను గొల్చు అల్పబుద్ధు-**
**లిలను ఆ దేవతల నొందగలరు ప్రీతి,**
**నన్ను గొల్చెడి నా భక్తులెన్నడేని**
**నన్నె పొందుట తథ్యము నరవరేణ్య!**

24. అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యన్తే మామబుద్ధయః।
పరం భావమజానన్తో మమావ్యయమనుత్తమమ్ ॥

ఆ॥వె॥ **శాశ్వతుడను నేను, సర్వోత్తముడ నేను**
**ఇట్టి పరమభావ మెరుగ లేక,**
**మందబుద్ధులెల్ల మానవునిగ నన్ను**
**తలచుచుందురయ్య ధరణియందు.**

25. నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః।
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్॥

26. వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥

27. ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వ మోహేన భారత ।
సర్వభూతాని సమ్మోహం సర్గే యాన్తి పరంతప ॥



28. యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్।
తే ద్వన్ద్వమోహనిర్ముక్తా భజన్తే మాం దృఢవ్రతాః॥

సీ॥ **వర్తమానము, భూత, భావి కాలములోని**
**ప్రాణులన్నియు నాకు పరిచయంబె,**
**అయిన నెరుగ నన్ను అలవి కాదెవరికి**
**భక్తిలేక నన్ను బడయలేరు**
**పుట్టుకతోడనే పుడమి భూతములెల్ల**
**రాగద్వేషమువల్ల లబ్ధమయిన**
**ద్వంద్వములందున తగులుచు మితిలేని**
**సమ్మోహులౌదురు సవ్యసాచి !**

తే॥ **కాని నిష్కామముగ పుణ్యకర్మలెల్ల**
**చేయు పురుషుల పాపముల్ బాయు నిలను,**
**ద్వంద్వ మోహములందున తగులుగొనక**
**గొప్ప నిష్ఠతో నను వారు కొలుతురయ్య.**

29. జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే।
తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్॥



తే॥ **శరణు పొందుచు, జరయును మరణమున్ను**
**లేని ముక్తికి యత్నించు మనుజులెల్ల,**
**అఖిల కర్మల నధ్యాత్మ మంతయున్ను**
**బ్రహ్మమేయని తలతురు వారు పార్థ!**

30. సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః।
ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥

వ॥ **ఓ అర్జునా! అధిభూత అధిదైవ అధియజ్ఞ రూపుడనైన నన్ను నాతత్త్వమును తెలిసినవారు అంత్యకాలమునకూడా నిలకడగల మనస్సు కలవారలై నన్నెరుగగలరు.**

**ఇది**
**శ్రీకృష్ణార్జున సంవాద రూపమగు**
**శ్రీమద్భగవద్గీత లోని**
**విజ్ఞానయోగమను**
**ఏడవ అధ్యాయము.**

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## ఎనిమిదవ అధ్యాయము

## అక్షర పరబ్రహ్మ యోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 7వ శ్లోకము వరకు** – బ్రహ్మము, అధ్యాత్మము, కర్మ మొదలగు విషయముల గురించి అర్జునుని ప్రశ్నలు – వాటికి పరమాత్మ సమాధానములు.

**8నుండి 16వ శ్లోకము వరకు** – ప్రణవోపాసనము, దాని ఫలితము

**17 నుండి 19 వరకు** - సృష్టి ప్రళయముల గూర్చి వివరణము.

**20 నుండి 22 వరకు** – భగవానుని సనాతన స్వరూపము.

**23 నుండి 26వ శ్లోకము వరకు** - శుక్ల కృష్ణ మార్గముల వర్ణనము.

**27, 28 శ్లోకములు** - యోగి యొక్క మహిమ

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:

6, 7, 8, 9, 10, 13, 14, 16, 19, 22, 26, 28

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:
సమస్త దుర్గతి నివారణ, మోక్షప్రాప్తి.



# శ్రీమద్భగవద్గీత
## ఎనిమిదవ అధ్యాయము
## అక్షరపరబ్రహ్మ యోగము

1. అర్జున ఉవాచ
కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే ॥
అర్జునుడిలా అన్నాడు:

**ఆ॥వె॥ అరయ బ్రహ్మమేది, అధ్యాత్మమననేమి,**
**కర్మ యనెడి దాని మర్మమేమి,**
**అందురయ్య వేని అధిభూత మధిదైవ**
**మనుచు వాని తెలుపు మనెద నాకు**

2. అది యజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః॥

**ఆ॥వె॥ ఈ శరీరమందు యెవడధియజ్ఞుండు**
**వాని గుణము లేవి వాసుదేవ!**
**మనసు నిగ్రహించి మనెడు వారంత్యాన**
**తెలియు నిన్ను యెటుల తెలుపుమయ్య**



3. శ్రీభగవానువాచ
అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః॥

4. అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।
అధియజ్ఞోఽహమేవాత్ర దేహే దేహభృతాం వర॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు.**

**సీ॥ సర్వోత్తముండు శాశ్వతుడును యెవ్వడో**
**బ్రహ్మము నాబడున్ పార్థ! వినుము,**
**బ్రహ్మముయొక్క స్వభావమునంతయు**
**అధ్యాత్మమని బుధులందురయ్య,**
**ప్రాణులు జనియించి వడి వృద్ధినొందగ**
**త్యాగయుక్తమ్మయి తనరుచుండు,**
**కారణమైనట్టి కార్యమే కర్మని**
**చక్కగా అనబడున్ జగతియందు,**

**తే॥ భువిని నశియించునదె అధిభూత మగును,**
**తను హిరణ్యగర్భుడు అధిదైవమగును,**
**నిలిచి దేహాన తనరుచు వెలయుచుండు-**
**నట్టి అధియజ్ఞుడే నేను అతిశయముగ!**

5\. అన్తకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥

**కం॥ ఎవ్వడు ప్రాణము వీడుచు**
**నెవ్విధముగనైన నన్నె యెరిగి స్మరించన్,**
**అవ్వల నారూపమునే**
**ఎవ్విధమగు శంకలేక యెనయును పార్థా!**

6\. యం యం వాఽపి స్మరన్ భావం త్యజత్యన్తే కలేబరమ్।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః॥

**కం॥ జీవుడు అంత్యమునందున**
**భావము లెవ్వానితోటి పరగుచు భువిలో**
**జీవము వీడునొ, ఆయా**
**భావాలకు తగ్గ స్థితినె బడయును పార్థా!**

7\. తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ।
మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః॥



**తే॥ అన్ని వేళల తలచుచు ఆత్మనన్నె**
**యుద్ధమును నీవు చేయుము శ్రద్ధతోడ,**
**మనసు, బుద్ధిని నాకు అర్పణముచేయ**
**నన్ను పొందేవు శంకేల నరవరేణ్య!**

8\. అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా।
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్॥

**ఆ॥వె॥ ఇతర విషయమందు ఇచ్ఛపోనీయక**
**యోగి సాధనమున యుక్తుడగుచు**
**పరమపురుషుడైన బ్రహ్మమున్ స్మరియించ**
**బ్రహ్మ బొందగలడు పార్థ! తుదకు.**

9\. కవిం పురాణమనుశాసితారం
అణోరణీయాంసమనుస్మరేద్యః ।
సర్వస్య ధాతారమచింత్యరూపం
ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥

10\. ప్రయాణకాలే మనసాఽచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుషముపైతి దివ్యమ్ ॥



**సీ॥ సర్వజ్ఞుడాతండు, శాశ్వతుడాతడే,**
**సకలలోకాల శాసకుడు నతడె,**
**అణువుకంటెను సూక్ష్మడతడు, నచింత్యుడు,**
**గొప్పగా రవికాంతి నొప్పువాడు,**
**అఖిల జగతికంత ఆధారమగువాడు,**
**ఊహకందని రూపమొప్పువాడు,**
**అజ్ఞాన తిమిరాని కావల తానుండి**
**యోగిజనుల ప్రీతినొలయువాడు,**

**తే॥ అట్టి పరమాత్మ నంత్యాన, గట్టిదయిన**
**మనసుతో, భక్తి యోగపుబల్మి, కన్ను-**
**బొమల మధ్యన యోగి ప్రాణమును నిలిపి,**
**వాని స్మరియించి పొందును పార్థ! వినుము.**

11\. యదక్షరం వేదవిదో వదన్తి విశన్తియద్యతయోవీతరాగాః।
యదిచ్ఛన్తోబ్రహ్మచర్యంచరంతి తత్తేపదం సంగ్రహేణప్రవక్ష్యే॥



**ఉ॥ దేనిని వేదవేత్తలిటు దివ్యము శాశ్వతమైనదందురో**
**దేనినిపొంది యోగులిల దీటుగ రాగము వీడుచుందురో**
**దేనికోరి మానవులు దీక్ష వహింతురొ బ్రహ్మచర్యమున్**
**దానిని సంగ్రహమ్ముగను తప్పక తెల్పెద నీకు నర్జునా!**

12\. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్॥

13\. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్॥

14\. అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః।
తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥

**సీ॥ ఇంద్రియమ్ముల నిగ్రహించుచు నెప్పుడు**
**మనుసు హృదయమందు మగ్నమవగ,**
**శిరమున ప్రాణంబు స్థిరముగా నుంచుచు,**
**యోగసాధనమున యుక్తుడగుచు,**
**బ్రహ్మరూపంబైన ప్రణవంబు బలుకుచు**
**తనువు వీడెడి యోగ ధన్యుడిలను,**
**పరమ పవిత్రుండు తరలిపోయిన వెన్క**
**పరమగతిని పొందు పార్థ! వినుము**

**తే॥ ఇట్లు ఏకాగ్రచిత్తాన యెల్లయెడల**
**నన్ను నిత్యము స్మరియించు ఉన్నతునికి**
**సులభముగనేను లభియించగలను సుమి!**
**ఇందు అణుమాత్ర సందియంబొందవలదు.**

15. మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః॥

**ఆ॥వె॥ పరమమయిన సిద్ధి బడయు మహాత్ములు**
**తుదకు నన్నుపొంది, దుఃఖమునకు**
**ఆలయంబు, క్షణికమయ్యెడి జన్మల**
**పొందరయ్య! తిరిగి పుడమియందు.**

16. ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥

**ఆ॥వె॥ అన్నిలోకములును అజుని లోకముదాక**
**మారుజన్మ నిచ్చు తీరు కలవె,**
**నన్ను చేరువారు నయముగ మరుజన్మ**
**నందబోరు పుడమియందు పార్థ!**



17. సహస్రయుగపర్యంతమహర్యద్బ్రహ్మణో విదుః।
రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః॥

18. అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥

**వ॥ ఓ అర్జునా! వేయిచతుర్యుగములకాలము ఆ బ్రహ్మదేవునికి ఒక పగలు. అదే విధముగా రాత్రి కూడా వేయి చతుర్యుగములు. ఇది ఏ జనులెరుగుదురో వారు కాలతత్త్వమును పూర్తిగా తెలిసిన వారగుదురు. చరాచర వస్తువులన్నియు బ్రహ్మ యొక్క పగటి కాలము ప్రారంభముకాగానే అవ్యక్తమునుండి అనగా ప్రకృతి నుండి ఉత్పన్నమగును. మఱల బ్రహ్మయొక్క రాత్రి ఆరంభమగునప్పుడు అదే అవ్యక్తమునందు ఆ ప్రాణులన్నీ లీనమగుచుండును.**

19. భూతగ్రామస్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే।
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే ॥



**తే॥ ప్రకృతి నుండియె ప్రాణులు పార్థ! ఇలను**
**మరల మరల జన్మలనంది మనుచునుండు,**
**రాత్రి ఆరంభమగువేళ లయము నగుచు**
**పగటి ఆరంభమున పుట్టు ప్రాణులెల్ల.**

20. పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్సనాతనః।
యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥

21. అవ్యక్తోఽక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్ ।
యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥

22. పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా।
యస్యాంతః స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్॥

**సీ॥ అవ్యక్త ప్రకృతికి అన్యమనాదియై**
**పరమమైనట్టిదే పరమపదము,**
**బ్రహ్మమే నిత్యము ప్రాణులన్ని నశించు**
**అవ్యక్తుడాతండు అక్షరుండు,**



**పరమగతి యతండె పరమధామంబదే**
**వ్యవహరింతురటుల వాని బుధులు**
**ఆ పరంధామమే అగును నా నిలయంబు,**
**చేరి దాని నెవరు తిరిగి రారు,**

**తే॥ ఎవనియందున ప్రాణులు ఇమిడియుండె**
**ఎవడు సర్వత్ర వ్యాపించి యెనయుచుండె**
**అట్టి పరమాత్మ లభియించునయ్య! వినుము**
**ప్రజ కనన్యంబు నయ్యెడి భక్తిచేత.**

23. యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగినః।
ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥

**కం॥ ఎప్పుడు మరణమునొందిన**
**తప్పక మరుజన్మనొందు ధరణిని యోగుల్,**
**ఎప్పుడు దేహము వీడిన**
**ఎప్పటికిని జన్మలేదొ ఏర్పడ చెపుదున్.**

24. అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥

25. ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్।
తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే॥

**వ॥ ఓ అర్జునా! అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము ఏ మార్గమునందు కలవో, మరణానంతరము ఆ మార్గమున (దేవయానము) వెడలు యోగులు పరబ్రహ్మమునే పొందుచున్నారు. ధూమము, రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనము ఏమార్గమునందు కలదో, మరణానంతరము ఆ మార్గమున (పితృ మార్గము) వెడలు యోగులు చంద్రమండలము చేరి అచట కొంత కాలము సుఖించి తిరిగి పుడమిని జన్మింతురు.**

26. శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।
ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పునః ॥

**ఆ॥వె॥ మహిని నిత్యమైన మార్గాలు రెండగున్**
**పార్థ! శుక్ల, కృష్ణ మార్గములని,**
**పోవ శుక్లమందు పుడమి జన్మములేదు,**
**మరలజన్మ కృష్ణమార్గ మిచ్చు.**



27. నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన।
తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥

**వ॥ ఓ అర్జునా! ఈ రెండు మార్గముల గురించి బాగుగ తెలిసిన యోగి మరల మోహమునొందదు. అందువల్ల నీవు నిరంతరము దైవయుక్తుడవు అగుము.**

28. వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ
దానేషు మత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వమిదం విదిత్వా
యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥

**ఆ॥వె॥ దీని తెలియునట్టి దీటైన ఆ యోగి**
**తపము వేద యజ్ఞ దాన గరిమ**
**అమరు పుణ్యఫలము నధిగమించి, అనాది**
**అయిన పరమపదము నంద గలుగు.**

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగవద్గీతలోని**
**అక్షరపరబ్రహ్మ యోగమను**
**ఎనిమిదవ అధ్యాయము**



శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## తొమ్మిదవ అధ్యాయము

## రాజవిద్యా రాజగుహ్య యోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 6వ శ్లోకము వరకు** – ప్రభావ సహితముగ జ్ఞానమును గూర్చి వివరణ.

**7నుండి 10వ శ్లోకము వరకు** – జగత్తు ఉత్పత్తి వివరణము.

**11 నుండి 15వ శ్లోకము వరకు** – భగవంతుని తిరస్కరించు ఆసురీప్రకృతి గలవారి యొక్కయు మరియు దేవీప్రకృతిగలవారి యొక్క లక్షణములు.

**16 నుండి 19వ శ్లోకము వరకు** – సర్వాత్మస్వరూపుడైన భగవత్స్వరూప ప్రభావ వర్ణనము.

**20 నుండి 25వ శ్లోకము వరకు** – సకామ, నిష్కామ ఉపాసనల ఫలము.

**26 నుండి 34వ శ్లోకము వరకు** – నిష్కామభక్తి మహిమ గూర్చి వివరణము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:

6, 11, 14, 21, 22, 23, 26, 27, 29, 30, 31, 32, 34

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:

ప్రతిగ్రహణాది జనిత దోష వినాశము

# శ్రీమద్భగవద్గీత
# తొమ్మిదవ అధ్యాయము
# రాజవిద్యారాజగుహ్యాయోగము

1. శ్రీభగవానువాచ
ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।
జ్ఞానం విజ్ఞానసహితం యత్జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్॥

వ॥ **భగవానుడిలా అన్నాడు**

ఆ॥వె॥ **ఎఱిగి దేని నీవు దురిత సంసారంబు**
**నందు బడక ముక్తిపొందగలవొ,**
**వినుము గోప్యమయిన విజ్ఞాన సహితమౌ**
**జ్ఞానమిత్తు ఈసు లేని నీకు.**

2. రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్॥

వ॥ **ఈ విజ్ఞానసహిత జ్ఞానము అన్ని విద్యలకు రాజు. సమస్త గుహ్యము(రహస్యము)లకు తలమానికము. అతి పవిత్రము. ఉత్తమోత్తమము, ప్రత్యక్షఫలదాయకము, ధర్మయుక్తము, సాధన చేయుటకు మిక్కిలి సుగమము మరియు శాశ్వతము.**



3. అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।
అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥

కం॥ **ఎఱుగుము ఈ ధర్మంబున**
**గుఱి వీడిన పురుషులిలను కోరరు నన్నున్,**
**మరణపు రూపము తోడను**
**సరియౌ సంసారమందు చరియింతురయా.**

4. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।
మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥

ఆ॥వె॥ **ఇంద్రియములు కనని ఇట్టి నా రూపము**
**విశ్వమంత వెల్లివిరిసియుండు,**
**జీవులన్ని నాలొ స్థిరముగ నుండియున్**
**నేను వాటియందు లేను పార్థ!**

5. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥

తే॥ **యుక్త మీశ్వరీయము నాదు యోగశక్తి**
**కనుము ఎల్ల ప్రాణులు నాలొ మనవు పార్థ!**
**చేతు నీసృష్టి, పోషింతు భూతములను**
**కాని నా ఆత్మవాటిలో మనుట లేదు.**



6. యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్।
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥

ఆ॥వె॥ **అంతట చరియించు ఆ మహావాయువే**
**నింగియందు యెపుడు నిలుచరీతి,**
**సర్వభూతములును చక్కగా నాలోనె**
**నెలకొనును తెలియుము నిశ్చయముగ.**

7. సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥

ఆ॥వె॥ **ప్రళయకాలమందు ప్రాణులు అన్ని నా**
**దైవ ప్రకృతియందు తనరుచుండు,**
**సృష్టికాలమందు సృజియించుచుంటి నే**
**తిరిగి వాని మరల తెలియుమయ్య!**

8. ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః।
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్ ॥

ఆ॥వె॥ **ప్రకృతికి వశమగుచు పరతంత్రమైనట్టి**
**సకల భూతములను జగతియందు**
**నావశమున నున్న నామూలప్రకృతిచే**
**మరల మరల సృష్టి జరుపుచుంటి.**



9. న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు ॥

వ॥ **ఓ అర్జునా! ఆ సృష్ట్యాది కర్మలయందు ఆసక్తిలేని వాడినై సాక్షీభూతుని వలెనున్న నన్ను ఆకర్మలెవ్వియు బంధించవు.**

10. మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్।
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥

ఆ॥వె॥ **నాదు మూలప్రకృతి నాదు అధ్యక్షతన్**
**ఈ చరాచరమగు యీ జగతిని**
**సృష్టి చేయు జగతి శ్రీ చక్రము వలెనె**
**తిరుగుచున్నదయ్య! తెలియు మిదియె.**

11. అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్।
పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥

తే॥ **అన్ని ప్రాణుల ప్రభువును అయిన నాదు**
**పరమ భావము నెరుగని మందమతులు**
**మహిని మానవరూపాన మనెడి నన్ను**
**కించపరతురు మానవుడంచు తలచి.**

12. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః॥

వ॥ ఓ అర్జునా! అట్టి మూఢమతులు వ్యర్థమైన ఆసలు గలవారై, విపరీతమైన (వక్రించిన) జ్ఞానముతో వ్యర్థమైన కర్మలు చేసి, బుద్ధిహీనులై రాక్షస సంబంధమైన, అసుర సంబంధమైన మోహమును కలుగచేయు స్వభావములను ఆశ్రయించుచుందురు.

13. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః।
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥

తే॥ అనఘ! దైవీప్రకృతి నొందునట్టి ఘనులు
అన్ని ప్రాణుల మూలమునంచు తెలిసి
అవ్యయుండంచు భావించి అవని నన్నె
గొప్ప స్థిరమైన మనసుతో కొలుతురయ్య!

14. సతతం కీర్తయన్తో మాం యతంతశ్చ దృఢవ్రతాః।
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥

ఆ॥వె॥ అట్టి ఘనులు నన్ను అతి శ్రద్ధ గీర్తించి
పట్టువిడని గట్టి భక్తితోడ
నాకు ప్రణతులిచ్చి నా మీదె మనసుంచి
నన్ను కొలుతురయ్య! ఎన్నొ విధుల.

15. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మాముపాసతే।
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥



వ॥ ఓ అర్జునా! కొందరు జ్ఞానయోగులు, నిర్గుణ నిరాకార బ్రహ్మమైన నన్ను జ్ఞానయజ్ఞముద్వారా అభేద భావముతో ఉపాసింతురు. కొందరు అనంతరూపములతో ఒప్పెడి నా విరాట్ స్వరూపమును ద్వైతభావముతో ఉపాసింతురు.

వ్యాఖ్య॥ జ్ఞానయజ్ఞముచే పరమాత్మను గొల్చువారు కొందరు ఈశ్వరుని సోహంభావముతోనూ మరికొందరు భిన్నభావముతోనూ, మరికొందరు అన్నిటియందు ఒకే పరమాత్మగలడను ఏకత్వభావముతోనూ, మరికొందరు ఆయానామరూపములను ధరించిన వేఱువేఱు దేవుళ్ళుగా భావించి వేఱువేఱు పేర్లతో కొల్తురు.

విశ్వమంతయూ ఈశ్వర స్వరూపమే అని భావించి సేవించు విశ్వరూపోపాసన బాహ్యమగు జ్ఞానయజ్ఞము. తానాత్మ స్వరూపుడననియూ, జీవితమంతా ఒకే సత్రయాగమనియు భావించి జీవిత వ్యాపారముల నన్నింటినీ ఈశ్వరారాధనగా నొనర్చుట ఆంతరంగిక జ్ఞానయజ్ఞము. తమతమ లక్ష్యములను బట్టియు ఉపాసకులకును



లక్ష్యములకును గల సంబంధమును బట్టియు నానావిధోపాసన లేర్పడినవి. ఉపాసకుల ననుసరించి నవవిధభక్తి యనియు పంచభావముల భక్తి యనియు పెక్కు విధానము లేర్పడినవి.

16. అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్।
మంత్రోఽ హమహమేవాజ్యమహమగ్నిరహం హుతమ్॥

17. పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః।
వేద్యం పవిత్రమోంకార ఋక్సామ యజురేవ చ ॥

18. గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥

సీ॥ క్రతువును, యజ్ఞమున్, పితరులకర్పించు
అన్నంబు అర్జునా! అదియు నేనె
ఔషధంబును, మంత్ర మాజ్యమగుదు నేనే,
హవనంబయునునేనె, అగ్ని నేనె,
తల్లిదండ్రియు నేనె, తగ నీజగతికిని
తాత, కర్మఫలపు దాత నేనె,
మూడువేదమ్ములున్ ముచ్చటగా నేనె,
వేద్యమున్ ఓంకార విదితమేను,



తే॥ నేనె ప్రభువును, సాక్షిని నేనె గతిని
ఆశ్రయంబును, బ్రహ్మను, ఆప్తుడేను.
నేనె సంహారకర్తన్, నిధానమేను,
శరణమును, భర్త, బీజమున్, శాశ్వతుడను.

19. తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ।
అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥

ఉ॥ వేడిమినిత్తు సూర్యునిగ, వీడక వర్షమునిచ్చునట్టి య
వ్వాడను నేను ఈభువిని, వర్షము నాపుదు నేనె సుమ్మి, నే
వాడని అమృతత్వమును, వాటిలచేయుదు మృత్యువట్లె నే
జాడనెరుంగ చెప్పెదను, సత్తు అసత్తును నేనె అర్జునా!

20. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే।
తే పుణ్యమాసాద్య సురేంద్రలోక
మశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥

తే॥ వేదముల్ నేర్చి, పాపముల్ వీడ, వారు
యజ్ఞమందు సోమరసంబునంత త్రాగి,
స్వర్గమునుపొంది అచ్చట సర్వభోగ–
ములను పొందుచునుందురు ముదముతోడ.

21. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।
ఏవం త్రయీధర్మమనుప్రపన్నా
గతాగతం కామకామా లభంతే ॥

ఉ॥ **వారు విశాల స్వర్గమున పావనులై సుఖమందిపిమ్మటన్**
**వారల పుణ్యముల్ తరిగి, బాగుగ మానవలోకమందునన్**
**చేరుదురయ్య, వేదముల చెప్పిన కర్మల భాగ్యమందగన్**
**కోరుచు చేసి, ఆ దివికి క్షోణికి చేతురు రాకపోకలన్.**

22. అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥

ఉ॥ **ఎవ్వరనన్యభక్తి నను ఎప్పుడు చింతనచేయుచుందురో**
**ఎవ్వరు సేవచేయుదురొ ఏలిక నేనని ఎల్లవేళలన్**
**ఎవ్వరు యుక్తులయ్యెదరొ ఏర్పడ నాయెడ పాండునందనా!**
**అవ్వల వారి యోగమదియంతయు సేమము నే వహించెదన్.**

23. యేఽప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।
తేఽపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్॥



ఆ॥వె॥ **అన్యదేవతలను అతిశ్రద్ధ బూనుచు**
**కోర్కెలన్నిదీర కొల్చు నరులు**
**నన్ను కొలిచినట్లె నయముగ భావింతు**
**అవిధిపూర్వకంబు అయినగాని.**

24. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।
న తు మామభిజానన్తి తత్త్వేనాతశ్చ్యవంతి తే ॥

ఆ॥వె॥ **అన్ని యజ్ఞములను అలరు భోక్తను నేనే,**
**నేనె ఈశ్వరుండ, నేనె ప్రభువ,**
**ఇట్లు నన్నువారు ఎరుగక మరుజన్మ**
**పొందుచుందురయ్య! పుడమి యందు.**

25. యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః।
భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపిమామ్ ॥

వ॥ **ఓ అర్జునా! దేవతలను పూజించేవారు దేవతలనే పొందుదురు. పితృదేవతలను పూజించువారు వారినే పొందుదురు. భూతగణాలను పూజించువారు భూతములనే పొందుదురు. నన్ను పూజించేవారు నన్నే పొందుదురు.**

26. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యాప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥



కం॥ **విను పరిశుద్ధము నొందిన**
**మనసున నాకమలభక్తి మాన్యత పత్రం**
**బును, పుష్ప, ఫలము, నీరము**
**ఘనముగ నర్పింప ప్రీతి గ్రహియింతునయా.**

27. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥

ఆ॥వె॥ **నీవు చేయుచున్న నిత్యమౌ కర్మలన్**
**ఆచరించునట్టి హవనమైన,**
**తపము, భోజనంబు, దానంబు నైననున్**
**అర్పణంబుచేయు మనఘ! నాకు.**

28. శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।
సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥

వ॥ **ఓ అర్జునా! నీవు సన్న్యాసయోగముతో యుక్తమయిన చిత్తముగలవాడవై, ఈప్రకారముగా నీ సమస్తకర్మలనూ పరమాత్మనైన నాకు అర్పించి, శుభాశుభములనిచ్చే ఫలములుకల కర్మబంధముల నుండి విముక్తి నొందెదవు. పిదప నన్నే పొందెదవు.**

29. సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్॥



ఆ॥వె॥ **అన్ని ప్రాణులందు అలరుదు సమబుద్ధి,**
**లేదు శత్రువయిన, లేదు హితుడు**
**నాకు, భక్తులెల్ల నాయందె కలరయ్య,**
**వారియందు నేను చేరియుందు.**

30. అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥

ఆ॥వె॥ **ఎంత పాపియైన ఏకాగ్రమౌనట్టి**
**భక్తి నన్ను కొలువ, పరిగణించ-**
**వలెను సాధువంచు, ఏలన నిజముగ**
**అతని బుద్ధి స్థిరము అగుటచేత.**

31. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి॥

ఆ॥వె॥ **అతడు శీఘ్రముగను అవని ధర్మాత్ముడై**
**శాశ్వతంబునయిన శాంతిపొందు,**
**నాదు భక్తుడెవడు నాశముకాదని**
**ప్రతిన పూని పలుకు పార్థ! నీవు.**

32. మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాంగతిమ్॥

ఆ॥వె॥ పాపులయిన కాని, పడతులైనను కాని,
వైశ్య శూద్ర కులపు వారు కాని,
నన్ను శరణుపొంద నయముగ అందరు
మోక్షమందగలరు ముదముమీర.

33. కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।
అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్॥

వ॥ అటువంటి సామాన్యులకే ముక్తి దొరకినప్పుడు పుణ్యాత్ములైన బ్రాహ్మణులును, రాజర్షులును నన్ను శరణుపొంది పూజించిన ముక్తి పొందుదురని చెప్పవలసిన పనియేలేదు. ఓ అర్జునా! ఈ మానవ శరీరము క్షణభంగురము, సుఖరహితము. అట్టి మానవజన్మను పొందిన నీవు నన్ను భజింపుము.

34. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మా మేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః॥



ఆ॥వె॥ నన్ను పరమమనుచు నను భక్తి పూజించి
వందనంబు జేసి బాగుగాను
నన్ను ఆశ్రయించి నాయెడ మనసుంచి
నన్ను పొందగలవు నయము మీర.

## ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు
## శ్రీమద్భగవద్గీతలోని
## రాజవిద్యా రాజగుహ్య యోగమను
## తొమ్మిదవ అధ్యాయము



శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమత్ భగవద్గీత

## పదియవ అధ్యాయము
## విభూతి యోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు

**1 నుండి 7వ శ్లోకము వరకు** భగవంతుని విభూతి, యోగశక్తి మహిమల గురించిన వివరణము

**8 నుండి 11వ శ్లోకము వరకు** ఫలప్రభావసహితముగా భక్తి యోగము గురించిన ప్రస్తావనము

**12 నుండి 18వ శ్లోకము వరకు** అర్జునుడు భగవానుని స్తుతించుట. పరమాత్మయొక్క విభూతులను యోగ శక్తులను గురించి తెలుపుమని ప్రార్థించుట

**19 నుండి 42వ శ్లోకము వరకు** భగవంతుడు తన విభూతులను గురించి యోగశక్తులను గురించి వర్ణించుట.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :

3, 5, 8, 9, 10, 11, 39, 41, 42

ఈ అధ్యాయం చదివినవారికి కలిగే ఫలప్రాప్తి.

సర్వాశ్రమ ధర్మములాచరించిన ఫలము మరియు జ్ఞాన ప్రాప్తి

# శ్రీమద్భగవద్గీత

## పదియవ అధ్యాయము

## విభూతి యోగము

శ్రీభగవానువాచ

1. భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।
యత్తేఽ హం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా॥

**భగవానుడిలా అన్నాడు.**

ఆ॥వె॥ **సంతసించినావు చక్కగా నను విని**
**నీదు సేమమునకు నేను మరల**
**వాసి యైన యట్టి వాక్యము నుడివెద**
**వినగ శుభము కలుగు విజయ! నీకు.**

2. న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥

తే॥ **జగతి కారణభూతుడ సవ్యసాచి!**
**ఆదిదేవుడ సృష్టికి, అందుచేత**
**నాదు ఉత్పత్తి యెట్టిదో, నా విభూతి**
**దేవగణములు ఋషులునూ తెలియలేరు.**



3. యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥

ఆ॥వె॥ **అసలు జన్మలేదు ఆది యన్నది లేదు**
**ఎల్లలోకములకు యేను విభుడ**
**దీని తెలియువాడు దీటైన జ్ఞానియౌ**
**పాపముక్తినతడు బడయగలడు.**

4. బుద్ధిర్జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమః శమః ।
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ ॥

5. అహింసా సమతా తుష్టిస్తపో దానం యశోఽయశః।
భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః।

సీ॥ **సహనము, జ్ఞానమ్ము, సత్యము, బుద్ధియున్**
**మోహరాహిత్యమ్ము, ముదము, భయము,**
**శమమును, దమమును, సమదృష్టి, నిర్భీతి,**
**సుఖదుఃఖముల పొంగి సొలయకుంట,**
**పుట్టుక నొందుట, పుడమినాశముయౌట**
**కీర్తి పొందుట, నపకీర్తి గనుట**
**దానం బహింసయు, తపమాచరించుట**
**సంతృప్తి నొందుట చక్కగాను**



తె॥ **వివిధ భావము లీరీతి వెల్లివిరియు,**
**పరగు నటువంటి భావాలు ప్రాణులందు**
**నాదు చేతనే కలుగును నయము మీర,**
**తెలియు మిద్దాని నర్జునా ధీరశ్రేష్ఠ!**

6. మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః॥

వ॥ **ఇక మానవుల పుట్టుక ఎలా జరిగిందో చెప్పెదను.**

చం॥ సనక సనందనాది ఋషి సంతతినిన్ సృజియించినాడ, నే
**ననుపమ దీక్ష సప్త ఋషులందరి బూనుచు సృష్టి చేసితిన్**
**మనువులు పుట్టిరా పిదప మానసపుత్రులు వీరలందరున్**
**జననము నందినారటు ప్రజావళి వారల వంశమందునన్.**

7. ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః।
సోఽవికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥

8. అహం సర్వస్య ప్రభవో మత్తస్సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః॥



9. మచ్చిత్తా మద్గతప్రాణా బోధయన్తః పరస్పరమ్।
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ॥

10. తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే ॥

సీ॥ **నా సృష్టి మహిమనూ నాయోగ శక్తినిన్**
**నిజముగా తెలియంగ నిశ్చయముగ**
**స్థిరము అయిన యోగసిద్ధి కల్గును పార్థ!**
**కను మీజగతికంత కారణమును**
**సర్వస్వమంతయున్ జనియించె నాచేత,**
**భజియించెదరు బుధుల్ భక్తి నన్ను,**
**మనసులన్ ప్రాణాల ననువుగా నర్పించి**
**సతతంబు స్మరియించి సంతసించి**

తే॥ **ఎల్లవేళల నాయందు యుల్లముంచి**
**ప్రేమమీరంగ సేవించు విజ్ఞులకును**
**బుద్ధియోగంబు సమకూర్తు పుడమియందు**
**జ్ఞాన మార్జించి ననుజేరి మనెదరయ్య!**

11. తేషామేవానుకంపార్థమహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥

తే॥ **భక్తులెల్లర దయచూడ పార్థ! నేనె**
**వారి మనసున నిలుచుచు, ప్రజ్వరిల్లు**
**జ్ఞానదీపము చేత నజ్ఞాన మనెడి**
**తిమిరముల పార ద్రోలుదు తెలియుమయ్య!**

అర్జున ఉవాచ

12. పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్ ॥

13. ఆహుస్త్వామృషయస్సర్వే దేవర్షిర్నారదస్తథా।
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥

14. సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥

15. స్వయమేవాత్మ నాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥

**అప్పుడు అర్జునుడిలా అన్నాడు**

సీ॥ **పరమబ్రహ్మవు నీవు పరమధామం బీవు**
**జగతికిన్ గురుడవు శాశ్వతుడవు,**
**దివ్యపురుషుడవు దేవదేవుడవీవు,**
**జన్మలేకనె నిండి జగతినంత**



**వ్యాపించినావంచు వ్యాసాది ఋషులును,**
**దేవల, నారదుల్ తెలిపినారు,**
**నీవునూ స్వయముగా నీ గురించిటు నాకు**
**తెలుపుచున్నాడవు దేవ! నేడు**

తే॥ **నీవు చెప్పిన దంతయున్ నిజము స్వామి!**
**దేవదానవుల్ నీ రూపు తెలియలేరు**
**జీవరాసుల కధిపతి జీవమీవు**
**నీవు పరమపవిత్రుడ వవనికంత.**

16. వక్తుమర్హస్యశేషేణ దివ్యా హ్యాత్మ విభూతయః।
యాభిర్విభూతిభిర్లోకానిమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥

కం॥ **ఏ మహిమవలన నీ విటు**
**నీమముగా లోకమెల్ల నిండితి వదియున్**
**నా మీద కరుణ చేతను**
**ఆ మహిమల తెలియజేయ అర్హుడ వీవే.**

17. కథం విద్యామహం యోగింస్త్వాం సదా పరిచింతయన్
కేషు కేషు చ భావేషు చింత్యోऽసి భగవన్ మయా ॥

వ॥ **ఓ యోగేశ్వరా! నేను ఏవిధముగా ధ్యానము చేయుచూ నిన్ను తెలుసుకోగలను. నీవు ఏయే భావములందు ధ్యానింప తగినవాడవో తెలుపుము.**



18. విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽ మృతమ్।

ఆ॥వె॥ **నీ విభూతి లీల నీ యోగమహిమలన్**
**విస్తరించి నాకు విశదపరపు,**
**అమృతమువలె నొప్పు అలరు నీ మాటలన్**
**వినగ తీరదాయె తనివి నాకు.**

19. శ్రీభగవానువాచ
హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యన్తో విస్తరస్య మే ॥

**భగవానుడిలా అన్నాడు.**

ఆ॥వె॥ **నేను తెలియజేతు నీకు నా విభవంబు**
**అంతులేనిదవుట ఆ విభూతి,**
**ముఖ్యమైనవన్ని ముందుగ వివరింతు**
**దీని తెలియుమయ్య! దివ్యముగను.**

20. అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ।।

21. ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్।
మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ।।



22. వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవ ః ।
ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా।।

23. రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్।
వసూనాం పావకశ్చాస్మి మేరుశ్శిఖరిణామహమ్।।

సీ॥ **అన్ని జీవుల హృది నమరు ఆత్మను నేనె,**
**జననంబు, స్థితి వాటి క్షయము నేనె,**
**ఆదిత్యులందునే ననువుగా విష్ణువున్,**
**జ్యోతులందున నేను సూర్యుదౌదు,**
**ఆ మరుత్తులయందు అగుదు నేను మరీచి,**
**మినుకు తారల యందు మేటి శశిని,**
**వేదాలలో సామవేదంబు నే పార్థ।**
**ఇంపుగా సురులందు ఇంద్రుడేను,**

తే॥ **ఇంద్రియంబుల మనసును, ఇదియు గాక**
**ప్రాణులందున్న చేతన పార్థ! నేనె,**
**రుద్రులందును నే శంకరుడను చూడ,**
**యక్షులందు కుబేరుడనగుదు నేను.**

వ॥ **మరియు అష్టవసువులలో అగ్నిని. పర్వతములలో మేటియగు ఆ హిమాలయ పర్వతము నేనే.**

24. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్
సేనానీనామహం స్కందస్సరసామస్మి సాగరః ॥

25. మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽ స్మి స్థావరాణాం హిమాలయః॥
26. అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః।
గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో ముని ః॥
సీ॥ **అరయ పురోహితులందు బృహస్పతిన్,**
**సేనాపతుల స్కందుడేను పార్థ!**
**జలరాసులందునే సాగరమును సుమ్మి,**
**ఋషులలో భృగువను ఋషిని నేను,**
**ఉందు వాక్కులయందు ఓంకారముగ నేను,**
**యజ్ఞాలలో జపయజ్ఞమేను,**
**చేరి స్థావరముల స్థిర హిమాలయము నే,**
**వృక్షాల నశ్వత్థ వృక్షమేను,**
తే॥ **నారదుడను దేవర్షులన్ అరయ నేను,**
**చేరి గంధర్వులందునే చిత్రరథుడ,**
**కనగ సిద్ధులందున నేను కపిల మునిని,**
**నా విభూతిని తెలియుమా నయముమీర.**
27. ఉచ్చైఃశ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।
ఐరావతం గజేంద్రాణాం నరాణాం  చ నరాధిపమ్ ॥
28. ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।
ప్రజనశ్చాస్మి కందర్పస్సర్పాణామస్మి వాసుకిః ॥



29. అనన్తశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్ ।
పితౄణామర్యమా చాస్మి యమః సంయమతామహమ్ ॥
సీ॥ **అగుదు నశ్వంబుల అమృతంపు తోబుట్టు-**
**వయిన ఉచ్చైశ్రవ అశ్వమేను,**
**ఐరావతంబు నేనగుదు గజంబుల,**
**నరులందు రాజును అగుదు నేను,**
**ఆయుధాలను క్రీడి! నరయ వజ్రము నేను,**
**ఆ కామధేనువు నావులందు,**
**సంతానకరులలో చక్కనౌ మారుడన్,**
**పాములన్ వాసుకి పార్థ! నేను,**
తే॥ **నాగులందున శేషుడన్ నయముగాను,**
**నీరు నొసగెడి సురులలో వరుణుడేను,**
**అర్యముడ పితృదేవుళ్ళ నరయ నేను,**
**దండధారుల యముడను పాండుతనయ!**
30. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్ ।
మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥
31. పవనః పవతామస్మి రామశ్శస్త్రభృతామహమ్ ।
ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥



32. సర్గాణామాదిరన్తశ్చ మధ్యం చైవాహమర్జున ।
అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్॥
సీ॥ **ప్రహ్లాదుడను నేను పరగ దైత్యులయందు,**
**గణకులందున నేను కాలమగుదు,**
**మృగములందును సింహముగ నేనె నెలకొంటి ,**
**ఘనమైన పక్షులన్ గరుడుడేను,**
**వడిగల వానిలో పవనంబు నౌదు నే,**
**శస్త్రధారుల రామచంద్రుడేను,**
**జలచరంబుల నేను వెలసితి మొసలిగా,**
**నదుల భాగీరథీ నదిని నేను,**
తే॥ **ఈ చరాచర సృష్టికి  నీశ్వరుండ**
**దాని కాదియున్ మధ్యంబు దాని తుదిని,**
**విద్యలందును అధ్యాత్మవిద్య నేను,**
**వాదమొనరించు వారిలో వాదమేను.**
33. అక్షరాణామకారోఽ స్మి ద్వంద్వస్సామాసికస్య చ ।
అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥
34. మృత్యుస్సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిశ్శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ॥



35. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసామహమ్।
మాసానాం మార్గశీర్షోఽహమృతూనాం కుసుమాకరః॥
సీ। **నేనె 'అ' కారంబు విను అక్షరంబుల**
**తగు సమాసములందు ద్వంద్వమేను,**
**విశ్వతోముఖుడౌచు వెలయు బ్రహ్మను నేను,**
**అక్షయకాలంబు అగుదు నేను,**
**సర్వము హరియించు శక్తియౌ మృత్యువున్,**
**జీవుల జన్మయున్ భావియందు**
**స్త్రీలలో కీర్తియున్, సిరియు, వాక్కును, మేధ,**
**స్మృతియును, క్షమయును, ధృతిని నేను**
తే॥ **సామవేదంబులో బృహత్ సామమేను,**
**అగుదు గాయత్రి ఛందము లందు నేను,**
**మాసములయందు నేనౌదు మార్గశిరము,**
**ఋతువు లన్నిటను వసంత ఋతువు నేను.**
36. ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్।
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతామహమ్ ॥
37. వృష్ణీనాం వాసుదేవోఽ స్మి పాండవానాం ధనంజయః।
మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః ॥
38. దణ్డో దమయతామస్మి నీతిరస్మి జిగీషతామ్ ।
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్॥

సీ॥ వంచించు పనులందు పార్థ! నే జూదమున్,
తేజస్వులౌ వారి తేజమేను,
విజయంబు నౌదునే వినుము కృషియు నేనే,
సాత్త్వికులందున్న సత్త్వమేను,
వసుధ యాదవులందు వాసుదేవుడ నేనే,
పంచపాండవులందు పార్థుడేను
మునిపుంగవులయందు నేను వ్యాసుడ క్రీడి!
కవులందు శుక్రుడ ఘనముగాను,

తే॥ దండనను ఇచ్చు వారిలో దండనీతి,
విజయమును కోరువారిలో రాజనీతి,
వినుము గుహ్యములందు నే మౌనమగుదు,
జ్ఞానవంతుల జ్ఞానంబు నేనె పార్థ!

39. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున ।
న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్ ॥

ఆ॥వె॥ సర్వభూతములకు సవ్యసాచి! వినుము
మూలకారణంబు ఇలను నేనె,
ఈ చరాచరమగు ఈ ప్రపంచమునందు
లేదు సుమ్మి నేను లేని దేది.

40. నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥



వ॥ **ఓ అర్జునా! నిజానికి నా దివ్యలీలా విభూతికి ఆది అంతమూ లేదు కనుక సాధ్యమైనంత సంగ్రహముగానూ వివరముగానూ చెప్పితిని.**

41. యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥

ఆ॥వె॥ అలరి శక్తియుతము, ఐశ్వర్యయుక్తమ్ము,
వసుధ శోభ గలుగు వస్తువేది
అయిన నాదు తేజమందొక్క అంశమున్
కలిగియున్నదంచు తెలియుమయ్య!

42. అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్ ॥

వ॥ **ఓ అర్జునా! విస్తారమయిన ఈ నా విభూతి జ్ఞానముచే నీకేమి ప్రయోజనము కలదు? ఈ సమస్త జగత్తు అంతా నాలోని ఒక అంశతోనే నిండి నిబిడీకృతమై యున్నదని తెలుసుకొనుము. అది చాలును.**

**ఇది శ్రీకృష్ణార్జున సంవాద రూపమగు**
**శ్రీమద్భగవద్గీతలోని**
**విభూతియోగమను**
**పదియవ అధ్యాయము**



శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునొకండవ అధ్యాయము

## విశ్వరూప సందర్శన యోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు

**1 నుండి 4వ శ్లోకము వఱకు** విశ్వరూపమును చూపమని అర్జునుడు భగవానుని ప్రార్థించుట

**5 నుండి 8వ శ్లోకము వఱకు** భగవానుడు తన విశ్వరూపమును వర్ణించుట

**9నుండి 14వ శ్లోకము వఱకు** విశ్వరూపమును గూర్చి సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పుట

**15 నుండి 32వ శ్లోకము వఱకు** అర్జునుడు భగవానుని విశ్వరూపమును దర్శించుట, స్తుతించుట

**32,33,34వ శ్లోకము** లలో భగవానుడు తన ప్రభావమును వర్ణించుట, యుద్ధమునకై అర్జునుని ప్రోత్సహించుట.

**35 నుండి 46వ శ్లోకము వఱకు** భయభ్రాంతుడైన అర్జునుడు భగవంతుని స్తుతించుట, చతుర్భుజరూపమును దర్శింప చేయమని ప్రార్థించుట.

**47 నుండి 50వ శ్లోకము వఱకు** భగవానుడు తన విశ్వరూపదర్శన మహిమను తెల్పుట మరియు సౌమ్యరూపమును చూపుట

**51 నుండి 55వ శ్లోకము వఱకు**
అనన్యభక్తి లేకుండ చతుర్భుజరూప దర్శనము దుర్లభమని తెల్పుచు ఫల సహితముగ అనన్యభక్తిని వర్ణించుట

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :
33, 36, 38, 39, 40, 43, 44, 45, 46, 48, 54, 55

ఈ అధ్యాయం చదివినవారికి కలిగే ఫలప్రాప్తి.

సర్వపాపవిముక్తి, పరమాత్మ పదప్రాప్తి

# శ్రీమద్భగవద్గీత

## పదనోకండవ అధ్యాయము

### విశ్వరూప సందర్శన యోగము

1. అర్జున ఉవాచ
మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మసంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ ॥

**వ॥ అర్జునుడిలా అన్నాడు.**

**ఆ॥వె॥ అనఘ! దయను జూపి అతి రహస్యంబైన**
**ఆత్మజ్ఞాన మొసగునట్టి హితవు**
**నాకు నీవు తెలుప నయముగా అజ్ఞాన-**
**తిమిర మంతరించె దేవదేవ!**

2. భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥

3. ఏవమేతద్యథాఽఽత్థ త్వమాత్మానం పరమేశ్వర ।
ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ ॥

**ఉ॥ జీవుల చావు పుట్టుకలు చేతలు నీదయ నేనెరింగితిన్,**
**నీవిట నాకు దెల్పితివి నీ విభవంబును తేటతెల్లమౌ,**
**నీవిటు చెప్పుచున్నయది నిక్కమె, నాయెడ ఈశ్వరుండవై**
**బ్రోవుము, విశ్వరూపమును పూర్తిగ నాకిటు చూపుమచ్యుతా!**



4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥

**కం॥ ఆ రూపము జగదీశ్వర!**
**నేరుగ నే కాంచ నర్హునిగ తలచినచో**
**నీ రూపము నా కిప్పుడు**
**కారుణ్యముతోడ చూపగా వేడెద నిన్.**

5. శ్రీ భగవానువాచ
పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ।
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు**

**కం॥ ఎన్నో వర్ణంబులతో**
**ఎన్నో ఆకృతులతోటి ఎనలేనివియై**
**ఎన్నో విధముల నొప్పుచు**
**ఉన్నది, నా దివ్యరూప మొప్పుగ కనుమా!**

6. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా ।
బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత ॥

**తే॥ దివ్య ఆదిత్యు లశ్వనీదేవతలను**
**అట్లె వసువులను మరుత్తు లనఘ! నీవు**
**ఎపుడు కని వినీ ఎరుగంగ నోపలేని**
**అన్ని వింతల చూడుమా అద్భుతముగ.**



7. ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥

**ఆ॥వె॥ఒప్పి నాదు మేన నొక్కచోటనె యున్న**
**ఆ చరాచరంబదయిన జగము**
**చూడుమయ్య నీవు చూడదలచినది**
**నాదు దేహమందు నయము మీర.**

8. న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగమైశ్వరమ్ ॥

**కం॥ నీ కనులు చూడలేవని**
**నీకిటు యొసగెదను ప్రీతి నే దివ్యాక్షుల్**
**చేకొని చూడుము పార్థా !**
**ఈకడ నా విశ్వరూప మీక్షణముననే.**

9. సంజయ ఉవాచ
ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।
దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥

**సంజయుడిలా అన్నాడు**



**వ॥ ఓ ధృతరాష్ట్ర మహారాజా! మహాయోగీశ్వరుడైన శ్రీ కృష్ణ భగవానుడు ఈ ప్రకారము వచించి అర్జునుడికి తన సర్వోత్తమమైన విశ్వరూపం చూపించాడు.**

10. అనేకవక్త్రనయన మనేకాద్భుతదర్శనమ్ ।
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥

11. దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవమనంతం విశ్వతోముఖమ్ ॥

12. దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా ।
యది భాః సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః ॥

**సీ॥ ఆ రూపమున జూడ అంతులేకుండగ**
**కన్నులున్ ముఖములు కాననయ్యె,**
**అద్భుతంబగు దృశ్య మాశ్చర్యమును గొల్పె**
**దివ్యమౌ నగలతో దీప్తిచెందె,**
**ఎక్కుపెట్టుచునున్న పెక్కు దివ్యాస్త్రముల్**
**దివ్య మాలలచేత దేహమొప్పె,**
**దివ్య వస్త్రంబులు దివ్యమౌ గంధాలు**
**ఆశ్చర్యకరమయ్యె అంతులేక,**

**తే॥ విశ్వతోముఖం బగుచు తా విస్తరించి**
**ఏకకాలాన నింగిలో ఎన్నొ సూర్య**
**కాంతులతొ సాటియౌ కాంతి కమ్ముచుండ**
**చూడ దేదీప్యమౌ రూపు చూచెనతడు.**

13. తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।
అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥

**తే॥ దేవదేవుని మేనిలో దివ్యమయిన**
**ఎన్నొ విధములన్ విభజించి యెసగుచున్న**
**విశ్వమంతయున్ దర్శించె వింతగొలుప**
**ఒక్కచోటనే పార్థుడు ఉన్నతముగ.**

14. తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥

**వ॥ ఓ ధృతరాష్ట్ర మహారాజా! పులకరించు మేనితో ఆశ్చర్య-చకితుడై చేతులు జోడించి అర్జునుడు ఆ దేవదేవునికి తలవంచి వినయంగా నమస్కరించాడు.**

అర్జున ఉవాచ

15. పశ్యామి దేవాంస్తవ దేవ దేహే
సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।
బ్రహ్మాణమీశం కమలాసనస్థం
ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥



16. అనేకబాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్ ।
నాంతం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥

**అర్జునుడు ఇలా అన్నాడు**

**సీ॥ అచ్యుతా! నీ దేహమందు కాంచుచునుంటి**
**సర్వభూతములచే జగతియొప్ప,**
**కమలాసనుని చూడగలుగుచున్నానిట్లు**
**సకల ఋషిగణాల, సర్పములను,**
**విశ్వేశ్వరా! నీదు విశ్వరూపంబున**
**ఎన్నియో ముఖములన్, కన్నుగవలు,**
**ఎన్నియో భుజములన్, ఎన్నియో ఉదరాల**
**అంతులేకయె రూప మలరుచుండె,**

**తె॥ ఆది మధ్యాంత రహితుడవయ్య! నీవు**
**ఎల్లయెడలను చూచుచు నిటుల నేను**
**కానలేకుంటి నీ దివ్యకాంతియందు**
**విశ్వరూపమ్ము ఓ దేవ! వెరపు గలిగె!**



17. కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా
ద్దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్ ॥

**ఆ॥వె॥ శిరసుపై మకుటము, చేతుల గద చక్ర-**
**ములను దాల్చి రూపు వెలసియుండె,**
**చూడ సాధ్యమవని సూర్యాగ్నులైతివి**
**అంతులేని నీవు అంతటయును.**

18. త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే ॥

**ఆ॥వె॥ నీవె తెలియగోరు నిజ పరబ్రహ్మంబు**
**అవనికి పరమాశ్రయమవు నీవు,**
**ఓ పురాణపురుష! ఓ ధర్మరక్షకా!**
**అక్షరుడవు అయిన ఆదిదేవ!**



19. ఆనాదిమధ్యాన్త మనన్తవీర్యమ్
అనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥

20. ద్యావాపృథివ్యోరిదమంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।
దృష్ట్వాఽద్భుతం రూపముగ్రం తవేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥

**సీ॥ ఆది మధ్యంబులు అసలు లేవిట నీకు**
**అరయ నంతములేని అచ్యుతుడవు!**
**చేతులు మితిలేవు, చెప్పనా సూర్యుండు**
**చంద్రుడు చక్షులు చక్రధారి!**
**జ్వలియించు అగ్నితో సమమైన ముఖమొప్పె,**
**నీ జగంబు తపించె తేజమందు,**
**నింగి నేలకు మధ్య నిలుచు ప్రదేశము,**
**నీతోనె దిశలన్ని నిండిపోయె**

**తే॥ అతి భయానక మగుచుండె అద్భుతముగ**

**నీదు ఈ రూపు గాంచుచున్ నిక్కముగను**

**మూడులోకాలు ఈరీతి మునిగియుండె**

**భీతియందున నిండుగ విశ్వరూప!**

21. అమీ హి త్వాం సురసంఘా విశన్తి

కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి ।

స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః

స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥

22. రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా

విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।

గన్ధర్వయక్షాసురసిద్ధసంఘాః

వీక్షన్తే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥



**సీ॥ దేవతానీకముల్ చేరుచున్నవి ప్రభూ!**

**నీలోన, భక్తులు నీకు మొక్కి**

**స్తుతియించుచున్నారు చేతులెత్తుచు నిన్ను,**

**సిద్ధులున్ ఋషులునూ చేరి అటులె**

**స్వస్తి వచనముల సంపూర్ణముగ నిన్ను**

**స్తుతిచేయుచుండిరి స్తోత్రములతొ,**

**ఆదిత్యులును, రుద్రులాదిగా వసువులున్,**

**అశ్వనీదేవతల్ అసురవరులు**

**తే॥ యక్ష, గంధర్వ, సిద్ధులు అందరున్ను**

**పితృదేవతల్, సాధ్యులు విస్మయమున**

**నిన్ను వీక్షించుచున్నారు, నిఖిల దేవ-**

**గణముతోడి మరుత్తులు కరములొగ్గి.**

**వ॥ అట్లు తిలకించుచున్న దేవగణములలో విశ్వేదేవతలు కూడా ఉన్నారు.**

23. రూపం మహత్తే బహువక్త్రనేత్రం

మహాబాహో బహుబాహూరుపాదమ్ ।

బహూదరం బహుదంష్ట్రాకరాలం

దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాఽహమ్ ॥



**ఉ॥ ఎన్నియొ నేత్రముల్ కలవు, ఎన్నియొ చేతులు, మోములెన్నియున్**

**ఎన్నియొ పాదముల్, తొడలు, ఎన్నియొ కుక్షులు కోరలొప్పగన్,**

**ఉన్నది విశ్వరూపమది యొక్కెడ చూచిన, లోకమంతయున్**

**ఎన్నగ భీతి చెందినది, యేనును అవ్విధియుంటినో ప్రభూ!**

24. నభఃస్పృశం దీప్తమనేకవర్ణం

వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్ ।

దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా

ధృతిం న విన్దామి శమంచ విష్ణో ॥

**ఆ॥వె॥ ఆకసంబు నంటి అన్ని రంగులదాల్చి,**

**కళ్ళు ఉజ్జ్వలించి, నోళ్ళుతెరచి**

**యున్న నిన్ను జూచియుడిగె నాధైర్యంబు**

**ధీరతయును శమము తరిగి పోయె.**

25. దంష్ట్రాకరాలాని చ తే ముఖాని

దృష్ట్వైవకాలానలసన్నిభాని

దిశో న జానే న లభే చ శర్మ

ప్రసీద దేవేశ జగన్నివాస ॥



**ఆ॥వె॥ భయము గొలిపె నీదు ప్రళయాగ్నికీలలన్**

**బోలు కోరలున్న ముఖము జూచి**

**దిక్కుతోచదాయె దేవేశ! కరుణించు**

**దిగులుచెందువాడ దీనబంధు!**

26. అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః

సర్వే సహైవావనిపాలసంఘైః ।

భీష్మో ద్రోణస్సూతపుత్రస్తథాఽసౌ

సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥

27. వక్త్రాణి తే త్వరమాణా విశన్తి

దంష్ట్రాకరాలాని భయానకాని ।

కేచిద్విలగ్నా దశనాంతరేషు

సందృశ్యన్తే చూర్ణితైరుత్తమాంగైః ॥

28. యథా నదీనాం బహవోఽమ్బువేగాః

సముద్రమేవాభిముఖా ద్రవంతి ।

తథా తవామీ నరలోకవీరా

విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి ॥

29. యథా ప్రదీప్తం జ్వలనం పతంగా
విశన్తి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశన్తి లోకా-
స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥

**సీ॥ ఎందరో రాజులు ఈ ధార్తరాష్ట్రులున్**
**భీష్ముండు, ద్రోణాది వీరులెల్ల**
**కోరలన్ భయమొప్పు క్రూరమౌ నీనోళ్ళ**
**వడివడి చేరుచున్ చూడనయ్యె,**
**చొక్కి నీ దంతాల చూర్ణమౌ తలలతో**
**అగుపించుచుండిరి ఆలమందు,**
**జలధి చేరంగ ఆ ఝరులురికినయట్లు**
**చేరుచుండిరి నోళ్ల నరవరులును**

**తే॥ కోరి చావును శలభాలు చేరు నగ్ని,**
**అట్లె జనులందరును నాశమందుకొరకు**
**అమిత వేగాన నీనోళ్ళ తాముజేరి**
**చిక్కి నశియించుచున్నారు దిక్కులేక.**



30. లేలిహ్యసే గ్రసమానః సమంతా
ల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః ।
తేజోభిరాపూర్య జగత్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో ॥

**వ॥ ఓ భీకరాకారా! జ్వలిస్తున్న నీనోళ్ళచే జగత్తులన్ని మ్రింగుచు ఆస్వాదించుచున్నావు. ఈ జగతి అంతా నీ ఉగ్రతేజముతో నిండగా ఆ తేజముతో ఈ జగతి అంతా మిగుల తపింప చేయబడుచున్నది.**

31. ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో
నమోఽస్తు తే దేవవర ప్రసీద ।
విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥

**ఉ॥ నీకు నమస్కరించెదను, నెయ్యము జూపుము ఆగ్రహింపకన్**
**చేకొని తెల్పుమెవ్వరవొ శీఘ్రమె, చూడ నసాధ్యమయ్యె నిన్,**
**నాకనిపించుచున్నది అనాదివి నీవనిదేవ! భీతిచే**
**నాకెటు తోచకున్నదిక నాకెరిగింపుము నీ ప్రవృత్తినిన్.**



32. శ్రీ భగవానువాచ
కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।
ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా!**

**ఉ॥ కాలము దీరగన్ జగతిఁ గాలుడనై క్షయమొంద జేయుదున్,**
**ఆలములోన రాజులను అంతము చేతును, నీవు యిత్తరిన్**
**ఆలము చేయకున్న నిపు డాగదు నాశము, నా ప్రవృత్తియే**
**కాలుడనై ప్రజావళిని కాటికి నంపుట నిశ్చయంబుగా.**

33. తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుంక్ష్వరాజ్యం సమృద్ధమ్ ।
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥

**ఆ.వె॥ అందువలన లెమ్ము ఆలంబు సేయుము,**
**ఘనపు కీర్తి పొందగలవు నీవు,**
**నీదు వైరులెల్ల నే చంప మడియ, ని-**
**మిత్తమాత్రు డగుము ఉత్తమముగ.**



34. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ
కర్ణం తథాఽన్యానపి యోధవీరాన్ ।
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా
యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥

**ఆ.వె॥ నీవు ఇపుడు మున్నె నిర్జించబడినట్టి**
**భీష్ముడాదివైరి వీరవరుల**
**వధను చేయుమయ్య! భయమేల రణమందు**
**శత్రు నాశనమును జరుపగలవు.**

35. సంజయ ఉవాచ
ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య
కృతాంజలి ర్వేపమానః కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం
సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥

**ఈ కృష్ణార్జున సంవాదం వినిపిస్తున్న సంజయుడిలా అన్నాడు.**

**కం॥ ఆ దేవుని మాటలు విని**
**పాదములకు మ్రొక్కి భీతి వణకినవాడై,**
**వేదనకూడిన స్వరమున**
**సాదరముగ హరికి క్రీడి సౌమ్యత నుడివెన్.**

36. అర్జున ఉవాచ
స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా
జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి
సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥

37. కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్
గరీయసే బ్రహ్మణోఽప్యాదికర్త్రే ।
అనంత దేవేశ జగన్నివాస
త్వమక్షరం సదసత్తత్పరం యత్ ॥

**అర్జునుడిలా అన్నాడు.**

**సీ॥ జగతి నీ మహిమలన్ పొగడంగనో దేవ!**
**ఆనంద మనురాగ మందుచుండె,**
**దైత్యులందరు భీతిదాళక బారిరి,**
**సిద్ధసంఘము మొక్కె శిరము వంచి,**
**నీవనంతుడవయ్య, దేవదేవుడ వీవు,**
**జగతికాధారంబు, శాశ్వతుడవు,**
**సత్ అసత్తుల రూపు సరిచూడ నీవయ్య,**
**అందరి మించిన అక్షరుడవు,**



**తే॥ ఉన్నతుల కెల్ల శ్రేష్ఠుడౌ ఉత్తముడవు,**
**బ్రహ్మదేవుని కాదియౌ పరమపురుష,**
**ఇదియు నంతయు సహజమే ఇట్టి నీకు**
**వందనంబులు చేయకయుందురెట్లు?**

38. త్వమాదిదేవః పురుషః పురాణః
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాఽసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వమనంతరూప ॥

39 వాయుర్యమోఽగ్నిర్వరుణః శశాంకః
ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః
పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥

40. నమః పురస్తాదథ పృష్ఠతస్తే
నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ।
అనన్తవీర్యామితవిక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥



**సీ॥ అదిదేవుడ వీవు ఆదిపురుషుడీవు**
**ఆధారుడవు నీవు అవనికెల్ల,**
**వేత్తవు నీవయ్య! వేద్యుడవో దేవ!**
**ఆదిమధ్యాంతము లరయ లేము,**
**నిండె నీజగమంత నీతో, యముండగ్ని**
**వరుణుండు చంద్రుండు పవనుడీవు**
**బ్రహ్మదేవుని తండ్రి! ప్రపితామహుడవీవు**
**వరద! వేలకువేల వందనములు**

**తే॥ శరణు మొక్కెద ఓ దేవ! మరల మరల**
**ముందు వెనుకల అంతటన్ వందనములు,**
**అతి సమర్థుడౌ వీరుడా! అన్నియెడల**
**వ్యాప్తినొందుచునున్నావు దీప్తిమంత!**

41. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం
హే కృష్ణ హే యాదవ హే సఖేతి ।
అజానతా మహిమానం తవేదం
మయా ప్రమాదాత్ప్రణయేన వాపి ॥



42. యచ్చావహాసార్థమసత్కృతోఽసి
విహారశయ్యాసనభోజనేషు।
ఏకోఽథవాప్యచ్యుత తత్సమక్షం
తత్క్షామయే త్వామహమప్రమేయమ్ ॥

**సీ॥ దేవ! నీ మహిమను తెలియంగలేక నా**
**సఖుడవు అని అతి చనువుమీర**
**ఓ కృష్ణ! యాదవా! ఓ బావ! అని నేను**
**నిర్లక్ష్యమున పిల్చి నిన్ను మునుపు**
**నీ తోటి తిరిగియో నిద్రించువేళనో**
**కూర్చున్నవేళనో కుడుచునపుడొ**
**ఒంటిగానుండియో ఒరులతో నున్ననో**
**హేళనె నెపుడైన హీనపఱచి**

**తే॥ గొప్ప అవమానములు నీకు గూర్చియుందు**
**అప్రమేయుడౌ దైవమా! ఆదిదేవ!**
**తప్పులనుకాచి ప్రేమతో దయను జూపి,**
**కరుణ పాలించుమని నిన్ను కోరుకొందు.**

43. పితాఽసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽప్యప్రతిమప్రభావ

**వ॥ ఓ ప్రభూ! ఈ చరాచర జగత్తుకంతటికీ తల్లివి, తండ్రివీ, పరమ గురుడవు అన్నీ నీవే. నీతో సమానమైన వాడెవ్వడూ లేడు. ఇక నిన్ను మించువాడు ఎట్లుండును?**

44. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥

45. అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా
భయేన చ ప్రవ్యథితం మనో మే ।
తదేవ మే దర్శయ దేవ రూపం
ప్రసీద దేవేశ జగన్నివాస ॥

46. కిరీటినం గదినం చక్రహస్తం
ఇచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ ।
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్రబాహో భవ విశ్వమూర్తే ॥



**సీ॥ తండ్రి పుత్రుని, సఖున్ తన సఖుడెటు బ్రోచు,**
**ప్రియుడెట్లు ప్రియురాలి ప్రేమ జూచు,**
**శరణిమ్ము ఆవిధి, సాష్టాంగదండంబు**
**ప్రభుడవు పూజ్యుడౌ పరమగతివి,**
**నీ విశ్వరూపమున్ నే చూడ ధన్యుండ**
**మనసు మిక్కిలి భీతి మసలుచుండె,**
**నీవు నాపై దయన్ నీ పూర్వరూపునే**
**చూపించు నన్నిటు చూడు కరుణ,**

**తే॥ గద కిరీటంబు చక్రంబు కలిగినట్టి**
**రూపు చూడగా నాశింతు చూపుమయ్య!**
**నాల్గు భుజముల ఆ రూపు నయముమీర**
**నాకు చూపించి బ్రోవు మానందతనయ!**

47. శ్రీ భగవానువాచ
మయా ప్రసన్నేన తవార్జునేదం
రూపం పరం దర్శితమాత్మయోగాత్ ।
తేజోమయం విశ్వమనంతమాద్యం
యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥



48. న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః
న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।
ఏవంరూపశ్శక్య అహం నృలోకే
ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥

49. మా తే వ్యథా మా చ విమూఢభావో
దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్ ।
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం
తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు.**

**సీ॥ నా యోగమహిమతో నీ యెడ దయతోడ**
**తేజోమయంబగు దివ్యరూపు**
**చూపించినాడను, చూడ సర్వోత్తమ**
**మైనదియును, సనాతనము నిదియె**
**వేదాలు చదివినన్, వేల దానములచే,**
**తప యజ్ఞముల చేత దానిగనము**
**ఈవొక్కడివె దాని నీరీతి గంటివి**
**అన్యులకది సాధ్యమవనిదయ్య!**

**తే॥ ఇట్టి నారూపు గని భయ మెరుగవలదు,**
**భ్రాంతి వీడగ నను చూడు భక్తిమీర,**
**సంతసంబునన్ ఇపుడు చూపింతు నీకు**
**పూర్వరూపంబు చూడుమో పుణ్యపురుష!**



**వ॥ చతుర్భుజుడనై శంఖచక్ర గదలతో తలపై కిరీటముతో సర్వోత్తమమూ, సనాతనమూ, మనోహరమూ అయిన ఆ రూపు చూడటానికి వేదపఠనమూ, యజ్ఞయాగాలూ, తపస్సూ వంటి మార్గాలు చాలవు. కేవలం అనన్య భక్తి వలననే అది సాధ్యం.**

సంజయ ఉవాచ

50. ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా
స్వకం రూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీతమేనం
భూత్వా పునస్సౌమ్యవపుర్మహాత్మా ॥

**సంజయుడిలా అన్నాడు...**

**తే॥ అట్లు పార్థునితో చెప్పి అసురవైరి**
**పొంది ప్రేమతో చూపించె పూర్వరూపు,**
**శాంతమౌ రూపు ధరియించి శమనపరచి**
**కరుణ ఓదార్చె పార్థునిన్ చేరదీసి.**

అర్జున ఉవాచ

51. దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।
ఇదానీమస్మి సంవృత్తస్సచేతాః ప్రకృతిం గతః ॥

**వ॥ అప్పుడు అర్జునుడిలా అన్నాడు.**
**ఓ జనార్దనా! నీ చతుర్భుజ రూపం చూచి నా మనస్సు స్వస్థత చెంది కుదుటపడినది. ఇప్పుడు నేను స్వస్థతను పొందితిని,**

శ్రీ భగవానువాచ

52. సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః ॥

53. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥

54. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥

55. మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।
నిర్వైరస్సర్వభూతేషు యస్సమామేతి పాండవ ॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు.**

**సీ॥ ఈ విశ్వరూపంబు ఎరుగంగ నొరులకున్**
**అతి దుర్లభము సుమ్మి, అనఘ దివిని!**
**దివిజులాసింతురు దీని దర్శనమంద,**
**నీ భక్తిచేతనే నీకు కలిగె,**
**వేద పఠనమునన్ వేలతపములనూ**
**దాన యజ్ఞములకు కనగలేరు,**
**దీని తెలియ నొక్క దీటైన భక్తియే**
**మహిలోన ననుజూచు మార్గమగును,**



**తే॥ కర్మ నాకొరకై చేసి, గతిగ నెవడు**
**నన్ను భావించి, భక్తిచే సన్నుతించి**
**ఆసలేకుండ ప్రాణులనన్నికూడ**
**స్నేహ భావన చూచిన చేరు నన్ను.**

**ఇది శ్రీ కృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగవద్గీతలోని**
**విశ్వరూప సందర్శన యోగము అను**
**పదనొకండవ అధ్యాయము.**



శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పండ్రెడవ అధ్యాయము

## భక్తి యోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు

**1 నుండి 12వ శ్లోకము వరకు** సాకార నిరాకార ఉపాసకుల శ్రేష్ఠత్వ విశదీకరణము. భగవత్ప్రాప్తికి అనేక రకములైన ఉపాయములు

**13 నుండి 20వ శ్లోకము వరకు** భగవత్ప్రాప్తి నందిన భక్తుల లక్షణములు.

ఇందు 2,3 పర్యాయములు చదివి బాగుగా అర్థం చేసుకొనవలసిన శ్లోకముల సంఖ్యలు :

2, 4, 7, 8, 12, 14, 15, 16, 17, 18, 19, 20

ఈ అధ్యాయం చదివినవారికి కలిగే ఫలప్రాప్తి.
దేవతా సాక్షాత్కారము, మృత సంజీవనశక్తి, మోక్షప్రాప్తి

# శ్రీమద్భగవద్గీత
# పంద్రెండవ అధ్యాయము
# భక్తి యోగము

1. అర్జున ఉవాచ
ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః॥

**అర్జునుడిలా అన్నాడు.**

**కం॥ ఈ రీతిని తమ మనసున**
**నీరూపము నిల్పువారు నిఖిలోన్నతులా?**
**వారలు కాంచని ఆత్మను**
**ఆరాధన జేయువారు అత్యుత్తములా?**

2. శ్రీభగవానువాచ
మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః॥



**భగవానుడిలా అన్నాడు**

**కం॥ నామీద మనసు నిల్పుచు**
**నీమముతో నిత్యనిష్ఠ నిరతిని శ్రద్ధన్**
**తామిటు నాదు ఉపాసన**
**ఏమరకన్ చేయువారు ఋషిపుంగవులౌ.**

**వ్యాఖ్య॥ నిర్గుణోపాసకుడైన భక్తుని లక్షణాలను**
**శ్రీకృష్ణపరమాత్మ ఇలా వర్ణిస్తున్నాడు.**

3. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥
4. సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥
5. క్లేశోఽ ధికతరస్తేషాం అవ్య క్తాసక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥

**సీ॥ సర్వంబు వ్యాపించి నిర్వచించగలేని**
**నిశ్చయంబైనట్టి నిత్యమైన**
**నిశ్చలంబయియున్న నిర్వికారంబైన**
**అవ్యక్తమయినట్టి ఆత్మనెరిగి,**
**ఇంద్రియాలన్నింటి నింపుగా తనయొక్క**
**స్వాధీనమందుంచి సమత కల్గి,**
**సర్వభూతాలకున్ సర్వదా మేల్జేయు-**
**టందు ఆసక్తిని పొందియుండి,**



**తే॥ గోచరించని ఆ యాత్మ గుణము నెరిగి**
**ఎల్లవేళలన్ నిష్ఠతో ఏమరకను**
**ఆత్మ రూపాన్ని పూజించునట్టి యోగి**
**నన్ను పొందుట నిక్కమౌ నరవరేణ్య!**

**వ॥ కాని నిరాకార బ్రహ్మమును గుర్తెరిగి సాధించుటకు విశేషశ్రమ చేయవలెను. ఎందుచేతనంటే దేహభిమానులకు అవ్యక్త బ్రహ్మోపాసనము కష్టతరము.**

6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥
7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి నచిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్ ॥

**ఉ॥ చేరి సమస్తకర్మలను చేకొని అర్పణ నాకు చేసి, నన్**
**వారలు సాక్షిగా గతిగ భావన చేయుచు, చిత్తశుద్ధిచే**
**వారి మనస్సు నాపయిన వాసిగ నిల్పిన, మృత్యుసామ్య సం-**
**సారపు సాగరంబు వడి చక్కగ దాటగచేతు నర్జునా!**

8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥
9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥
10. అభ్యాసే ఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥



11. అథైతదప్యశక్తోఽ సి కర్తుం మద్యోగమాశ్రితః ।
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥
12. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ ॥

**సీ॥ నామీద మనసును నయముగా నీ బుద్ధి**
**నిలుపగన్ నాలోన నిలువగలవు,**
**అట్లు నిలుపలేక అభ్యాసముననైన**
**ననుపొందు యత్నంబు ననుసరించు,**
**అది చేతకాకున్న అటుల నా ప్రీతికై**
**కర్మలన్ చేయుము కలుగు ముక్తి,**
**అది యసాధ్యంబైన ఆశ్రయించి నను నీ-**
**దైన కర్మఫలంబు దానమిమ్ము**

**ఆ॥వె॥ జ్ఞానరహితమైన ఘనసాధనలకన్న**
**జ్ఞానమదియె మేలు, దాని మించ-**
**గలదు ధ్యానమట్లె, కర్మఫలత్యాగ-**
**మదియు దానిమించు నరయ శాంతి.**

**వ॥ ఇక నాకు ఎటువంటి భక్తుడిష్టమో చెపుతాను వినుము**

13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥
14. సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియః ॥

15. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః।
హర్షామర్షభయోద్వే గైర్ము క్తోయస్స చ మే ప్రియః॥

సీ॥ అన్ని ప్రాణులపట్ల అమరుస్నేహము దాన
ద్వేషరహితుడౌచుఁ దేలు దయను,
అహమును మమతలన్ అన్నియు విడనాడి
సుఖదుఃఖముల నెల్ల చూచు సమత,
ఓర్పు సంతృప్తియున్ ఒప్పు యోగముచేత
శుద్ధమైన మనసు బుద్ధి నాకు
అర్పించు భక్తులే అత్యంత ఇష్టులౌ,
అట్టివారే నాకు ఆప్తులనఘ!

తే॥ తనతొ లోకానికేహాని తగులనీక
యుర్వి భయమును పొందక నొప్పువాడు
వీతరాగుడై కోపమావేశ భయము-
లకును, లొంగని భక్తులే నాకు ప్రియులు.

వ్యాఖ్య॥ అన్ని ప్రాణులపై స్నేహముతో ద్వేషములేక సుఖదుఃఖ ములందు సమభావన కల్గి ఓర్పుతో యోగసాధన చేయుచూ, ఎవరైతే బుద్ధి మనసు పరమాత్మకు అర్పణచేసి తనవల్ల లోకానికి ఆ లోకమువల్ల తనకూ ఎట్టి నష్టమూ కష్టమూ కలగకుండా రాగరహితుడై కోపము నిగ్రహించునో అట్టి భక్తుడు పరమాత్మకత్యంత ఇష్టుడైన భక్తుడు.



16. అనపేక్ష శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః।
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియ ః ॥

ఆ॥వె॥ విడిచి కోర్కెలన్ని వీడుచు దుఃఖమ్ము
దక్షుడగుచు శుచిగ దనరు వాడు,
పక్షపాతబుద్ధి బడయక, కర్తృత్వ
భావ రహితు డిష్టుడవును నాకు.

17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్యస్స మే ప్రియః॥

ఆ॥వె॥ సంతసంబుగాని సుంతద్వేషముగాని
లేక, వెతయు కోర్కెలేని వారు,
అశుభ శుభములన్ని అధిగమించగలుగు
నట్టి భక్తులెల్ల ఆప్తులయ్య.

18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః ।
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః।

19. తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః॥

20. యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే।
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః॥



సీ॥ శత్రులయెడగాని మిత్రులందునగాని
మానావమానముల్ మదిని కనక
శీతోష్ణ ద్వంద్వాల చేకొని నొకటిగ
సుఖదుఃఖ మొకరీతి చూచువాడు,
సమభావనము కల్గి సహనంబు కల్గుచున్
దేనిపై ఆసక్తి లేనివాడు,
తృప్తియు మౌనంబు దృఢ నిశ్చయమ్ముతో
ఒక్కచో వాసంబు నొప్పకుండ

తే॥ శ్రద్ధచే నను శరణంచు బుద్ధి నమ్మి
అమృత సమమైన ఈ ధర్మమాచరించి
ఏను చూపించు బాటనే ఎవడు చనునొ,
అట్టి భక్తుడే అత్యంత ఆప్తుడనఘ!

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగవద్గీతలోని**
**భక్తియోగము అను**
**పండ్రెండవ అధ్యాయము.**





శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదమూడవ అధ్యాయము

## క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 18వ శ్లోకము వఱకు** – జ్ఞానసహిత క్షేత్ర క్షేత్రజ్ఞుల వర్ణనము.

**19నుండి 25వ శ్లోకము వఱకు** – జ్ఞానసహిత ప్రకృతి పురుషుల వర్ణనము.

**26 నుండి 35వ శ్లోకము వఱకు** – రకరకములైన సాధనల ద్వారా పరమాత్మ ప్రాప్తిలభించు విధము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:

2, 3, 8, 9, 13, 14, 15, 16, 25, 26, 29, 33, 34

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:
పాపవిముక్తి, సద్గతి ప్రాప్తి.



## శ్రీమద్భగవద్గీత
## పదమూడవ అధ్యాయము
## క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము

అర్జున ఉవాచ

1. ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞమేవ చ ।
ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥

**అర్జునుడిలా అన్నాడు**

**ఆ॥వె॥ క్షేత్రమనగ నేమి? క్షేత్రజ్ఞు డెవ్వండు?**
**ఏది ప్రకృతియగును? ఎవడు పురుష–**
**డేది జ్ఞానమగును? నెయ్యది జ్ఞేయంబు?**
**కృష్ణ! తెలుపుమయ్య! కృపనుజూపి.**

శ్రీభగవానువాచ

2. ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।
ఏతద్యో వేత్తితం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥

**అప్పుడు భగవానుడిలా అన్నాడు**



**కం॥ ఈ దేహమె క్షేత్రంబని**
**సాదరముగ తెలియువాడు చక్కగ నెవడో**
**ఆదరముగ బుధు లాతని**
**ఈదరి క్షేత్రజ్ఞుడంచు ఇల చెబుదురయా**

**వ్యాఖ్య॥ క్షేత్రమనగా పొలము, భూమి. పంటలు పండుటకు భూమి ఆధారమై ఎట్లుండునో అట్లే జీవుల హృదయమున నాటబడిన జ్ఞానబీజము మొలకెత్తి, చివరకు ముక్తిదాయకమగుటకు శరీరము ఆధారభూతము. అందుచేత ఈశరీరమే క్షేత్రమని చెప్పబడుచున్నది. ఇట్టి క్షేత్రము గురించి తెలిసి కొనువాడు క్షేత్రజ్ఞుడు అనబడును.**

3. క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ॥

**కం॥ క్షేత్రములనున్న నేనే**
**క్షేత్రజ్ఞుడ నంచెరుంగు, క్షేత్రజ్ఞునికిన్**
**క్షేత్రమునకు చెందినదగు**
**పాత్రంబగు జ్ఞానమేదొ పరమంబదియే.**

వ॥ అర్జునా ! ఇది నా నిశ్చితాభిప్రాయము.

4. తత్‌క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చయత్।
స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥

వ॥ మరియు ఓ అర్జునా! ఈ క్షేత్రమేదియో దాని యొక్క
ఆకారవికారము లెట్టివో, పుట్టుక ఎట్టిదో,
క్షేత్రజ్ఞుడెవరో, వాని ప్రభావమెట్టిదో వీని గురించి
సంగ్రహంగా చెబుతాను. సావధానంగా వినుము.

5. ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్ ।
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥

ఆ॥వె॥ క్షితిని శ్రుతులు, ఋషులు క్షేత్రము క్షేత్రజ్ఞు-
ల వివరించె వారి లక్షణములు
బ్రహ్మసూత్రములును వాని వ్యక్తము చేసె
యుక్తి యుక్తముగను ఒప్పుగాను.

6. మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ।
ఇంద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః ॥

7. ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః।
ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥



సీ॥ పంచభూతములును, బలు అహంకారమ్ము,
పరగునట్టి ప్రకృతి, మరియు నయిదు
జ్ఞానేంద్రియమ్ములు, మనసుయు, అయిదైన
కర్మేంద్రియమ్ములు కలివిడిగను
ఇంద్రియ సముదాయ, మిచ్ఛయు, చేతన
దుఃఖమ్ము సుఖముల తోటి బుద్ధి
జ్ఞానేంద్రియ జనిత శబ్దాదివిషయముల్
ద్వేషము మరియును ధీరగుణము

తే॥ కలిసి, క్షేత్రముబొందు వికారములును
ఒకటిగాజేరి చక్కగ నొప్పియుండ,
దేహమంతయు ఈరీతి తెలుపబడియె
సంగ్రహముగ క్షేత్రంబని, సవ్యసాచి!

8. అమానిత్వమదంభిత్వమహింసా క్షాంతిరార్జవమ్।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః॥

9. ఇంద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ।
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్ ॥

10. అసక్తిరనభిష్వంగః పుత్రదారగృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు ॥



సీ॥ స్వోత్కర్ష లేకుంట, సుంత దంభములేక-
యుండుట, ఓరుపు యుండుటయను,
పరగు నహింసయు, గురుసేవ చేయుట,
ఋజువర్తనంబున ఎనయుచుంట
మనసు దేహమును క్షాళనచేసి, స్థైర్యము
ఆత్మనిగ్రహము తో అలరియుంట,
అరయ నహంకారమనునది లేకుంట,
ఆసక్తి లేకుండునటులయుంట,

తే॥ ఇంద్రియపు విషయాలలో ఇచ్ఛలేక
ఆలుబిడ్డల వ్యామోహమరయకుంట,
జన్మ మరణము రోగంబు జరల యందు
కలుగు దోషాల సమబుద్ధి కలిగియుంట.

11. మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్తదేశ సేవిత్వమరతిర్జనసంసది ॥

12. అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।
ఏతత్‌జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతోఽన్యథా॥



సీ॥ శుభము నశుభములన్ చూచుట సమబుద్ధి,
కలుగుచు స్థిరభక్తి కొలుచుచుంట,
ఏకాంతమును గోరి ఎడమొగంబైయుంట,
జనసమూహమ్ముల జనకయుంట,
అధ్యాత్మ జ్ఞానమ్మునందున శ్రద్ధతో
నిరతమ్ము కుదురుచు నిష్ఠనుంట,
తత్త్వంపు జ్ఞానమ్ము దరిచేర కలుగు ప్ర-
యోజనంబు తెలిసి ఒప్పియుంట,

తే॥ దీనినంతయు జ్ఞానము అనియు, అటులె
దీనికేది విరుద్ధమో దానినంత
అనఘ అజ్ఞానమని బుధులందురయ్య,
ప్రీతితో చెప్పుచున్నాను పేర్మి నీకు.

13. జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యత్‌జ్ఞాత్వాఽమృతమశ్నుతే।
అనాదిమత్పరంబ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥

తే॥ తెలుసుకోదగునేదియో, తెలియనేది
నరుడు పొందునొ ముక్తిని నయము మీర,
అదియె జ్ఞేయమౌ బ్రహ్మంబు, ఆదిలేని-
దగుట సత్తు నసత్తంచు అనగలేము.

14. సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥

**ఆ॥వె॥ అంతటయును విదితమౌ పరబ్రహ్మంబు,**
**చేతులును, పదములు, చెవులు, తలలు**
**మొగములన్ని కలిగి జగతినందంతయు**
**ఆవరించియున్నదదియె సుమ్మి.**

15. సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ॥

16. బహిరంతశ్చ భూతానాం అచరం చరమేవ చ।
సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్॥

**వ॥ ఆ పరబ్రహ్మము యొక్క ప్రాశస్త్యమెట్టిదనిన**

**సీ॥ ఇంద్రియ విషయము లెరిగియు, అయ్యది**
**వాటిని మించుచు బరగుచుండు,**
**ఆసక్తిరహితము అయ్యును జగతిని**
**ధరియించి పోషించు ధాత అదియె,**
**గుణములేవియు లేక గురుతరంబయ్యును**
**అన్నిగుణములను అనుభవించు,**
**సర్వభూతాలలో చక్కగాయుండును**
**వెలుపల లోపల వెల్లివిరిసి,**



**తే॥ అది చరాచరమైనదే అగును పార్థ ।**
**సూక్ష్మరూపాన యుండుటన్ చూడలేము**
**ఎంతొ దూరాన యున్నట్లు యెరుక అగును**
**కాని దగ్గరే యున్నట్లు కాననగును.**

17. అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

18. జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥

19. ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥

**సీ॥ అవిభక్తమగుచును అన్ని ప్రాణులనుండి-**
**యును, వేరు రూపాల యుండునదియె,**
**జీవుల పోషించు, జీవుల మడియించు,**
**జీవుల సృష్టిని చేయునదియె,**
**జ్యోతులన్నిట పరంజ్యోతియు నయ్యది**
**మాయకు లొంగని మహిమకలది,**
**జ్ఞానంబు జ్ఞేయంబు జ్ఞానగమ్యంబుగ**
**జీవుల హృదినుంట చెప్పబడెను,**



**తే॥ వినుము క్షేత్రము, జ్ఞేయము, జ్ఞానమిట్లు**
**సంగ్రహంబుగ తెలిపితి చక్కగాను**
**ఇట్టి తత్త్వము విజ్ఞత నెరుగు భక్తు-**
**లందరును నన్ను పొందగ అర్హులయ్య!**

20. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥

21. కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥

22. పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్గుణాన్ ।
కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు ॥

**సీ॥ ప్రకృతియు పురుషుండు బరగు ననాదిగా**
**గుణవికారములన్నికూడ ఇలను**
**ప్రకృతిచే జనియించి ప్రభవిల్లుచున్నవి**
**ఎరుగు మిద్దానిని ఇంద్రతనయ!**
**కార్యముల్ కరణముల్ కలిగించు ప్రకృతియే**
**యనుచు చెప్పబడియె, నదియుగాక,**
**పురుషుండు సుఖదుఃఖ భోక్తృత్వహేతువు**
**అనుచు చెప్పబడును అవనియందు,**



**తే॥ ప్రకృతియందున స్థితుడౌచు, ప్రకృతి నుండి**
**పుట్టు గుణములనుభవించు పురుష డట్లె,**
**గుణపు సాంగత్యమే జీవి కొనర జేయు**
**నుత్తమాధమ జన్మల నుర్వియందు.**

23. ఉపద్రష్టాఽనుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥

**తే॥ సాక్షిభూతుడు, భోక్తయు, జగతి భర్త,**
**అనుమతించు మహేశ్వరుడతడె పార్థ !**
**జీవులన్నిట బాగుగ చేరియున్న**
**చిన్మయుడు పరమాత్మగా చెప్పబడును.**

24. య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ।
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥

**వ॥ ఓ అర్జునా! ఇట్లు పురుషుని తత్త్వమును త్రిగుణ**
**సహితమైన ప్రకృతి తత్త్వమును తెలిసి కొనినవాడు**
**అన్నివిధములుగా లోకవ్యవహారములు**
**ఆచరించుచున్నప్పటికీ పునర్జన్మనందదు.**

25. ధ్యానేనాత్మని పశ్యన్తి కేచిదాత్మానమాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥

26. అన్యే త్వేవ మజానన్తః శ్రుత్వాఽన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః॥

సీ॥ **పురుషులు కొందరు పరమాత్మ గందురు**
**చెదరని ధ్యానాన హృదయమందు,**
**సాంఖ్యయోగమువల్ల చక్కగ కొందరు**
**పరమాత్మ జూతురు బాగుగాను,**
**కర్మయోగమువల్ల గాంతురు కొందరు**
**బ్రహ్మము నారీతి, పార్థ! వినుము**
**ఈ యోగములనెల్ల ఎరుగని కొందరు**
**ఇతరులు, జ్ఞానులు ఎరుగజెప్ప**

తే॥ **శ్రవణములు చేసి కొలుతురు అవని నన్ను,**
**విహితమౌ ఉపాసనలచే విధిగ గొల్చి**
**చావుబోలిన యట్టి సంసార జలధి**
**సందియములేక తరియించజాలగలరు.**

27. యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్।
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ ॥

28. సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్।
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి ॥



వ॥ **ఓ అర్జునా! స్థావరజంగమప్రాణులన్నీ క్షేత్ర క్షేత్రజ్ఞుల సంయోగముతో నుద్భవించినవే అని తెలిసి కొనుము. నశ్వరములైన చరాచరభూతము లందు స్థితుడయ్యును పరమాత్మ శాశ్వతుడు. అట్టి పరమాత్మను అన్ని భూతముల యందు చూడగలిగిన వాడే నిజమైన జ్ఞాని.**

29. సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।
న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥

కం॥ **పరమాత్మను అన్నిటిలో**
**సరిగా వీక్షించువాడు చక్కగ తనకున్**
**జరుపడు ఎన్నడు హింసను,**
**పరమాత్మను చేరు దాన పార్థా! తెలియన్.**

30. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యఃపశ్యతి తథాత్మానమకర్తారం స పశ్యతి ॥

కం॥ **అరయగ ప్రకృతివల్లనె**
**నెరవేరును కర్మలంచు నేర్చునెవండో,**
**ఎరుగును తన వలనేదీ**
**జరగదు అని, పార్థ! జ్ఞాని చక్కగ నతడే.**



31. యదా భూతపృథగ్భావమేకస్థమనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా॥

ఆ॥వె॥ **వేరువేరుతోచు వివిధ భూతములొకే**
**ఆత్మనున్నవనియు, అచటినుంచి**
**విస్తరించునంచు విదితమౌనప్పుడు**
**బ్రహ్మపదముపొందు పార్థ! నరుడు.**

32. అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాఽయమవ్యయః।
శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥

ఆ॥వె॥ **పార్థ! శాశ్వతుండు పరమాత్మ, ఆదియే**
**లేని గుణరహితుడు, కాన యతడు**
**దేనికవడు కర్త దేహాననుండియున్,**
**అతనిఁ గర్మ లెపుడు అంటవయ్య!**

33. యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే ।
సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥

వ॥ **సర్వత్ర వ్యాపించిన ఆకాశము సూక్ష్మమగుటచే ధూళిమున్నగు వాటిచే ఎట్లు అంటబడదో, అట్లే సకల శరీరములలో వ్యాపించియూ పరమాత్మ శరీరగుణదోషములచే అంటబడకున్నాడు.**



34. యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥

తే॥ **ఎట్లు సూర్యుండు లోకాలకిచ్చు కాంతి,**
**అట్లు క్షేత్రజ్ఞుడగు పరమాత్మ యొకడె**
**వెలుగుతో నింపు క్షేత్రాల వేనవేలు,**
**ఇట్టి సూక్ష్మమౌ జ్ఞానము నెరుగుమయ్య!**

35. క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమన్తరం జ్ఞానచక్షుషా ।
భూతప్రకృతిమోక్షంచ యే విదుర్యాన్తి తే పరమ్॥

వ॥ **ఈవిధముగా క్షేత్రము, క్షేత్రజ్ఞుల బేధాన్ని, భూతములకు సంబంధించియుండు ప్రకృతి నుంచి ప్రాణులు మోక్షం పొందే విధానాన్ని జ్ఞానదృష్టితో తెలిసికొన్న పురుషులు తప్పక పరమపదము పొందగలరు.**

**ఇది శ్రీకృష్ణార్జున సంవాద రూపమగు**
**శ్రీమద్భగవద్గీతలోని**
**క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగమను**
**పదమూడవ అధ్యాయము**

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునాల్గవ అధ్యాయము

## గుణత్రయ విభాగయోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 4వ శ్లోకము వరకు** –జ్ఞానమహిమ, ప్రకృతి పురుషుల నుండి జగదుత్పత్తి వివరణము.

**5 నుండి 18వ శ్లోకము వరకు** – సత్త్వరజస్తమోగుణముల ప్రస్తావన.

**19 నుండి 27వ శ్లోకము వరకు** – భగవత్ప్రాప్తికి భగవానుడు చెప్పు ఉపాయము, గుణాతీతుని లక్షణముల వివరణము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:
5, 18, 19, 20, 22, 24, 25, 26

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:
సమస్త దోషములు తొలగి దివ్యపదము లభించును.



## శ్రీమద్భగవద్గీత

## పదునాల్గవ అధ్యాయము

## గుణత్రయ విభాగయోగము

శ్రీభగవానువాచ

1. పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్।
యత్జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥

**భగవానుడిలా అన్నాడు... ఓ అర్జునా !**

ఆ॥వె॥ **జ్ఞానములకు నెల్ల ఘనమైన దేదియో,**
**ఏది తెలిసి మునులు పొందిరిలను**
**పరమసిద్ధి వారి బంధాల విడనాడి,**
**దాని మరల చెప్పెదను వినంగ.**

2. ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।
సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ॥



కం॥ **ధారుణి ఈ జ్ఞానముచే**
**నా రూపము పొందగలిగి నరులీ సృష్టిన్**
**తీరుగ జన్మమునొందరు**
**వారిల ప్రళయాన వ్యథను బడయరు పార్థా!**

వ॥ **ఇక ఈసృష్టి ఎలా జరుగుతున్నదో చెపుతాను వినుము.**

3. మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।
సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥

ఆ॥వె॥ **వినుము మూలప్రకృతి అను యోనియందున**
**బీజముంచి సృష్టి వెలయచేతు**
**సర్వ ప్రాణికోటి జన్మించె నందుచే,**
**చేరి నేనె జగతి సృష్టికర్త.**

4. సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవన్తి యాః ।
తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా ॥

ఆ॥వె॥ **అన్ని జాతులిలను ఆవిర్భమగుటకు**
**ముఖ్యమైన యట్టి మూలప్రకృతి**
**తల్లియగుచు సృష్టి దనరగ, నర్జునా!**
**బీజమిచ్చు దాత, పితయు నేనె.**

5. సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥

వ॥ **అర్జునా! ప్రకృతి వలన పుట్టిన సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు శాశ్వతమైన ఆత్మను శరీరంలో బంధించి ఉంచుతున్నాయి. మరియు**

6. తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।
సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥

తే॥ **సత్త్వగుణమెప్పు నైర్మల్య సహితమగును,**
**కాంతి సుఖము నారోగ్యంబు గలుగజేయు,**
**శాంతి జ్ఞానంబుమీద నాసక్తి పెంచి,**
**దానఁ ఆత్మ బంధించుటే దాని ఘనత.**

7. రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్ ।
తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥

తే॥ **రాగరూపమౌ గుణముగ రజము వెలయ**
**ఆశ మూలమై ఆసక్తి అధికమగును**
**కర్మకాండల ననురక్తి కలుగచేసి**
**దానఁ ఆత్మబంధించుటే దాని ఘనత.**



8. తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్యనిద్రాభిస్తన్నిబధ్నాతి భారత ॥

తే॥ **గొప్ప అజ్ఞానమున తమోగుణము పుట్టు,**
**ప్రాణులన్నిటన్ అవివేక ప్రభలు పెంచు,**
**నిద్ర, బద్ధకంబు, పరాకు నెగడుచుండ**
**దానఁ ఆత్మబంధించుటే దాని ఘనత.**

9. సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।
జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥

వ॥ **అర్జునా! ఈ త్రిగుణాలవల్ల మనిషి ప్రవర్తన వాని లక్షణములు ఎలా వుంటాయంటే...**

ఆ॥వె॥ **సత్త్వగుణపు వృద్ధి సర్వసుఖకరంబు**
**రజముచేత కర్మరక్తుడగును,**
**కలుగు జ్ఞానలేమి, అలసత్వము, మఱపు**
**తమముచేత పార్థ! తగనిదయ్య!**

వ॥ **అయితే ఈ త్రిగుణాలలో ఒకటి వృద్ధి అయితే మిగతా రెండూ తగ్గిపోతాయి. అది ఎలాగంటే..!**

10. రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।
రజస్సత్త్వం తమశ్చైవ తమస్సత్త్వం రజస్తథా ॥



ఆ॥వె॥ **రజము తమము తగ్గ రాణించు సత్త్వంబు**
**వీగ సత్త్వ తమము పెరుగు రజము,**
**సత్త్వ రజములణగు జాడనే తమమున్ను**
**పార్థ! పెరుగునయ్య! వసుధయందు.**

11. సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।
జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత ॥

వ॥ **ఎప్పుడు శరీరేంద్రియములందును అంతఃకరణ మందును చైతన్యము వివేకశక్తిఉత్పన్న మగునో అప్పుడు అతనిలో సత్త్వగుణము వృద్ధి చెందినది అని తలంచవలెను.**

12. లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా।
రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ ॥

తే॥ **హెచ్చు లోభంబు, మనసులో హెచ్చుచుండు**
**కర్మలందునన్ ఆసక్తి, కడకు నటులె**
**హెచ్చు ఆశయున్, శాంతియే హీనమగును**
**రజము అధికంబు అగుటచే ప్రజకు పార్థ!**

13. అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ॥
తమస్యేతాని జాయన్తే వివృద్ధే కురునన్దన ॥



తే॥ **తమము అధికంబు అగునెడ ధరణి నరులు**
**బుద్ధిమాంద్యంబు అలసత్వవృద్ధి చేత**
**దేనియందును లక్ష్యంబు కానరయ్య,**
**అంత అజ్ఞానమే హెచ్చు కుంతిపుత్ర!**

14. యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్।
తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే ॥

15. రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।
తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥

16. కర్మణస్సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।
రజసస్తు ఫలం దుఃఖమజ్ఞానం తమసః ఫలమ్ ॥

17. సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥

సీ॥ **సత్త్వగుణపువృద్ధి జరుగగా మరణించ**
**జ్ఞానోత్తములు పొందు జగములొందు,**
**రజము పెరుగు వేళ లయమవన్ జన్మించు**
**ఇలను కర్మిష్ఠుల ఇండ్లలోన,**
**తమము హెచ్చుగుచున్న తరుణాన మరణించ**
**పశుపక్షులను బుట్టు పామరుడగు,**
**సత్త్వకర్మలచేత చక్కని సుఖములున్**
**జ్ఞానంబు కల్గును జగతి పార్థ!**

తే॥ దేహి రజగుణోపేతుడై దిగులుచెందు,
మరియు లోభంబు అధికమై మఱచు సుఖము,
మనసు తమము పెరుగుటచే మలినపడగ
గొప్ప అజ్ఞాన మలసత్వ మొప్పుచుండు.

18. ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥

ఆ॥వె॥ సత్త్వగుణులు యెపుడు సద్గతుల్ పొందేరు,
తప్పదధమజన్మ తామసులకు,
రజము నాశ్రయించ నిజవర్తనము చేత
పుడమి జేరి జన్మపొందు జీవి.

వ్యాఖ్య॥ అయితే యోగులు తామసులయితే అధోగతిచెంది బాధలు అనుభవించి తిరిగి పశుపక్ష్యాదులుగానూ పామరులుగానూ జన్మిస్తారు. అనగా ముక్తి పొందకలిగేది కేవలం సత్త్వగుణం కలవారే. వారు యోగభ్రష్టులయిననూ పుణ్యలోకాలలో సుఖములుపొంది తిరిగి పుణ్యకర్ముల ఇంట జన్మిస్తారు అని పరమాత్మచే ఇదివరకే చెప్పబడింది.

19. నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽనుపశ్యతి।
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥



ఆ॥వె॥ కర్మలన్నిటికిని కర్త గుణములనుచు,
కాదు అన్యమేది కర్త అనియు,
ఆత్మ త్రిగుణములకు అగు నతీతంబని
తెలియు జ్ఞానికెపుడు కలుగుముక్తి.

20. గుణానేతా నతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే ॥

ఆ॥వె॥ కాయముద్భవించ ఘన కారణంబగు
త్రిగుణములను మించు దేహి యెపుడు,
జన్మమరణమున్ను జరయు దుఃఖము లేక
అమృతపథము నతడు అందగలడు.

అర్జున ఉవాచ

21. కైర్లింగైః త్రీన్గుణానేతానతీతో భవతి ప్రభో।
కిమాచారః కథం చైతాంస్త్రీన్గుణానతివర్తతే ॥

అర్జునుడిలా అన్నాడు

తే॥ త్రిగుణములు దాటు ధన్యుండు తెలుపుమెవడొ?
వాడు ఎట్టి లక్షణముల బడసియుండు?
త్రిగుణములకెట్లతీతుడౌ తెలుపుమయ్య!
అతని నడవడి యెట్లుండు నసఘ! నాకు.

శ్రీ భగవానువాచ



22. ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥

23. ఉదాసీన వదాసీనో గుణైర్యో న విచాల్యతే ।
గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥

24. సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః।
తుల్యప్రియాప్రియో ధీరస్తుల్యనిందాత్మ సంస్తుతిః ॥

25. మానాపమానయోస్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః।
సర్వారంభపరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే ॥

అప్పుడు భగవానుడిలా అన్నాడు.

సీ॥ సత్త్వగుణమొసగు సౌఖ్యంబులేకాని,
రజము నొసగు కర్మరక్తికాని,
తమమున హెచ్చుగు తగని మోహముకాని,
ద్వేషించదాతండు తెలిసికూడ,
వాటిని కోరడు బంధములందడు
గుణములకందని గొప్పవాడు,
ప్రకృతియె కర్మల పరగు కారణమంచు
స్థిరబుద్ధి యేస్థితిన్ మఱువబోడు,

తే॥ మరియు సుఖదుఃఖముల్, పైడి, మట్టి, రాయి,
భూషణలు, ప్రేమ, ద్వేషంబు, దూషణములు,
శత్రు, మిత్రుల చక్కగా సమతచూచు
నతడు త్రిగుణాలకు నతీతుడయ్య పార్థ!



వ॥ అటువంటి యోగి గుణముల నన్నిటిని గెల్చిన వాడగుటచేత గుణాతీతుడని పిలువబడుతున్నాడు. అతను ఆ గుణములవల్ల ఏమాత్రమూ కట్టుబడడు.

26. మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే।
స గుణాన్సమతీత్యైతాన్బ్రహ్మ భూయాయ కల్పతే ॥

ఆ॥వె॥ స్థిరము అయిన భక్తి సేవించు భక్తుండు
మూడు గుణములిట్లు అడచి గెలుచు
ముక్తిపొందనతడు ముదమార అర్హుండు
అగుచు ముక్తిపథమునందు పార్థ!

27. బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహమమృతస్యావ్యయస్య చ।
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ ॥

వ॥ ఎందువలననగా వినాశరహితము, వికార రహితము శాశ్వతధర్మ స్వరూపము, ఆనందస్వరూపమూ అయిన బ్రహ్మనికి నిలయాన్ని నేనే అర్జునా!

ఇది గ్రహింపుము

ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు
శ్రీమద్భగవద్గీతలోని
గుణత్రయ విభాగయోగమను
పదునాల్గవ అధ్యాయము

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునైదవ అధ్యాయము

## పురుషోత్తమ ప్రాప్తి యోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు :

**1 నుండి 6వ శ్లోకము వఱకు** – సంసార వృక్ష వర్ణనము మరియు భగవత్ప్రాప్తికి ఉపాయములు.

**7 నుండి 11వ శ్లోకము వఱకు** – సర్వత్ర భగవంతుని యొక్క అస్తిత్వమును తెల్పుట, భగవత్ప్రభావమును వర్ణించుట.

**16 నుండి 20వ శ్లోకము వఱకు** – క్షర, అక్షర పురుషుల గురించియు, పురుషోత్తముని గురించియు వర్ణనము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థము చేసుకొనదగిన శ్లోకముల సంఖ్యలు.

1, 2, 5, 8, 14, 15, 16, 19

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము
సర్వపాప నివృత్తి, మోక్షప్రాప్తి.
భోజనాత్పూర్వం పఠనీయము.



## శ్రీమద్భగవద్గీత

### పదునైదవ అధ్యాయము

### పురుషోత్తమప్రాప్తి యోగము

శ్రీభగవానువాచ

1. ఊర్ధ్వమూలమధశ్శాఖమశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్॥

వ॥ **భగవానుడిలా అన్నాడు**

తే॥ **వేదములు పత్రములు, పైకి వేళ్ళుకలిగి,**
**కొమ్మలన్నియు క్రిందకు కమ్ముకొనుచు**
**వెలయు సంసార అశ్వత్థవృక్షమందు,**
**నాశరహితంబగు నదియే నరవరేణ్య!**

వ్యాఖ్య॥ **ఈ సంసారము ఒక అశ్వత్థవృక్షము (రావిచెట్టు) వంటిది. పరమాత్మ నుండియే సమస్త జగత్తు ఆవిర్భవించియున్నందున ఊర్ధ్వమున వెలయుచున్న ఆ పరమాత్మయే క్రిందనున్న జగత్తునకు కారణభూతుడు అని నిరూపించుటకు గాను పైన మూలము క్రింద శాఖలు కలిగియున్నట్లు బ్రహ్మాండ వృక్షము చిత్రించబడినది. వేదములే ఈ వృక్షమునకు ఆకులు, నాశరహితుడైన పరమాత్మ ఈ వృక్షమునకు మూలము కనుక ఇదియును నాశరహితమే. ఈ వృక్ష తత్త్వమును చక్కగా తెలిసికొనువాడు వేదార్థము నెరిగినవాడే యగును.**



2. అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా
గుణప్రవృద్ధా విషయప్రవాలాః।
అధశ్చ మూలాన్యనుసంతతాని
కర్మానుబంధీని మనుష్యలోకే ॥

తే॥ **వృక్షమది త్రిగుణములచే వృద్ధియగును**
**చూడ చిగురులే విషయంపు సుఖములగును**
**శాఖలవి ప్రాకె లోకాల సవ్యసాచి!**
**కర్మబంధాలు వేళ్ళుగా కమ్మె భువిని.**

వ్యాఖ్య: **ఈ సంసారవృక్షము యొక్క కొమ్మలు సత్త్వరజస్తమోగుణములచే వృద్ధి పొందింపబడి, శబ్దాది విషయములనెడు చిగుళ్ల గలిగి, క్రిందికిని మీదికిని బ్రహ్మలోకము వరకు వ్యాపించియున్నవి. మనుష్యలోక-మందు పుణ్యాపాపకర్మబంధములవలన క్రిందకు కూడా వ్యాపించినవి.**

3. న రూపమస్యేహ తథోపలభ్యతే
నాన్తో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూల –
మసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా॥

4. తతః పదం తత్పరిమార్గితవ్యం
యస్మిన్ గతా న నివర్తంతి భూయః।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తి ః ప్రసృతా పురాణీ॥

5. నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః।
ద్వన్ద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై-
ర్గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్॥

సీ॥ ఆ వృక్షమునకును ఆదియు మధ్యంబు
అంతము నెఱుగగ నలవి కాదు,
విలసిల్లె దృఢముగ వేఱులు, దానిని
ఖండించి వైరాగ్యఖడ్గ మెత్తి,
తరువున కాదియౌ పరమాత్మ శరణునే
ఒదవగ తలచుచు వెదక వలెను,
ఆ విధి చేరగ ఆ పరంధామంబు,
తిరిగి రారు భువికి మరల నెవరు

తే॥ అహము, మోహము, అవివేక, మాశలన్ని
ఆత్మ జ్ఞానాన బాగుగ అణచివైచి
సుఖము దుఃఖము లొకటిగ చూచుజ్ఞాని
శాశ్వతంబైన బ్రహ్మంబు జాడ గనును.

వ్యాఖ్య: ఈ వృక్షము యొక్క స్వరూప స్వభావములు ఈ లోకమునందు సంసారానక్తిగలవారిచేత తెలియబడకున్నవి. అది శాఖోపశాఖలుగా వ్యాపించి బాగుగ వేళ్లు తన్నుకొని యున్నది. అసంగము అనగా



ప్రాపంచిక పదార్థములందు అభిమానము ఆసక్తిలేకుండుట అనే బలమైన ఖడ్గముచే అది తెగనరకి వేయబడగలదు. అట్లు సంసార వృక్షమును ఛేదించిన పిమ్మట ఆదిపురుషుడగు పరమాత్మనే శరణు బొందుచున్నాను అనునట్టి భక్తి భావముతో ఆ పరమాత్మ పదమును అన్వేషింపవలెను. ఆ పదమును పొందినవారు తిరిగి ఈ సంసారమున జన్మింపరు. అట్టి శాశ్వత బ్రహ్మపదమును అనగా మోక్షమును పొందగోరువారు ఆరు లక్షణములను కలిగియుండవలెను. అవి ఏవనగా అభిమానము, అహంకారము, అవివేకము లేకుండుట, దృశ్యపదార్థములందు ఆసక్తి లేకుండుట, నిరంతరము ఆత్మనిష్ఠులై యుండుట, కోరికలను సంపూర్ణముగ తొలగించుట, సుఖ దుఃఖాది ద్వంద్వములనుండి విడువబడుట, అజ్ఞానమును, అవిద్యను దరి-చేరనీయకుండుట. ఆ పరమాత్మకి నిలయమైన పరంధామమును పొందుటయే పురుషోత్తమప్రాప్తి. ఇక ఆ పరంధామ మెట్టిదనిన

6. న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః।
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ॥



తే॥ సూర్యుడును చంద్రుడును అగ్నిసొంపుమీర
దాని భాసింపచేయంగ తగరు పార్థ!
చేరి పొందగ దాని, సంసారమందు
తిరిగి జన్మను పొందరు వారు భువిని.

7. మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః।
మనః షష్ఠానీన్ద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥

ఆ॥వె॥ నాదు అంశమదియె నయముగా జీవాత్మ
అగుచు లోకమందు అలరుచుండె
ప్రకృతి స్థితములయిన వాటి నాకర్షించు
ఇంద్రియములు, మనసు ఇంద్రతనయ!

వ్యాఖ్య॥ ఆ పురుషోత్తముడి అంశ జీవాత్మగా లోకమున ప్రతి ప్రాణియందూ అమరి యున్నది. ఇంద్రియములు, మనస్సు కూడా ప్రకృతియందు నెలకొన్నవగుటచేత జీవుడు వాటిచే బంధింపబడుచున్నాడు.

8. శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధా నివాశయాత్॥

కం॥ పూవుల వాసన నేవిధి
ఆ వాయువు తనదు వెంట అటు కొనిపోవున్,
ఆ విధి పుట్టుచు గిట్టుచు
జీవుడు మనసేంద్రియముల చేకొని పోవున్.



9. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥

ఆ॥వె॥ చెవులు, కనులు, మేను, జిహ్వయు, నాసిక
ఇట్లు జీవు డయిదు ఇంద్రియముల,
మనసు నాశ్రయించి అనుభవించుచునుండు
విషయ సుఖములన్ని విజయ! మహిని.

వ॥ అనగా జీవుడు విషయ సుఖములన్నీ ఆ పంచేద్రియములచే మనసు ద్వారా అనుభవిస్తున్నాడు.

10. ఉత్క్రామన్తం స్థితం వాపి భుఞ్జానం వా గుణాన్వితమ్।
విమూఢా నానుపశ్యన్తి పశ్యన్తి జ్ఞానచక్షుషః ॥

ఆ॥వె॥ తమరి దేహమందు తనరి యున్నపుడైన
తమరి దేహమొదలు తరుణమైన
విషయసుఖములందు విలసిల్లునపుడైన
జీవుదెలియలేరు భువిని జడులు

వ॥ కేవలం జ్ఞానదృష్టిగలవారు మాత్రమే
ఆ జీవాత్మను తెలిసికొనుచున్నారు.

11. యతన్తోయోగిన శ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్ ।
యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్య చేతసః ॥

ఆ॥వె॥ అంతరాత్ముడైన ఆత్మను యోగులే
గట్టి యత్నమొదవి గాంచగలరు,
అరయ చిత్తశుద్ధినందని మూర్ఖులు
ఎన్నిజేసియైన యెరుగలేరు.

12. యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽ ఖిలమ్ ।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥

కం॥ ఈ జగతికి వెలుగిచ్చెడి
తేజము భువిలోన సూర్యదేవునిదైనన్
తేజము చంద్రునిదైనను
తేజము ఆ అగ్నిదైన తెలియుము నాదే.

13. గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా।
పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః॥

ఆ॥వె॥ సర్వభూతములను చక్కగ ధరియింతు
యోగశక్తిచేత జగతి యందు,
అమృతము నెలకొన్న ఆ చంద్రుడై నేను
సస్యరక్షణంబు జరుపుచుంటి.

14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

15. సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృ తిర్ జ్ఞానమపోహనం చ।
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్॥



16. ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥

సీ॥ జఠరాగ్ని రూపాన జనుల కాయములందు
వైశ్వానరుండనై వెలసియుండి,
వాయువులనుగూడి బాగుగ జీర్ణంబు
అగునట్లు చేతును అన్నములను,
అన్ని ప్రాణులయందు అంతరాత్మగనుండి
కలుగచేతును జ్ఞప్తి, తెలివి, మఱపు
వేదాంతకర్తయున్ వేదజ్ఞుడను నేను
వేదముల్ తెలిపెడి వేల్పునేను,

ఆ॥వె॥ క్షరుడు అక్షరుడను పురుష లిద్దరు భువిన్,
అంతరాత్మ యొకడె అక్షరుండు,
క్షయమునందునట్టి సర్వభూతములనన్
అక్షరుడు యనెదురయ్యా! ధరణియందు.

17. ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః।
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః॥

ఆ॥వె॥ వీరిరువురికన్న పరమాత్మ అధికుండు,
నాశనంబులేని ఈశుడతడు,
ముజ్జగములయందు మొత్తము వ్యాపించి
వాటిని భరియించి వాని బ్రోచు.



వ్యాఖ్య॥ జీవుడు అంతరాత్ముడు, అక్షరుడు అనగా నాశనము లేనివాడు. అయిననూ త్రిగుణములచేత ఆకర్షితుడగుచున్నాడు. అందుచేతనూ, నాశనము కలిగిన దేహము క్షరుడగుట చేతనూ, త్రిగుణరహితుడూ అవ్యయుడూనైన పరమాత్మ ఈ క్షరాక్షరుల కంటే ఉత్తముడై పురుషోత్తముడిగా పరిగణింపబడుచున్నాడు.

18. యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః ।
అతోఽ స్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః॥

కం॥ క్షరుడిని మించినవాడిని,
మరియును అక్షరునికంటె మాన్యుడనైతిన్,
గరిమను వేదములందున
పురుషోత్తముడంచు పేరుపొందితి ననఘా!

19. యో మామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్।
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥

20. ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయాఽ నఘ
ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్స్యాత్ కృతకృత్యశ్చ భారత ॥



సీ॥ అర్జునా! నన్నెవ్వడజ్ఞానమును వీడి
ఈరీతి తెలియునో ఎపుడునన్ను,
పురుషోత్తముడనంచు ఎరుగునో అవ్వాడు
సర్వజ్ఞుడాతడు జ్ఞాని యతడు,
అన్నివిధంబులనన్నివేళలయందు
వాసుదేవుడనినా భజనచేయు
అనఘ! ఈవిధముగా అత్యంత గోప్యమీ
శాస్త్రము, నాచేత చక్కగాను

తే॥ తెలుపబడినది, దీనిని తెలియువాడు
జ్ఞానియగు యోగి అర్జునా! ఘనుడతండు
అట్టి తత్త్వము చక్కగ నాచరించి
ధన్యచరితుడు గానగు ధరణియందు.

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగవద్గీత లోని**
**పురుషోత్తమ ప్రాప్తియోగమను**
**పదునైదవ అధ్యాయము**

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునారవ అధ్యాయము

## దైవాసుర సంపద్విభాగయోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు

**1 నుండి 5వ శ్లోకము వఱకు** – ఫలసహితముగా దేవ అసుర సంపదల కథనము

**6 నుండి 20వ శ్లోకము వఱకు** – అసుర సంపదగల వారి లక్షణములు, – వారికి అధోగతి తప్పదని తెల్పుట.

**21 నుండి 24వ శ్లోకము వఱకు** – శాస్త్ర విరుద్ధాచరణములను త్యజంచుటకునూ, శాస్త్రోక్త విధులను ఆచరించుటకు ప్రేరణము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థము చేసుకొనదగిన శ్లోకముల సంఖ్యలు.

1, 2, 3, 10, 15, 16, 18, 19, 21, 23

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలము : బలపరాక్రమములును, సుఖమును లభించును.



## శ్రీమద్భగవద్గీత
## పదునారవ అధ్యాయము
## దైవాసుర సంపద్విభాగయోగము

1. శ్రీ భగవానువాచ
అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్॥
2. అహింసా సత్యమక్రోధస్త్యాగశ్శాంతిరపైశునమ్।
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్॥
3. తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా।
భవన్తి సంపదం దైవీమభిజాతస్య భారత ॥

**భగవానుడిలా అన్నాడు:**

**సీ॥ అరయ నిర్భీతియు, అంతఃకరణశుద్ధి**
**జ్ఞానయోగపు నిష్ఠ, దానగుణము,**
**ఇంద్రియ నిగ్రహం, బింపైన మృదులంబు,**
**యజ్ఞ తపములందు అమరు రక్తి,**
**సరళస్వభావంబు, సత్యం, బహింసయున్**
**అక్రోధమున్, సిగ్గు, అలరు ఈవి,**
**శాంతి, భూతదయయు, చపలరాహిత్యంబు,**
**విషయ నిరాసక్తి, వేదపఠన,**



**తే॥ ఓర్పు, తేజంబు, ధైర్యంబు, ఒనరు శుచియు**
**ఒరులపై ద్రోహచింతన నరయకుంట**
**దుష్ప్రచారంబు వీడుట, దురభిమాన**
**మొదలుటే, దైవసంపదకున్న సిరులు**

**వ॥ ఓ అర్జునా! ఇట్టి శ్రేష్ఠమయిన గుణములన్నీ దైవ సంపద యందు జన్మించు వాని యందుండును.**

**వ్యాఖ్య:** **నిర్భయము, చిత్తశుద్ధి, జ్ఞానయోగమునందు నిష్ఠ, దానగుణము, ఇంద్రియనిగ్రహము, వేదపఠనము, యజ్ఞము, తపము మున్నగు ఉత్తమ కర్మలు చేయు ప్రయత్నము చేయుచుండుట, సరళ స్వభావము, ఓర్పు, సత్యవాక్పాలనము, అహింసావ్రతము, అక్రోధము (కోపము లేకుండుట) త్యాగగుణము, శాంతితో చిత్త చాంచల్యము లేకుండుట, భూతదయ, పాపకార్యములు చేయుటకు సిగ్గు,**

ప్రవర్తనలో మృదుత్వము, నిశ్చలత్వము, నిర్మలత్వము, తేజము, ధైర్యము, శుచి, ఇతరులయందు ద్రోహబుద్ధి లేకుండుట, ఇతరులపై దుష్ప్రచారము చేయకుండుట, దురభిమానము లేకుండుట అనునట్టి ఇరువది ఆరు సుగుణములుండుట దైవాంశ సంభూతుల లక్షణములు (ఇందులో ఎన్ని తమలో ఉన్నవో తెలుసుకొనుటకు వాటిని వచనరూపమున మరల చెప్పబడినది.) ఇకరాక్షసాంశతో జన్మించువారల గుణములు సహజముగా దుర్గుణములే. రాక్షసులని వేరే జాతి యుండనక్కరలేదు. ఆ గుణములున్న మానవుడు కూడా అసురుడే. ఆ లక్షణములివి:

4. దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥



ఆ॥వె॥ కపట వర్తనంబు, గర్వంబు, క్రోధమ్ము
కఠినమైన మనసు కలిగియుంట,
అధికమయినయట్టి అవివేక మసుర సం-
పదల వలనగలుగు పార్థ! వినుము.

5. దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా।
మాశుచ స్సంపదం దైవీమభిజాతోఽసి పాండవ ॥

కం॥ దైవీసంపదచేతను
కోవిద! మోక్షమ్ము, నసురగుణ సంపదచే
జీవికి కలుగును బంధము,
దైవీసంపదను జన్మదాల్చితివి ధరన్.

వ॥ అందుచేత నీవు శోకింప వలదు.

6. ద్వౌ భూతసర్గౌ లోకేఽస్మిన్దైవ ఆసుర ఏవ చ ।
దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥



ఆ॥వె॥ దైవ, అసుర సంపదలను రెండు గుణము-
లందు ప్రాణులన్ని అలరుచుండు,
దైవసంపదనగ వివరించితిన్దొల్లి
వినుము అసురగుణపు వివరములను.

7. ప్రవృత్తిం చ నివృత్తించ జనా న విదురాసురాః।
న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే॥

8. అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।
అపరస్పరసంభూతం కిమన్యత్కామహైతుకమ్ ॥

9. ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః।
ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః॥

సీ॥ అసుర స్వభావులు అరయరు ధర్మంబు,
ఏదధర్మంబని యెరుగరయ్య,
శూన్యమౌ సత్యంబు శుచి సదాచారంబు,
ధర్మవ్యవస్థను ధరణి గనరు,
ఈ జగదాధార మీశుండు కాదని
కామకేళిచె సృష్టి కలిగెనంచు,
సత్యమన్నది లేదు జగతినంచని వారు
మొండివాదంబుల నుండగలరు,



తే॥ మనసు చెడి అల్పబుద్ధులై మనుచు, వారు
క్రూరకర్మలు చేయుచు క్రూరబుద్ధి,
లోకనాశంబుచేయు నాలోచనముల
లోకకంటకులౌదురు లోకమందు.

10. కామమాశ్రిత్య దుష్పూరం దమ్భమానమదాన్వితాః।
మోహాద్గృహీత్వాఽసద్గ్రాహాన్ప్రవర్తన్తేఽశుచివ్రతాః ॥

ఆ॥వె॥ మిథ్యావాదనముల, మితిలేని కోర్కెలన్,
దురభిమాన దంభ దుర్గుణముల,
అశుచిపరులు వారలవివేకులగుచును,
అసుర వంశ జన్మలంది రనఘ!

వ॥ అశుచి వ్రతులగుటచేత శాస్త్ర విరుద్ధ కర్మలనే చేయుదురు.

11. చిన్తామపరిమేయాం చ ప్రలయాన్తాముపాశ్రితాః।
కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితాః ॥

12. ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః
ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్ ॥

ఉ॥ **కాలుని చేరుదాక తమ కామపుచింతల భోగలాలసన్**
**కాలము నిండుగా అదియె కాగల కార్యము అంచునమ్మి,**
**ఆ లాలస ఆశపాశమున లావుగ చిక్కుచు, కామ క్రోధముల్**
**మేలుగహెచ్చి, సంపదలు మెండుగ ఆర్జన చేతురర్జునా।**

వ॥ **ఇక వారి మనోభావాలు ఎలా వుంటాయో వినుము.**

వ్యాఖ్య: **అజ్ఞానములో వారు అంతా తమవల్లే జరిగిందని భగవంతుడెవడూ లేడని తామే ఉన్నతులమని చాటుకుంటారు. రావణాసురాది రాక్షసుల గుణాలతో పోల్చి చూడండి.**

13. ఇదమద్య మయా లబ్ధమిమం ప్రాప్స్యే మనోరథమ్।
ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥

14. అసౌ మయా హతః శత్రుర్హనిష్యే చాపరానపి ।
ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్సుఖీ॥



15. ఆఢ్యోఽభిజనవానస్మి కోఽన్యోఽస్తి సదృశో మయా।
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః॥

16. అనేక చిత్తవిభ్రాన్తా మోహజాలసమావృతాః।
ప్రసక్తాః కామభోగేషు పతన్తి నరకేఽశుచౌ॥

సీ॥ **ఇది నాకు లభియించె, ఇష్టముల్ నెరవేరె,**
**ఆర్జన యింకను అధిక మగును,**
**ఈ వైరి జంపితిన్, ఇతరులన్ మడియింతు,**
**పరగు భోగిని నేనె ప్రభువు నేనె,**
**సర్వము సిద్ధించు సర్వశక్తియుతుడ,**
**ఉన్నత వంశోద్భవుడను నేను,**
**ఎవడు నాకగు సాటి ఇల యజ్ఞదానాల,**
**ఆనందము ధనములన్ని నావె,**

తే॥ **అనుచు అజ్ఞానమున వారు అలమటించి,**
**తగని మోహాన మూర్ఖులై దనుజమతులు**
**కామభోగాలె నిత్యంబు కాగలవని**
**ఘోరనరకాన పడెదరు వీరవర్య!**



17. ఆత్మసంభావితాః స్తబ్ధా ధనమానమదాన్వితాః।
యజన్తే నామయజ్ఞైస్తే దమ్భేనావిధిపూర్వకమ్॥

ఆ॥వె॥ **వినయహీనులగుచు, విపరీత స్వోత్కర్ష,**
**ధనము, మదము, గర్వదర్పములతొ**
**జరుపుచుందురయ్య !శాస్త్ర విహీనమౌ**
**యజ్ఞములను, కీర్తి నరయగాను.**

18. అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః।
మామాత్మ పరదేహేషు ప్రద్విషన్తోఽభ్యసూయకాః॥

వ॥ **అసూయతో కోపముతో కామము, గర్వము బలము అధికమయి తమ తోటి జీవుల లోనూ తమ లోనూ ఉన్న నన్ను చూడ లేక ద్వేషముతో పరనింద చేయుచుందురు.**

19. తానహం ద్విషతః క్రూరాన్సంసారేషు నరాధమాన్।
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు ॥

ఆ॥వె॥ **ద్వేషపూరితులను, పాపచరితులను,**
**క్రూరబుద్ధినుండు వారినెల్ల,**
**మరల జన్మనొంద మహి నీచయోనుల-**
**యందు పార్థ! త్రోచుచుందు నేను.**



20. ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని।
మామ ప్రాప్యైవ కౌంతేయ తతోయాన్త్యధమాం గతిమ్॥

వ॥ **ద్వేషము, దుష్ట స్వభావము, క్రూరత్వమూ గల ఆ దానవ గుణులకు సరియైన శిక్ష సంసారకూపమున బడుటయే. ముక్తి లేకుండా వారు సంసార కూపాన నీచపు జన్మలలో ఎందులో కూడా నన్ను పొంద లేక ఘోర నరకము అనుభవిస్తూ అధోగతుల పాలవుతారు.అట్లు వారిని శిక్షించునది నేనే.**

21. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥

ఆ॥వె॥ **కామక్రోధములును కౌపినములు మూడు**
**నరకద్వారములని అరయవలెను,**
**ఆత్మనాశమునకు అవియె కారణమయ్య**
**వాని వదలివేయవలయు పార్థ!**

22. ఏతైర్విముక్తః కౌన్తేయ తమోద్వారైస్త్రిభిర్నరః।
ఆచరత్యాత్మనః శ్రేయస్తతో యాతి పరాం గతిమ్॥

23. యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥

ఆ॥వె॥ **వాని వదలువాడు తనకు తాన్‌మేలొంది**
**పరమపదమునొంది బడయు కీర్తి,**
**ఇలను శాస్త్రములను యెవ్వడు వీడునో**
**ముక్తి గనడు, సిద్ధి ముదము గనడు.**

వ్యాఖ్య: **అనగా తనలోని అసురగుణములను గుర్తించి వాటిని వెంటనే వదలివేసి తనకుతానే ఉద్ధరించుకోవలెను. అప్పుడే పరమపదము లభించును. లేనిచో జన్మ తర్వాత జన్మపొందుచూ పూర్వ జన్మయందున్న రాక్షసగుణములే మరుజన్మయందు కొనిపోబడి ఆ జన్మలో కూడా పాపములే చేయుచూ, నరకప్రాప్తితో తర్వాత మరలజన్మించి ఇదేవిధంగా మగ్గుతుంటాడు అసురసంపదగలవాడు. శాస్త్రవిధులను విడనాడి ఇచ్చవచ్చినట్లు బ్రతుకువారు ఎన్నటికీ ముక్తిని పొందలేరు. అందుచేత ఎవరో ఉద్ధరించెదరని చూడక ఎవరికి వారు ఉద్ధరించుకోవలెను.**



వ॥ **అందుచేత ఏవి చేయదగ్గ కర్మలో ఏవి కావో ఎట్లు తెలియునో చెప్తాను వినుము.**

24. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥

ఆ॥వె॥ **చేయదగ్గదేదొ చేయరానిది యేదొ**
**నిర్ణయించు శాస్త్రనియతి యొకటె,**
**చక్కగాను తెలిసి శాస్త్రప్రమాణమై**
**జరుపవలెను కర్మ జగతియందు.**

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భవగద్గీతలోని**
**దైవాసుర సంపద్విభాగయోగమను**
**పదునారవ అధ్యాయము.**



శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునేడవ అధ్యాయము

## శ్రద్ధాత్రయ విభాగయోగము



ఈ అధ్యాయమునందలి ముఖ్యాంశములు:

**1 నుండి 6వ శ్లోకము వఱకు** – శ్రద్ధ విషయము మరియు శాస్త్ర విరుద్ధముగా ఘోరతపస్సులను చేయువారి విషయము.

**7 నుండి 22వ శ్లోకము వఱకు** – ఆహారము, యజ్ఞము, తపస్సు దానముల వేర్వేఱు భేదములు.

**23 నుండి 27వ శ్లోకము వఱకు** – ఓంతత్‌సత్ అను మంత్రము యొక్క వ్యాఖ్య.
**28 శ్లోకము:** అశ్రద్ధతో చేయు కార్యముయొక్క ఫలితము.

ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థము చేసుకొనదగిన శ్లోకముల సంఖ్యలు.

3, 5, 6, 13, 14, 15, 16, 17, 28
ఈ అధ్యాయము చదివిన వారికి కలుగు ఫలము:
సర్వరోగ విముక్తి, మోక్షప్రాప్తి.

# శ్రీమద్భగవద్గీత
# పదునేడవ అధ్యాయము
# శ్రద్ధాత్రయ విభాగ యోగము

1. అర్జున ఉవాచ
యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాఽన్వితాః ।
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥
**అర్జునుడిలా అన్నాడు:**

ఆ॥వె॥ **శాస్త్రవిధులవీడి శ్రద్ధతో భక్తితో**
**నిన్ను కొలుచువారి నిష్ఠ ఏది?**
**సత్త్వ, రజము, తమము చక్కగా వీటిలో**
**తెలియచేయుమయ్య దేవదేవ!**

వ్యాఖ్య: **ఇదివరకు భక్తి గొప్పదన్నావు. తర్వాత శాస్త్రం వీడరాదన్నావు. ఒక వేళ తెలిసో తెలియకో శ్రాస్త్రం వీడినా, భక్తివీడక నిన్ను పూజించేవారి నిష్ఠ ఏగుణమునకు చెందినది? అని అర్జునుడు అడుగుచున్నాడు.**



2. శ్రీభగవానువాచ
త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥
॥ **అప్పుడు భగవానుడిలా అన్నాడు. ఓ అర్జునా!**

ఆ॥వె॥ **శాస్త్రవిధిని విడచి స్వాభావికంబగు**
**శ్రద్ధ త్రివిధములగు జగతియందు,**
**సత్త్వ, రజము, తమము చక్కగా ఈమూడు**
**వీటిగూర్చి నీకు వివరమిత్తు.**

3. సత్త్వానురూప సర్వస్య శ్రద్ధా భవతి భారత।
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥

ఉ॥ **శ్రద్ధను పొందు మానవుడు సత్త్వమువల్ల జనించురీతి, ఏ**
**శ్రద్ధయులేని వాడు నరజాతిని యుండడు, అంతెకాక ఆ**
**శ్రద్ధయు ఎట్టిదై మనునొ చక్కగ నాతడు అట్టివాడెయౌ**
**శ్రద్ధకు మారు రూపగుచు సర్వము నేర్వుముదీటు నర్జునా!**

4. యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః।
ప్రేతాన్భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనాః॥



ఉ॥ **పూజలచేత సాత్త్వికులు పుణ్యులు కొల్తురు వేల్పులందరన్।**
**రాజసులట్లె కొల్చెదరు రాక్షసులన్ పలు యక్షకోటులన్**
**పూజలచేత, ప్రేతముల భూతములన్నిటి కొల్తురీభువిన్**
**పూజలతోడి తామసులు పొందగ నీచపు ఈప్సితమ్ములన్.**

వ॥ **మరియూ అసుర స్వభావులైన ఆ తామసులు చేయు తపస్సు లెట్టివో చెప్తాను వినుము.**

5. అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః।
దమ్భాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః॥
6. కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమచేతసః।
మాం చైవాన్తశ్శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్॥

ఉ॥ **వీడుచు శాస్త్రధర్మములు వీరలు ఘోరతపమ్ము చేయుచున్**
**వీడరు దంభదర్పములు, వీరల మేనుల నంతరాత్మగా**
**యుండెడి నన్నుగూడ శమ మొందక కృంగగచేతురావిధిన్,**
**పాండవ మధ్యమా! వినుము పాయరు రాక్షసబుద్ధి మూర్ఖులై.**

7. ఆహారస్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః।
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు॥



వ॥ **ఓ అర్జునా! మానవులు జీవించునదే ఆహారముతో. వారు తిను ఆహారము, చేయు యజ్ఞములు, తపస్సులు, వారి జ్ఞానము ఇవి అన్నియూ కూడా మూడు విధములుగా విభజించ బడినవని తెలియుము.**

8. ఆయుఃసత్త్వబలారోగ్యసుఖప్రీతి వివర్ధనాః।
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాః సాత్త్వికప్రియాః
9. కట్వామ్లలవణాత్యుష్ణ తీక్ష్ణరూక్ష విదాహినః ।
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః॥
10. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్।
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్॥

సీ॥ **ఆయువు, బుద్ధియున్, ఆరోగ్యము, సుఖమ్ము**
**బలమును, ప్రీతిని బరగ చేయు।**
**స్థిరపదార్థములున్న స్నిగ్ధమైనవి యున్న**
**హృద్యమౌసాత్త్వి కాహార మదియె,**
**కారము, లవణమ్ము, కటువును, పులుపున**
**తగని ఆహారమ్ము దాహమిచ్చు**
**రూక్షమై దుఃఖము రోగమ్ము కలిగించు**
**రాజసులును మెచ్చు భోజనంబు,**

**ఆ॥వె॥ చల్లబడినదవుచు సారంబులేనిదౌ**
**చద్ది యెంగిలిదియు సారహీన**
**మై, పవిత్రమవని ఆహార మిద్దియే**
**తగినదయ్యా! పార్థా! తామసులకు.**

11. అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।
యష్టవ్యమేవేతి మనః సమాధాయ స సాత్త్వికః॥

**వ॥ ఇక యజ్ఞము కూడా త్రివిధములు**

**కం॥ తమ బాధ్యతగా తలచుచు**
**తమరేఫలమాశపడక తగు శాస్త్రోక్తిన్**
**అమరగచేసెడి యజ్ఞము**
**అమలంబది, సాత్త్వికంబు అందురు పార్థా!**

12. అభిసంధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్।
ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥

**కం॥ తమకై ఫలమును కోరుచు,**
**తమ దంభము చూపుకొరకు ధాత్రిని, మనుజుల్,**
**అమరగ జేసెడి యజ్ఞము**
**విమలాత్మా! రాజసమ్ము వినుము తగనిదౌ.**



13. విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్।
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥

**తే॥ విడిచి అన్నదానము, శాస్త్రవిధులనన్ని,**
**వీడి మంత్రము దక్షిణ వీరవర్య!**
**శ్రద్ధలేకయే యజ్ఞము జరుప, నదియె**
**తామసంబగు యజ్ఞము ధరణియందు.**

**వ్యాఖ్య: అదే విధంగా తపస్సు కూడా మూడు**
**విధములు. శరీరము, వాక్కు, మనస్సు ఈ మూడు**
**చేసే తపస్సులెలాంటివంటే**

14. దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥

**ఆ॥వె॥ దేవ బ్రాహ్మణ గురు దైవజ్ఞులను గొల్చి,**
**అలరగను అహింస, ఆర్జవంబు,**
**బ్రహ్మచర్య దీక్ష బరగ, శుచిగనుంట**
**మేనుచేయు తపము వినుము పార్థ!**

**వ్యాఖ్య: ఆర్జవము అనగా నిష్కల్మషంగా అహింసతో**
**చేసే వ్రతము లేక పూజ.**



15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥

**ఆ॥వె॥ నిరత మొరుల యెడల నిష్ఠురమ్ములు మాని,**
**మంచి హితవు, నిజపు మాటలాడి,**
**వేదపఠనమందు వెలయుచు నుండుట**
**వాక్కు చేయు తపము పార్థ! వినుము.**

16. మనః ప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః।
భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే ॥

**ఆ॥వె॥ మనసు నిర్మలమయి, మౌనంబు శాంతియున్**
**ఆత్మనిగ్రహంబునందియుంట,**
**అమరియుంట శుద్ధి అంతఃకరణమందు,**
**మనసుచేయు తపము మహిని పార్థ!**

**వ్యాఖ్య: పైన చెప్పబడినటువంటి తపస్సు కూడా సాత్త్విక,**
**రాజస తామస తపస్సులని మూడు విధములుగా**
**విభజించబడినది. అదెట్లనగా**

17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః ।
అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే ॥



**ఆ॥వె॥ త్రివిధములుగనుండు తెలియుము తపములు,**
**ఫలము నాసగనక పార్థ! ఇలను**
**శ్రద్ధతోడి నరులు జరిపెడి తపములు**
**అగును సాత్త్వికములు అవనియందు.**

18. సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్॥

**తే॥ పుడమి సత్కార వాంఛతో పూజలంద**
**దంభమును చూప చేసెడి తపము అదియె**
**అస్థిరంబగు అధృవంబగును సుమ్మి,**
**రాజసంబగు తపమదే రాజశ్రేష్ఠ!**

19. మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః।
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ ॥

**ఆ॥వె॥ మొండి పట్టుదలతో మూర్ఖతన్ దేహమ్ము**
**బాధచెంద, కోరి పరుల హాని**
**తపము నాచరించ తపము నద్దానిన్**
**తామసంబు అనగతగును పార్థ!**

20. దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే।
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్॥

కం॥ దానమె కర్తవ్యంబని
పూనికగా యోగ్యతెరిగి, పుణ్యదినమునన్
కానక ప్రత్యుపకారము
దానము చేయంగ నదియె ధర సాత్త్వికమౌ.

21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః।
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్॥

కం॥ తానాసించుచు ఫలమును
పూనిక నుపకారములను పొందగ, మనుజుల్
మానసమున క్లేశముతో చెందుచు
దానము చేయంగనదియె ధర రాజసమౌ.

22. అదేశకాలే యద్దానమపాత్రేభ్యశ్చ దీయతే ।
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్॥

తే॥ దేశకాలోచితమ్ములు తెలియకుండ,
గౌరవము లేక గ్రహియించువారియందు,
హీనముగ చూచి, పాత్రత లేనివారి-
కిచ్చు దానమె తామస మిలను పార్థ!



23. ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధ స్మృతః।
బ్రాహ్మణస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥

వ॥ **ఓ అర్జునా! పరబ్రహ్మ 'ఓమ్' 'తత్' 'సత్' అనే మూడు శబ్దములచే నిర్దేశింపబడుచున్నాడు. సృష్ట్యాదియందు ఆ బ్రహ్మచేతనే బ్రాహ్మణులును వేదములును, యజ్ఞములును సృజింపబడినవి.**

24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః।
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥

ఆ॥వె॥ వేదవిదులు శాస్త్ర విదితమై జరుపగన్
యజ్ఞదాన తపములాది క్రియలు
'ఓమ్' అనంచు చెప్పి యుర్వినారంభింతు-
రదియె బ్రహ్మరూపమగుటచేత.

25. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపఃక్రియాః ।
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః ॥

తే॥ మోక్షకామి కర్మల ఫలాపేక్షలేక,
యజ్ఞతపమాది కర్మల నన్నికూడ
'తత్' అనంచును పల్కుచు, దానములను
అవని చేయును పరమాత్మదనుచు తలచి.



26. సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే ।
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥

వ॥ **ఓఅర్జునా! 'సత్' అను శబ్దము సత్య విషయములందును, మంచి విషయములందును వాడబడును. అట్లే ఉత్తమ కర్మలయందు కూడ 'సత్' అను శబ్దము ఉపయోగింపబడుచున్నది.**

27. యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే ।
కర్మచైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥

తే॥ తపము యజ్ఞములందును దానమందు
కలుగు నిష్ఠయే 'సత్' అని తెలుపబడును.
ధరణి పరమాత్మ ప్రీతికై జరుపు పనులు
అవియు 'సత్' అని చెప్పగా నగును పార్థ!

28. అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్।
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ॥



వ॥ ఓ అర్జునా ! అశ్రద్ధతో చేయబడిన హోమము, దానము, తపస్సు మరి ఏ ఇతర కర్మలుగాని ఇహలోక ఫలమునుగాని పరలోక ఫలమునుగాని కలుగ జేయవు కనుక ఎవరైనను శ్రద్ధతో మాత్రమే వాటిని చేయవలెను.

**ఇది శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు**
**శ్రీమద్భగవద్గీత లోని**
**శ్రద్ధాత్రయ విభాగ యోగమను**
**పదునేడవ అధ్యాయము**

శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః

# శ్రీమద్భగవద్గీత

## పదునెనిమిదవ అధ్యాయము

## మోక్షసన్న్యాస యోగము



ఈ అధ్యాయమునందు వివరింపబడు ముఖ్యాంశములు:

**1 నుండి 12వ శ్లోకము వరకు**–త్యాగమును గూర్చిన ప్రసంగము.

**13 నుండి 18వ శ్లోకము వరకు** – సాంఖ్యసిద్ధాంత ప్రకారము కర్మల యొక్క స్థితికి కారణము వచించుట. ఆత్మ అకర్తయని బోధించుట.

**19 నుండి 40వ శ్లోకము వరకు** – జ్ఞానము, కర్మ, బుద్ధి, ధృతి, సుఖము వీని యొక్క సాత్త్విక రాజస తామస రూపములు.

**41 నుండి 48వ శ్లోకము వరకు**–చాతుర్వర్ణముల వారి ధర్మములు.

**49 నుండి 55వ శ్లోకము వరకు** – బ్రహ్మసాక్షాత్కార సిద్ధికి ఉపాయములు – జ్ఞాన నిష్ఠను గూర్చిన ప్రసంగము.

**56 నుండి 60వ శ్లోకము వరకు** – భక్తిసహిత నిష్కామ కర్మ యోగము గూర్చిన వర్ణనము.

**61 నుండి 66వ శ్లోకము వరకు**–భగవచ్ఛరణాగతి, గీతాసారసంగ్రహము.

**67 నుండి 73వ శ్లోకము వరకు** – గీతా మహిమ.

**74 నుండి 78వ శ్లోకము వరకు** – సంజయుని గీతా సంస్తుతి.



ఇందు రెండు మూడు పర్యాయములు చదివి అర్థం చేసుకోవలసిన శ్లోకముల సంఖ్యలు:

1, 2, 11, 48, 51, 52, 53, 55, 61, 62, 63, 65, 66,67, 68, 69, 70, 71, 78

ఈ అధ్యాయము చదివినవారికి కలుగు ఫలితము:

సర్వయజ్ఞములు చేసిన ఫలితము, ఉద్యోగప్రాప్తి.

## శ్రీమద్భగవద్గీత

## పదునెనిమిదవ అధ్యాయము

## మోక్షసన్న్యాస యోగము

1. అర్జున ఉవాచ

సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన ॥

**అర్జునుడిలా అన్నాడు**

**కం॥ కరుణాసాగర! కృష్ణా!**
**సరిగా విడమరచి కర్మసన్న్యాసంబున్**
**మరి కర్మత్యాగంబన**
**నెఱిఁగింపుము వాసుదేవ! ఇంపుగ నాకున్.**



2. శ్రీభగవానువాచ

కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః।
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥

**భగవానుడిట్లనుచున్నాడు**

**కం॥ వీడుట ఫలమిడు కర్మల**
**పాడిగ సన్న్యాసమంచు పండితులనగా,**
**క్రీడీ! అందురు ఫలములు**
**వీడుటయే త్యాగమని వివేకులు ధాత్రిన్.**

3. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః।
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥

**ఆ॥వె॥ దోషరహిత కర్మతోచదు ఇలఁగాన**
**కర్మవీడమనెడి గతియు కలదు,**
**దాన యజ్ఞములను, తపమాది కర్మలన్**
**వదలరాదు అనెడి వారు కలరు.**

4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధః సంప్రకీర్తితః ॥

వ॥ అయితే ఓ అర్జునా! నా నిర్ణయం ప్రకారం ఇట్టి త్యాగము మూడు విధములు. అవి సాత్త్వికము, రాజసము, తామసము.

5. యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥

ఆ॥వె॥ దాన యజ్ఞములును తపమాది కర్మలున్
పావనమొనరించు మానవులను,
అందువలన వాని నెందునన్ విడరాదు
ఆచరించవలెను అతిశయముగ.

6. ఏతాన్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।
కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥

ఆ॥వె॥ కర్మచేయవలయు కర్తవ్యముగ నెంచి,
ఫలము మీద ఆశ పనికి రాదు,
నిశ్చితముగ గొప్ప నిర్ణయంబిది నాది,
ఉత్తమంబునదియె యుర్వియందు.

7. నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।
మోహాత్తస్య పరిత్యాగస్తామసః పరికీర్తితః ॥



ఆ॥వె॥ జగతియందు నెపుడు శాస్త్రవిహితమైన
కర్మత్యాగ మనఘ! కాదు హితము,
జ్ఞానరహిత మగుచు జరిపెడి త్యాగము
తామసంబదైన త్యాగమయ్య!

8. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్ ।
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్ ॥

ఆ॥వె॥ కర్మ దుఃఖకరము కడు దేహశ్రమ యని
భీతిచెంది కర్మ విడచునెడల
అనఘ! అట్టి త్యాగమగు రాజసము, కర్త
పొందబోడు ఫలము పుడమియందు.

9. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున ।
సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగః సాత్త్వికో మతః॥

ఆ॥వె॥ శాస్త్ర విహితమైన సరియగు కర్మలన్
ఫలమునందు ఆస వదిలివైచి
కర్మలన్ని చేయ కర్తవ్యముగ పార్థ!
అవని సాత్త్వికంబు అందురయ్య!

10. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలే నానుషజ్జతే ।
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥



ఆ॥వె॥ అకుశలమగు కర్మలనఘ! ద్వేషింపక,
కుశలకర్మ రక్తి కూడదెవడొ
అతడె సత్త్వ త్యాగి, ఆతడె మేధావి,
సంశయాలు లేని సజ్జనుండు.

11. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః ।
యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥

ఆ॥వె॥ తెలియుమయ్య పార్థ! దేహ ధారులకును
కర్మలన్ని వీడ కష్టమగును,
కనుక కర్మఫలము ఘనముగ వీడెడి
వాడె త్యాగియగును వసుధయందు.

12. అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥

వ॥ సుఖకరము, దుఃఖప్రదము, సుఖదుఃఖముల మిశ్రమము అని కర్మఫలములు కర్మలయొక్క శుభాశుభములను బట్టి మూడు విధములు. త్యాగులు కానివారికి ఈ త్రివిధ ఫలములునూ లోకాంతరములందును జన్మాంతరములందును కూడా అనుభవనీయములగును. త్యాగవంతులగు సన్న్యాసులకు మాత్రము అవి యెన్నటికిని కలుగనేరవు.



13. పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥

14. అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥

15. శరీరవాఙ్మనోభిర్యత్కర్మ ప్రారభతే నరః ।
న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥

సీ॥ సర్వ కర్మ లిలను జరుగుటకును నైదు
కారణమ్ములనుచు ఎఱుకపరచె
సాంఖ్యశాస్త్రమటుల సవ్యసాచి! వినుము
వాటిని వివరించువాడ నీకు
జీవుడు, దేహము, దైవ, మింద్రియములు,
అవి నిర్వహించెడి అన్ని పనులు,
వీనిలో దైవమే విధియని అందురు
పూర్వకర్మ వలన పొందు ఫలము,

ఆ॥వె॥ మనిషి తనువు చేత, మనసు, వాక్కుల చేత
న్యాయమైనవైన,అవనివైన
కార్యములు మొదలిడ కారణమ్ములవియె
తెలియుమయ్య పార్థ! దీనినెల్ల.

16. తత్రైవం సతి కర్తారమాత్మానం కేవలం తు యః ।
పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతిః ॥

**వ॥ అట్టి ఐదు కారణాలవల్ల కర్మలన్నీ జరుగు**
**చున్నప్పటికీ విపరీత బుద్ధి చేత ఆత్మ స్వరూపుడగు**
**తననే కర్తగా తలచువాడు అవివేకి.**
**అట్టి అవివేకి కర్మముయొక్కగానీ, ఆత్మయొక్క**
**గానీ వాస్తవ స్వరూపము ఎఱుగకున్నాడు.**

17. యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।
హత్వాఽపి స ఇమాన్ లోకాన్న హన్తి న నిబధ్యతే ॥

**ఆ॥వె॥ కాంచడెవడొ యెపుడు కర్తృత్వ భోక్తృత్వ**
**భావములను, వాడు ప్రాణికోటి**
**వధను జేసి కూడ పాఎకాబోడయ్య**
**హంతకుండు కాదు ఆతడెపుడు.**

18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।
కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥



**వ॥ ఓ అర్జునా! ఇక కర్మల ఆచరణకు మానసిక**
**ప్రేరేపణ జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత**
**అని త్రివిధములు. అట్లే దాని బాహ్య క్రియా**
**రూపము కర్మ, కర్త, కరణము అని త్రివిధములు.**

19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।
ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥

**ఆ॥వె॥ కనుము గుణము బట్టి కర్త, జ్ఞానము, కర్మ**
**లన్ని మూడు విధములయెడి రీతి**
**సాంఖ్యశాస్త్రమిటుల చక్కగా వివరించె,**
**మరల చెపుదునయ్య పార్థ! నీకు.**

20. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తత్‌జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥

**ఆ॥వె॥ అన్ని ప్రాణులందు అవిభక్తమగు రీతి**
**పఱగి, నాశమవని పరమ పురుషు**
**గనెడు వాని జ్ఞాన మనఘ! సాత్త్వికమని**
**తెలియవలయునయ్య దీని నీవు.**

21. పృథక్త్వేన తు యత్‌జ్ఞానం నానాభావాన్పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు తత్‌జ్ఞానం విద్ధి రాజసమ్ ॥



**ఆ॥వె॥ అన్ని ప్రాణులందు అలరు జీవులు వేఱు-**
**వేఱు యంచు తలచి వేఱుపఱచు**
**వాని జ్ఞానమగును పార్థ! రాజసమని,**
**తెలియవలయునయ్య దీని విధము.**

22. యత్తు కృత్స్నవదేకస్మిన్కార్యే సక్తమహైతుకమ్ ।
అతత్త్వార్థవదల్పం చ తత్తామస ముదాహృతమ్ ॥

**తే॥ మేను మాత్రమే సర్వము అనుచు తలచి**
**తత్త్వ జ్ఞానంబు శూన్యమై తనరుచుండు,**
**హేతు బద్ధంబు కానిది, హీనమైన**
**జ్ఞాన మద్దాని తామసంబనెదరయ్య!**

23. నియతం సంగరహితమరాగద్వేషతః కృతమ్ ।
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే ॥

**తే॥ కర్త నేనంచు తలచక, కర్మఫలపు**
**ఆసనొందని పురుషుడు అవని రాగ-**
**ద్వేషములు వీడి, శాస్త్రముతెలుపు కర్మ**
**చేయ, నది సాత్త్వికమ్మని చెప్పబడును.**

24. యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥



**తే॥ తామహంకారమందున తగిలియుండి,**
**అధిక శ్రమలతో ఫలమున ఆస కలిగి,**
**ఎట్టి కర్మనుచేతురో అట్టి కర్మ**
**చెలగి రాజసకర్మని చెప్పబడును.**

25. అనుబన్ధం క్షయం హింసామనవేక్ష్య చ పౌరుషమ్ ।
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే ॥

**తే॥ మంచి చెడ్డలు చూడక మందమతులు**
**వారి సామర్థ్యమెట్టిదో ఎఱుగకుండ,**
**హాని, హింసల నెంచక పూను కర్మ**
**చెలగి తామసకర్మని చెప్పబడును.**

26. ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥

**వ॥ ఓ అర్జునా! ఫలమందు సంగము కాని, కర్తృత్వాభి**
**మానము కాని లేక, ధైర్యోత్సాహములు కలిగి**
**జయాపజయములకు పొంగులు క్రుంగులు లేక**
**నిర్వికారుడైయుండెడి వాడు సాత్త్వికకర్త అని**
**పేర్కొనబడును.**

27. రాగీ కర్మఫలప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥

**తే॥ అవని శుచి లేనివాడు, హింసాత్మకుండు,**
**కర్మఫలకామి, లోభి, రాగముల వశుడు,**
**ముదముశోకము లన్నిట మునుగువాడు,**
**చెలగి రాజసకర్తని చెప్పబడును.**

28. అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః।
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥

**వ॥ ఓ అర్జునా! ఎవడు జితేంద్రియుడు, సుశిక్షితుడు**
**గాక, మూర్ఖుడు, అకారణముగ నితరుల పని**
**చెడగొట్టు ధూర్తుడునయి, నిరంతరము చింతాగ్రస్తుడు,**
**సోమరియు నయి, దీర్ఘసూత్రి (ఇప్పుడు చేయవలసిన**
**పని తరువాత ఎప్పుడో చేసెదమని ఉపేక్షించువాడు)**
**అయి యుండునో వాడు తామసకర్త అని చెప్పబడును.**

29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥

**వ॥ ఓ ధనంజయా! ఇదేవిధంగా గుణములను**
**బట్టి త్రివిధములగు బుద్ధి, ధైర్యము కూడా**
**చెప్పబడినవి.**



30. ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।
బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిః సా పార్థ సాత్త్వికీ॥

**తే॥ ఏదియో ప్రవృత్తి, నివృత్తి యేది యగునొ,**
**ఏది కర్తవ్య మది కానిదేదొ తెలిపి,**
**బంధమును, ముక్తి, అభయమ్ము, భయము తెలుపు**
**నట్టి బుద్ధి సాత్త్వికమని అందురయ్య.**

31. యయా ధర్మమధర్మం చ కార్యం చా కార్యమేవ చ ।
అయథావత్ప్రజానాతి బుద్ధిః సా పార్థ రాజసీ ॥

**తే॥ ఏది ధర్మమో, అది కానిదేది కలదొ,**
**ఏది కర్తవ్యమో, అది యేదికాదొ,**
**అనెడి సందేహములతోటి జనులు పొందు-**
**నట్టి బుద్ధి రాజసమని యనెదరయ్య.**

32. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా ।
సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధి స్సా పార్థ తామసీ ॥

**తే॥ ఎక్కుడవుచుండ అజ్ఞాన, మెల్లప్రజలు**
**ధర్మమును యధర్మంబని తలచుచుండి,**
**ప్రతిది విపరీతముగ చూచు పాడుబుద్ధి**
**తామసమ్మని అందురు ధరణి యందు.**



33. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియక్రియాః।
యోగేనావ్యభిచారిణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ ॥

**తే॥ ప్రాణములు, ఇంద్రియమ్ములు, మనసు చేయు**
**పనుల యోగసాధనయొక్క బలిమిచేత**
**నియతియొనరించి, లక్ష్యము పాయకుండు-**
**నట్టి ధైర్యము సాత్త్వికమందురయ్య.**

34. యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున ।
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిః సా పార్థ రాజసీ ॥

**తే॥ వినుము ధర్మార్థ కామపు విషయములలో**
**కలిగి అభిమాన మనురక్తి ఫలపుటాస,**
**జీవితాదర్శమదెయను భావ మరయు**
**నట్టి ధైర్యము రాజసమందురయ్య!**

35. యయాస్వప్నం భయం శోకం విషాదం మదమేవచ।
న విముంచతి దుర్మేధా ధృతిః సా పార్థ తామసీ॥

**తే॥ భయము, చింతయు, శోకంబు, మదము, నిద్ర**
**అనెడి అవివేక గుణముల నణగుచుండు**
**దుష్టబుద్ధులా గుణముల తోటి పొందు-**
**నట్టి ధైర్యము తామసమందురయ్య.**

36. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి ॥



**వ॥ ఓ భరతశ్రేష్ఠా! అభ్యసించేకొద్దీ ఆనందం,**
**దుఃఖవినాశనం కలుగచేసే సుఖము మూడు**
**విధములు. వాటిగురించి చెపుతాను వినుము.**

37. యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్ ।
తత్సుఖం సాత్త్వికం ప్రోక్తమాత్మబుద్ధిప్రసాదజమ్ ॥

**తే॥ నిర్మలంబగు బుద్ధిచే నిగుడుచుండి**
**మొదట విషతుల్యమై తోచి తుదకు నదియె**
**అమృతతుల్యమౌ సుఖముగా అలరుచుండు**
**అట్టి సుఖమును సాత్త్వికమందురయ్య!**

38. విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేఽమృతోపమమ్।
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥

**తే॥ విషయ, ఇంద్రియ సుఖముచే వెలయు సుఖము**
**మొదట అమృతముగాతోచి తుదకు నదియె**
**విషసమానమై దుఃఖము వెల్లివిరియు,**
**నట్టి సుఖమును రాజసమందురయ్య!**

39. యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః ।
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥

తే॥ నిద్ర, సోమరితనమున నిగుడుచుండి
ఆదియందున అంత్యమునందు కూడ
మోహకారకమయి యాత్మ మోహపఱచు-
నట్టి సుఖమును తామసమందురయ్య!

40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణైః ॥

వ॥ ఓ అర్జునా! పృథ్వియందుగానీ, స్వర్గమునందుగానీ దేవతలయందుగానీ, ప్రకృతినుండి ఉత్పన్నములయిన ఈ మూడు గుణములతో కూడియుండని జీవి యుండదు.

వ్యాఖ్య: భగవానుడు ఇక్కడ నుండి తన బోధామృతమునకు ఉపసంహార మారంభించుచున్నాడు. చతుర్విధ వర్ణముల వారికి వారి స్వభావసిద్ధముగా జనియించు గుణములను బట్టి విహితములైన కర్మలేవో చెప్పబోవుచున్నాడు.

41. బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥



ఆ॥వె॥ ధాత్రి వైశ్య, శూద్ర, క్షత్రియ, బ్రాహ్మణ
వర్గములకు పార్థ! వారి గుణము-
బట్టి కర్మ లిట్లు బాగుగా వేర్పాటు
పఱచబడినవయ్య! వారికెల్ల.

42. శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥

ఆ॥వె॥ ఆత్మనిగ్రహంబు, అతులిత దమమును
తపము, శుచియు, క్షమయు, తగు నడవడి,
జ్ఞాన మాస్తికతయు, తనరు విజ్ఞానమ్ము
ద్విజుల కర్మలనుచు తెలుపబడెను.

43. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।
దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥

ఆ॥వె॥ శౌర్య, తేజములు, ధైర్య, దాక్ష్యమ్ములు
పార్థ! దానగుణము, పౌరుషంబు,
యుక్త పాలనంబు, యుద్ధాన స్థైర్యంబు,
క్షత్రియులకు సహజకర్మలయ్య!

44. కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥



తే॥ పశులపోషణ, సేద్యము, వణిజవృత్తి
సహజసిద్ధమై వైశ్యులు జరుపు కర్మ,
అట్లె సేవలందించుటే అవని సహజ-
మైనకర్మలు శూద్రుల కనుచు వినుము.

45. స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।
స్వకర్మనిరతః సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు ॥

వ॥ ఓ అర్జునా! మానవులు తాము చేయవలసిన స్వాభావిక కర్మలు తత్పరతతో చేసి జ్ఞాన యోగ్యతా రూప సిద్ధిని పొందుచున్నారు. ఇక స్వకీయ (తను ఎన్నుకొన్న) కర్మయందు ఆసక్తికల మానవులు ఎట్లు అట్టి సిద్ధినే పొందెదరో తెలిపెదను వినుము.

46. యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్।
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః ॥

ఆ॥వె॥ సర్వప్రాణికోటి జనియించి వర్ధిల్ల
కారణంబు అయిన పరమపురుష-
డైన విశ్వవ్యాప్తు తనదైన కర్మల-
చేత పూజచేయ సిద్ధికలుగు.



47. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥

ఉ॥ బాగుగ ఆచరించు పెఱవారల ధర్మము కంటె ఈ భువిని
ఏగుణమైనలేని తను యెంచిన ధర్మమె కొంచెమైననున్
బాగవు ధర్మమంచనెద పార్థ! అదేమన ఆ స్వధర్మమే
వీగక చేయువాని కిదు వేగమె పాపవిముక్తి నింపుగన్

48. సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।
సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥

ఉ॥ నిర్మలమూర్తివై వినుము, నిప్పును కమ్మిన ధూమ మట్లు ఈ
కర్మల నావరించుకొని కమ్ముచు నుండును దోషమందుచే
కర్మల యందు దోషమును కాంచిన నైనను, కర్మలెన్నడున్
ధర్మము కాదు వీడగను, ధాత్రి నెరుంగుము పాండునందనా!

49. అసక్తబుద్ధిః సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥

ఆ॥వె॥ అన్ని విషయములను ఆసక్తి రహితుడై
ఆత్మనిగ్రహించనట్టి కర్మ-
ఫలపుత్యాగి ఇలను బాగుగ నైష్కర్మ్య-
సిద్ధి పొందునయ్య! చెపుదు వినుము.

50. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాఽఽప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥

**వ॥ ఓ అర్జునా! నైష్కర్మ్య సిద్ధిని పొందిన పిదప జ్ఞానయోగముయొక్క పరాకాష్ఠ అయిన బ్రహ్మప్రాప్తిని మనుష్యుడు పొందు రీతిని సంగ్రహముగా చెప్పెదను వినుము.**

51. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో
ధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా
రాగద్వేషౌ వ్యుదస్య చ ॥

52. వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయ మానసః ।
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥

53. అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్।
విముచ్య నిర్మమఃశాన్తో బ్రహ్మభూయాయ కల్పతే ॥

**వ॥ విశుద్ధమైన బుద్ధికలవాడును, ధైర్యముతో మనస్సును స్వాధీనపరచుకొనువాడునూ, శబ్ద స్పర్శాది విషయములను వీడువాడునూ, రాగద్వేషములను పరిత్యజించువాడునూ, ఏకాంతవాసియునూ,**



**మితాహారియునూ, మనోవాక్కాయములను వశమందుంచుకొనువాడునూ; ఎల్లప్పుడూ ధ్యానయోగ తత్పరుడు అయినవాడునూ; వైరాగ్యము లెస్సగా నవలంబించినవాడునూ; తన దోషములైన అహంకారమునూ, బలమునూ, దంబమునూ, కామమునూ, క్రోధమునూ, వస్తు సంగ్రహణమును బాగుగా వదిలివైచినవాడునూ; మమతా రహితుడును, శాంతుడు అయియుండువాడు బ్రహ్మ స్వరూపము నందుటకు (మోక్షమునకు) సమర్థుడగుచున్నాడు.**

54. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥

**తే॥ బ్రహ్మభూతుడు, నిర్మల మానసమున
దేని నాసింప దాతండు, దిగులుపడడు,
అన్ని భూతాల సమభావ మరయుచుండ-
నా పరాభక్తి నొందును అతిశయించి.**

55. భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్ ॥



**తే॥ ఎఱుగు నన్నట్టి భక్తిచే, ఎఱుగు నాదు
శక్తి ఎట్టిదో, ఆపైన సవ్యసాచి!
నాదు తత్త్వంబు నెఱుగును నరుడు యిలను,
పిదప లీనమౌ నాలోనె అదియె నిజము.**

**వ్యాఖ్య: పై శ్లోకమున జ్ఞానముచే భక్తి కలుగునని చెప్పబడెను. ఇప్పుడు భక్తిచే జ్ఞానము ఉదయించునని పరమాత్మ చెప్పబోవుచున్నాడు. దీనినిబట్టి భక్తి జ్ఞానములు ఒకదానినొకటి పోషించుకొనుచున్నవని స్పష్టమగుచున్నది. భక్తి యను పుష్పమే జ్ఞానమను ఫలముగా మారుచుండును. భక్తి సులభసాధ్యమగుట వలన మోక్షసంపాదనకు భక్తియే మొదటి మెట్టు అగుచున్నది. భక్తి లేనిదే మిగతా యోగములు సాధించుట కష్టము.**

56. సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥



**ఆ॥వె॥ సర్వకర్మములను సలుపుచుండియునైన
నన్ను ఆశ్రయించి, నాదు కరుణ
నాశరహితమై సనాతనంబైనట్టి
పరమపదమునొందు పరమయోగి.**

57. చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ ॥

**ఆ॥వె॥ కర్మలన్ని నాకు కదు ప్రీతి నర్పించి
బుద్ధియోగమున్ను పూనియుండి
పరమగతిగ నెంచి మనసు నాపై నిల్పి
నన్ను ఆశ్రయించు నయముమీర.**

58. మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।
అథ చేత్త్వమహంకారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి ॥

**ఆ॥వె॥ నన్ను మదినియుంచి నా అనుగ్రహమున
భవజలధిని దాటి పరగగలవు
నీవు గర్వమెక్కి చెవిబెట్టకుండిన
భ్రష్టుడగుదువయ్య పార్థ! నిజము.**

59. యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే।
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥

**కం॥ ఈయెడ నహంకరించుచు**
**చేయను యుద్ధమ్మనంచు చింతించిననూ,**
**నీ యోచన సిద్ధింపదు**
**నీ యా గుణమనికి నిన్ను నియమించు సుమా!**

60. స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ ॥

**వ॥ ఓ కౌంతేయా! నీవు స్వభావమునకు అనుగుణ్య**
**మగు కర్మచే బద్ధుడవై ఏపనిని యుద్ధమున చేయుటకు**
**అవివేకమున ఇష్టపడకున్నావో దానిని కర్మాధీనుడవై**
**తప్పక చేసియే తీరుదువు.**

61. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥

**కం॥ పరమేశ్వరుడీ ధాత్రిని**
**మరబొమ్మల రూపులైన మనుజుల మదిలో**
**స్థిరముగ మాయతొ నెలకొని**
**నరులను భ్రమలోన ముంచి నర్తిలచేయున్.**



62. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥

**కం॥ ఈశ్వరునే శరణందుము**
**ఈశ్వరుడే పరమశాంతి ఇచ్చును దయతో**
**ఐశ్వర్యమ్మును పొందుచు**
**శాశ్వతమగు మోక్షమందజాలుదు వనఘా!**

63. ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥

**ఆ॥వె॥ అమిత గోప్యమైన అరుదైన జ్ఞానమున్**
**చెప్పినాడ నీకు చెలిమితోడ,**
**బుద్ధి కేది హితమొ పూర్తిగ యోచించి**
**ఆచరించుమయ్య అదియె నీవు.**

64. సర్వగుహ్యతమం భూయః శృణు మే పరమం వచః।
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥

**వ॥ సమస్త రహస్యములందునూ పరమ రహస్యమునూ,**
**శ్రేష్ఠమునూ అయిన వచనములను మఱియొక మారు**
**వినుము. నీవు నాకు అత్యంత ప్రియుడవగుట వలన**
**నీకు హితము గూర్చు వచనములను చెప్పుచున్నాను.**



65. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥

66. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥

67. ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి॥

68. య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః॥

**సీ॥ నా మీద మనసుంచి నను భక్తి పూజించి**
**వందనంబును చేసి పొందగలవు,**
**ప్రతినపూని చెబుదు పరమహితుడవౌట**
**నిజమయ్య! నామాట నీవు వినుము,**
**ధర్మములన్నియున్ త్యజియించి శరణొంద**
**పాపముక్తునిచేతు, భయమువలదు**
**ఇటు నీకు బోధించు ఈ గీత నెన్నడు**
**నా తపమును వీడు నాస్తికునకు,**
**నను దూరువానికిన్, విన శ్రద్ధలేకున్న**
**వానికి నేర్పగ పాడికాదు**



**తే॥ పరమ గోప్యమౌ ఈ గీత పరమ భక్తి**
**నాదు భక్తుల మదియందు పదిలపఱచు**
**నట్లు నేర్పించు మనుజుడు అనఘ! నన్నె**
**పొందితీరును సందేహమొందవలదు.**

69. న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి ॥

**వ॥ నాకు ప్రీతిని గూర్చునట్టి కర్మలనాచరించు**
**మనుష్యులలో పై చెప్పబడిన వానిని మించిన**
**భక్తుడెవడూ లేడు. అంతేగాక అతనివలెగాని అతనిని**
**మించిగానీ నాకు ప్రియమైనవాడు భూమండలమున**
**మరియొకడు లేడు. భవిష్యత్తున కూడా ఉండబోడు.**

70. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।
జ్ఞానయజ్ఞేన తేనాహమిష్టః స్యామితి మే మతిః ॥

**ఆ॥వె॥ ధాత్రి మన యిరువురి ధర్మసంవాదంబు**
**అయిన గీత నెపుడు అమిత శ్రద్ధ**
**జదువువారు నన్ను జ్ఞాన యజ్ఞము చేత**
**కొలుచుననుట నిజము కుంతిపుత్ర !**

71. శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।
సోఽపి ముక్తశ్శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్పుణ్య కర్మణామ్ ॥

72.	కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రనష్టస్తే ధనంజయ ॥

వ॥	**ఓ పార్థా! ఈ గీతా శాస్త్రమును నీవు ఏకాగ్ర చిత్తముతో**
**వింటివి కదా, అజ్ఞాన జనితమైన నీ మోహము**
**పూర్తిగా నశించినదా? లేదా?**

73.	అర్జున ఉవాచ
నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥

**అర్జునుడు ఇలాఅన్నాడు**

ఉ॥	**నీ దయచేత నాకు గల నీచపు మోహము వీడె, నాకు దా**
**మోదర! సందియంబులును మొత్తము తీరెను, అందుచేత నీ**
**పాదములాన చెప్పెడిది పాయక చేతును, నన్ను బ్రోవుమా**
**సాదర మొప్పనో విజయసారథి! దాసుడ నీకు నచ్యుతా!**

74.	సంజయ ఉవాచ
ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।
సంవాదమిమమశ్రౌషమద్భుతం రోమహర్షణమ్ ॥

**సంజయుడు ఇలా అన్నాడు**



ఆ॥వె॥ **భక్తుడైన క్రీడి భగవాను సంవాద-**
**సారమంత వింటి చక్కగాను**
**అద్భుతంబు అయిన యది విన గురునాథ!**
**ఒడలు పులకరింపు నొనర చేయు.**

75.	వ్యాసప్రసాదాచ్ఛ్రుతవానే తద్గుహ్యమహం పరమ్ ।
యోగం యోగేశ్వరాత్కృష్ణాత్సాక్షాత్కథయతస్స్వయమ్ ॥

తే॥	**కృపతొ యోగేశ్వరుండైన కృష్ణమూర్తి**
**గీత యను శాస్త్రమును చెప్పె క్రీడి కిట్లు,**
**వింటి ప్రత్యక్షముగ నేను వేదవ్యాసు**
**దయతొ దివ్య దృష్టిని పొంది తనివిదీర.**

76.	రాజన్సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్।
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ
ముహుర్ముహుః॥

ఆ॥వె॥ **చక్రి క్రీడి నడుమ సంవాదమే ‘గీత’,**
**అద్భుతంబు, పుణ్యమైన దాని**
**తలచి తలచి నేను, ధరణీపతీ! విని**
**మరల మరల ముదము నరయుచుంటి.**

77.	తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః।
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః॥



ఆ॥వె॥ **దృఢముగాను చెపుదు ధృతరాష్ట్ర భూపతీ!**
**విశ్వరూపు గాంచ విస్మయంబు**
**కలిగె, దాని మరల తలచుచు నేనెంతొ**
**సంతసించుచుంటి సత్యముగను.**

78.	యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిః, ధ్రువా నీతిర్మతిర్మమ ॥

మ॥	వినుు యోగేశ్వరుడైన కృష్ణుడును, తాన్ విల్లంబుతో పార్థుడున్
ఘనులై యెచ్చట నుందురో శుభములున్ కానంబడున్అద్దరిన్,
ఎనలేకుండగ సంపదల్, విజయముల్, ఇంపైన ఐశ్వర్యముల్
మనగా సుస్థిరనీతి నిశ్చయము నా మాటిట్లు పృథ్వీశ్వరా!

## ఇది శ్రీకృష్ణార్జున సంవాద రూపమగు
## శ్రీమద్భగవద్గీతలోని
## మోక్షసన్న్యాస యోగమను
## పదునెనిమిదవ అధ్యాయము
## సంపూర్ణము.



## హరిః ఓం తత్సత్
## ఓం శాంతిః శాంతిః శాంతిః
## సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

